శుక్రవారం

02-01-2026

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 10, సంచిక : 102

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

పలస్తీనాకు సంఘీభావంగా ఇస్తాంబుల్‌లో ర్యాలీ

ఇస్తాంబుల్: పలస్తీనాకు సంఘీభావంగా వేలాది మంది టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో భారీ ప్రదర్శన చేపట్టారు. గడ్డకట్టే చలిని సైతం లెక్క చేయకుండా చారిత్రక గలాటా బ్రిడ్జిపై ర్యాలీ నిర్వహించారు. పలస్తీనా, టర్కీ జెండాలతో కదంతొక్కారు. 'మౌనంగా ఉండం', 'పలస్తీనాను మరువం' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. టర్కీ ఫుట్‌బాల్ క్లబ్‌తో పాటు 'నేషనల్ విల్ ప్లాట్‌ఫామ్' అధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో 400కి పైగా పౌర సంఘాలు భాగస్వామ్యమయ్యాయి. ఇజ్రాయిల్ దాడులను నిరసనకారులు తీవ్రంగా ఖండించారు. అమానుషత్వాన్ని ఆక్షేపించారు. టర్కీ ప్రదర్శనల్లో ఇంత భారీ స్థాయిలో ఇటీవల ర్యాలీ నిర్వహించిన దాఖలాలు లేవు.

గ్రామీణ ఉపాధి నిర్వీర్యం

- పని హక్కు కాలరాసేదిగా 'వీబీ జీ రామ్ జీ'
- కొత్త చట్టంతో రాష్ట్రాలపై తప్పని భారం
- ఎంజీఎన్‌ఆర్‌ఈజీప పునరుద్ధరణకు డిమాండ్
- ప్రతిపక్షాలు-కార్మిక-కర్షకుల ఐక్యపోరాటాలు
- 5న దేశవ్యాప్త సమ్మెకు కాంగ్రెస్ పిలుపు

న్యూదిల్లీ: యూపీఏ-1 హయాంలో రెండు దశాబ్దాల క్రితం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) మోదీ ప్రభుత్వం స్వస్తి పలికింది. దాని స్థానంలో వికసిత్ భారత్-ఉపాధికి హామీ, అజీవికా మిషన్ చట్టం తీసుకొచ్చింది. దీనిని వీబీ జీ రామ్ జీగా నామకరణం చేసింది. ఉపాధి హామీ చట్టానికి మతం రంగు పులిమే ప్రయత్నం సర్వత్రా విమర్శలకు దారితీసింది. ప్రతిపక్షాలు, హక్కుల కార్యకర్తల నుంచి వ్యతిరేకత వచ్చింది. పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికీ మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించింది. వీబీ జీ రామ్ జీ చట్టాన్ని ఆమోదింపజేయించింది. రాష్ట్రపతి కూడా దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కొత్త చట్టం అమలు... పాత చట్టం కోసం డిమాండ్ క్రమంలో నూతన సంవత్సరంలో గ్రామీణ ఉపాధి ముఖ చిత్రం మారబోతోందా అన్న చర్చ పెద్దఎత్తున సాగుతోంది.

వాస్తవానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ డిమాండ్‌పై ఆధారపడుతుంది. 100 శాతం నిధులు... అవసరమైతే అదనపు నిధులను కేంద్రమే ఇచ్చేది. కానీ, కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ రాష్ట్రాలకు సాధారణ కేటాయింపులు కల్పిస్తుంది. వ్యయాన్ని 60:40 లెక్కన కేంద్రం, రాష్ట్రాల మధ్య పంచుతుంది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిగా నిర్ణయించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు మాత్రం 100 శాతం కేంద్రమే భరిస్తుంది. అయితే కొత్త చట్టంతో రాష్ట్రాలపై భారం పెరుగుతుందని, క్రమంగా ప్రజలకు పని ఉండదని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తంచేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ ఆర్‌ఈజీఏ) కల్పించిన హక్కులను కాలరాస్తున్నట్లు ఆరోపించారు. మహాత్మాగాంధీ పేరు తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే వీబీ-జీ రామ్ జీ చట్టంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇది ఎంజీఎన్ ఆర్‌ఈజీఏ కంటే మెరుగైనదని గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించుకున్నారు. గ్రామీణ ఉపాధి అభివృద్ధికి సమగ్ర ఆయుధంగా మార్చే చట్టం తెచ్చినట్లు చెప్పుకొచ్చారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద 100 రోజుల వేతనంతో కూడిన పని గ్రామీణులకు లభించేది. వీబీ జీ రామ్ జీ మాత్రం 125 రోజుల పనికి హామీనిస్తోంది. దీంతో పని భద్రత మెరుగవుతుందన్నది ప్రభుత్వ వాదన. సామాజిక హక్కుల కార్యకర్తలు ఈ వాదనను తోసిపుచ్చారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏతో సగటున 50 రోజుల పని ఉండేదని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని 2024-25 పార్లమెంటు శీతాకాల

- మిగతా 2 లో

జీఎస్‌టీ వసూళ్లు రూ.2,652 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వస్తు సేవల పన్ను వసూళ్లు (జీఎస్‌టీ) 2.0 సంస్కరణల నేపథ్యంలో పన్ను రేట్లు తగ్గించినప్పటికీ 2025, డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ నెట్ జీఎస్‌టీ వసూళ్లు 5.78 శాతం వృద్ధితో రూ.2,652 కోట్లకు చేరాయని చీఫ్ కమిషనర్ బాబు ఏ తెలిపారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన 2017 తర్వాత డిసెంబరు నెలలో ఇదే అత్యధిక వసూళ్లుగా పేర్కొన్నారు. 2024తో పోలిస్తే జాతీయ సగటు (5.61శాతం) కంటే ఎక్కువ వృద్ధి సాధించిన ఏపీ, దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత రెండో

- మిగతా 2 లో

ప్రధాని పేరిట మెయిల్స్... రంగంలోకి సీబీఐ

న్యూదిల్లీ: తనకు ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నాయని, స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్‌ను రూపొందించాలనుకుంటున్నట్లు రక్షణారంగ సంస్థలు, అధికారులకు ఈ మెయిల్స్ పంపిన ఓ వ్యక్తిపై సీబీఐ కేసు నమోదు చేసింది. దిల్లీలోని వసంత్‌కుంజ్‌కు చెందిన నిశీత్ కోహ్లీ తనను తాను టెక్స్‌టైల్ కెమిస్ట్రీ ఇంజినీర్‌గా పరిచయం చేసుకునేవాడు. స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్ రూపకల్పనకు సాయపడతానంటూ 2024 అక్టోబరు- డిసెంబరు మధ్యకాలంలో డీఆర్‌డీవోకు చెందిన

- మిగతా 2 లో

కార్ల టెండర్‌పై వెనక్కి తగ్గిన లోక్‌పాల్

న్యూదిల్లీ: అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ లోక్‌పాల్ ఒక్కొక్కటి రూ.70 లక్షల విలువైన ఏడు బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్ ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో లోక్‌పాల్ వెనక్కి తగ్గింది. ఆ కార్ల టెండర్‌ను రద్దు చేసింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లోక్‌పాల్ చైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ సహా ఏడుగురు జ్యుడీషియల్, నాన్-జ్యుడీషియల్ సభ్యుల కోసం కొన్నినెలల క్రితం కార్ల టెండర్‌ను లోక్‌పాల్ ఆహ్వానించింది. ఎంపికైన విక్రయదారు బీఎండబ్ల్యూ కార్లను నడిపే విధానంపై ఏడు రోజులు తమ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని, ఈ

- మిగతా 2 లో

గవర్నర్‌కు కూనంనేని నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణు దేవ్ వర్మని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఉన్నారు.

- విశాలాంధ్ర, హైదరాబాద్

గ్యాస్ బాదుడు

- వాణిజ్య సిలిండర్‌పై రూ.111 పెంపు
- విమాన ఇంధనం ధర తగ్గింపు

న్యూదిల్లీ: విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీగా తగ్గించాయి. విమానయాన రంగానికి ఊరట కల్పిస్తూ ఏటీఎఫ్ ధరలో 7.3 శాతం మేర కోత పెట్టాయి. అదే సమయంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.111 భారం వేశాయి. నెలవారీ మదింపులో భాగంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా చమురు సంస్థలు ఈ ధరల సవరణ చేపట్టాయి. పెరిగిన ధరలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ధరల సవరణ తర్వాత దిల్లీలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.7,353.75 తగ్గి రూ.92,323.02కి చేరింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో వరుసగా మూడుసార్లు ఏటీఎఫ్ ధరలు పెంచుతూ వచ్చాయి. చమురు కంపెనీల తాజా నిర్ణయంతో విమానయాన సంస్థలపై ఆర్థికంగా భారం తగ్గనుంది. విమానాలు నడిపేందుకు అయ్యే మొత్తం ఖర్చులో ఏటీఎఫ్‌దే 40 శాతం వాటా. స్థానిక పన్నుల కారణంగా ఏటీఎఫ్ ధర దేశంలోని ఒక్కో నగరంలో ఒక్కోలా ఉంటుంది. మరోవైపు 19 కేజీల వాణిజ్య సిలిండర్

- మిగతా 2 లో

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన పరిధిలో సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని సీఎం ఆవిష్కరించారు. జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ ముఖ్యమంత్రిని కోరారు. ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యాణి రాములు,

- మిగతా 2 లో

కేసీఆర్ హయాంలోనే

తీరని అన్యాయం

- ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే
- జల వివాదంతో పార్టీని బతికించుకునే ప్రయత్నం
- సాగునీటిపై చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ప్రజాభవన్‌లో 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ అండ్ కో తమ ప్రభుత్వంపై కావాలనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి నీళ్లే ప్రధాన కారణమని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీజలాలను సక్రమంగా వాడుకున్నట్లయితే ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ ఉండేదన్నారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయని... వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలది సంకుచిత స్వభావమని విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఏపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ నీటి చౌర్యం చేస్తున్నా కూడా మన (తెలంగాణ) నీటివాటాను మనం వాడుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్

- మిగతా 2 లో

సిగరెట్, పాన్ మసాలాపై 40 శాతం జీఎస్‌టీ

ఫిబ్రవరి 1 నుంచి అమలు

న్యూదిల్లీ: పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కేంద్ర ప్రభుత్వం విధించిన సెస్సు ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా నోటిఫికేషన్ విడుదలైంది. పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై 40 శాతం, బీడీలపై 18 శాతం జీఎస్‌టీని కేంద్రం విధించింది. ఈ పన్నుతో పాటు పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ పెంపు, పొగాకుతో పాటు సంబంధిత ఉత్పత్తులకు ఎక్సైజ్ సుంకం వేసింది. ఇవన్నీ ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలవుతాయి. పాన్ మసాలా తయారీపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ విధించేలా రెండు బిల్లులను పార్లమెంట్ డిసెంబర్‌లో ఆమోదించింది. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్

- మిగతా 2 లో

జీరో రోడ్డు ప్రమాదాలు

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు 'రోడ్డు భద్రత మాసోత్సవ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కలెక్టర్, పోలీసు అధికారులు, విద్యాశాఖ, ఆర్ అండ్ బీ తదితర విభాగాల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ కళా భవన్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు - 2026 (సడక్ సురక్ష - జీవన్ రక్ష) ప్రారంభోత్సవ వేడుకలో గురువారం ప్రమాద రహిత డ్రైవర్లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. 30 ఏళ్లకు పైగా బస్ నడుపుతూ ఒక్క ప్రమాదం కూడా చేయని 18 మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దీన్ని ప్రాముఖ్యతగా తీసుకొని నెల రోజుల పాటు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలన్న నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రవాణా శాఖ విద్యార్థులకు ఒక అప్లికేషన్ ఇస్తుందని, వారి తల్లిదండ్రుల వద్ద నుంచి రోడ్డు నిబంధనలు పాటిస్తాం... అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయమని అఫిడవిట్ తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు భద్రత పై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధికారులు వెయ్యి మంది ఉంటే రాష్ట్రంలో కోటి 80 లక్షల వాహనాలు ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో

- మిగతా 2 లో

630 మంది పోలీసులకు సేవా పతకాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 630 మంది పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ముఖ్యమంత్రి సర్వోన్నత సేవా పతకానికి ఇంటెలిజెన్స్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మహేశ్ కుమార్ లఖాని ఎంపికయ్యారు. ఆయనకు రూ.ఐదు లక్షల రివార్డు అందజేయనున్నారు. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర పోలీసు అధికారులకు ఏడు శౌర్య పతకాలు, 53 కఠిన సేవా పతకాలు, 16 మహోన్నత సేవా పతకాలు, 94 ఉత్తమ సేవా పతకాలు, 459 సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది.

కేసీఆర్‌ను సీఎంగా చూడడమే లక్ష్యం

- తిరోగమనం వైపు కాంగ్రెస్ పాలన
- యూరియా కోసం దయనీయస్థితి
- గెలుపోటములు శాశ్వతం కాదు: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి వైపు కాకుండా తిరోగమనం వైపు ప్రయాణిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూనే కాంగ్రెస్ పాలనపై విమర్శలు ఎక్కుపెట్టారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలిలో దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్ల పాటు కేసీఆర్

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కొత్త జిల్లాలైనా పాత కబ్జాలు కంటిన్యూ చేయొచ్చుగా బ్రో!

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

స్విస్‌లో భారీ పేలుడు...రష్యాపై డ్రోన్ దాడులు

64 మంది మృతి, అనేకమందికి తీవ్ర గాయాలు

జూరిచ్: స్విట్జర్లాండ్, రష్యాలో నూతన సంవత్సర వేడుకలు తీవ్ర విషాదాంతమయ్యాయి. స్విట్జర్లాండ్ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్-మోంటానాలోని ఓ బార్‌లో గురువారం తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. 'లీ కాన్స్టెలేషన్' అనే బార్‌లో పర్యాటకులు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటుండగా ఈ ఘోరఘటన చోటు చేసుకుంది. స్థానిక పత్రిక 'లీ నోవెల్లిస్ట్' కథనం ప్రకారం.. ఈ ప్రమాదంలో దాదాపు 40 మంది మరణించారని, 100 మందికి పైగా గాయపడ్డారని తెలిసింది. ఘటన జరిగిన సమయంలో బార్‌లో 100 మందికి పైగా పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. అయితే మరణాల సంఖ్యపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 1:30 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. వాలిస్ కంటోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేలుడు ధాటికి మంటలు చెలరేగాయి. కాగా, పేలుడుకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీస్ ప్రతినిధి గేటన్ లాథియన్ పేర్కొన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది సెలవుల కోసం వచ్చిన విదేశీ పర్యాటకులేనని ఆయన పేర్కొన్నారు. కాగా, ఓ సంగీత కచేరీ సందర్భంగా కాల్చిన బాణసంచా వల్లే మంటలు అంటుకుని పేలుడు సంభవించి ఉండవచ్చని స్విస్ మీడియా సంస్థ 'బ్లిక్' అనుమానం వ్యక్తం చేసింది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. హెలికాప్టర్ల ద్వారా క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో నో-ఫ్లై జోన్ విధించారు. బాధితుల బంధువుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు.

ఖేర్సన్‌లో డ్రోన్స్‌తోఉక్రెయిన్ దాడి

మాస్కో: రష్యాలోని ఖేర్సన్ ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న ఓ కేఫ్‌పై, హోటల్‌పై ఉక్రెయిన్ మూడు డ్రోన్లతో దాడి చేసింది. అర్ధరాత్రి సమయంలో చేసిన దాడిలో కనీసం 24 మంది మరణిం చగా, 50 మందికి పైగా గాయపడ్డారు. "పౌరులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న ప్రదేశంపై శత్రువులు డ్రోన్‌లతో దాడికి పాల్పడ్డారు. నల్ల సముద్ర తీరంలోని ఖేర్సన్ ప్రాంతంలో ఉన్న ఒక కేఫ్, హోటల్‌పై ఉక్రెయిన్‌కు చెందిన మూడు యూఏవీ డ్రోన్‌లు దాడి చేశాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం, ఈ దాడిలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా మరణించారు."

అనేక డ్రోన్‌లను నేలకూల్చాం: రష్యా

"నూతన సంవత్సరం వేడుకల వేళ, రాత్రి సమయంలో ఉక్రెయిన్ డ్రోన్‌లతో లక్షిత దాడులకు పాల్పడింది. అయితే రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు ఏకంగా 168 ఉక్రెయిన్ యూఏవీలను అడ్డుకుని ధ్వంసం చేశాయి. ఒక్క బ్రయాన్స్క్ ప్రాంతంలోనే 61 డ్రోన్‌లను కూల్చేశాం. ఇక క్రాస్నోడార్‌లో 25, తుల ప్రాంతంలో 23, క్రిమియా రిపబ్లిక్‌లో 16, కలుగాలో 7, మాస్కో ప్రాంతంలో 12 డ్రోన్‌లను కూల్చేశాం. వీటిలో రాజధాని మాస్కో వైపు గురిపెట్టిన 9 యూఏవీలు కూడా ఉన్నాయి. ఇక అజోవ్ సముద్ర జలాలపై 24 ఉక్రెయిన్ డ్రోన్‌లను పేల్చేశాం. అయితే ఈ డ్రోన్‌ల దాడి వల్ల దక్షిణ, మధ్య రష్యాల్లోని అనేక విమానాశ్రయాలు గంటల తరబడి మూసివేయడం జరిగింది" అని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ గురువారం ఉదయం ప్రకటించింది.

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ ప్రమాణం

వాషింగ్టన్: భారతీయ మూలాలు ఉన్న జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మన్‌హటన్‌లోని చరిత్రాత్మక 'సిటీ హాల్' సబ్‌వే స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ బాధ్యతలు స్వీకరించారు. డెమోక్రాట్ పార్టీకి చెందిన మమ్దానీ న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ సమక్షంలో ఖురాన్‌పై చేయి వేసి ప్రమాణం చేశారు. న్యూయార్క్ నగర 112వ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. కేవలం 34 ఏళ్ల వయసులోనే మేయర్? పదవిని చేపట్టిన మమ్దానీ, అరుదైన రికార్డులు సాధించారు. అమెరికాలోని అతిపెద్ద నగరానికి మొదటి ముస్లిం నేతగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. తొలి దక్షిణాసియా (సౌత్ ఏషియన్) మేయర్‌గా నిలిచారు. అంతేకాదు, గత శతాబ్దానికి పైగా కాలంలో అత్యంత పిన్న వయసులో మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా కూడా రికార్డు సృష్టించారు. పదవి దక్కించుకున్న తొలి భారత- అమెరికన్ ముస్లింగా నిలిచారు. ప్రమాణం అనంతరం మమ్దానీ మాట్లాడుతూ ఇది నిజంగా జీవితంలో ఒక గొప్ప గౌరవమని, అదృష్టమని పేర్కొన్నారు. ఆ వేదికను ఎంపిక చేసుకోవడంపై మమ్దానీ మాట్లాడుతూ "పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నగర జీవనానికి ఎంత ముఖ్యమో ఇది గుర్తు చేస్తుంది. ఇది న్యూయార్క్ ఆరోగ్యానికి, వారసత్వానికి నిదర్శనం" అని అన్నారు. అదే సమయంలో నగర రవాణా శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్) కొత్త కమిషనర్‌గా అనుభవజ్ఞుడైన సిటీ ప్లానర్ మైఖేల్ ఫ్లిన్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. గతేడాది నవంబర్‌లో న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో మమ్దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 33 ఏళ్ల జొహ్రాన్ మేయర్‌గా విజయం సాధించారు. అమెరికాలోనే అత్యంత ఖరీదైన నగరంగా పేరున్న న్యూయార్క్‌కు కొత్త మేయర్‌గా నిలిచారు. భారతీయ మూలాలున్న మమ్దానీ బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు.

పాక్‌లో వస్త్ర పరిశ్రమల మూత

- పడిపోయిన ఎగుమతులు
- అధ్వానంగా పత్తి ఉత్పత్తి... చెరకు సాగుపై రైతుల మక్కువ

ఇస్లామాబాద్: ఒకప్పుడు పాకిస్తాన్ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషించిన టెక్స్‌టైల్ (జౌళి) పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, విద్యుత్ చార్జీల భారం, తగ్గిన పత్తి దిగుబడి కారణంగా ఆ దేశంలోని ఫ్యాక్టరీలు వరుసగా మూతపడుతున్నాయి. ఈ మేరకు పాక్ టెక్స్‌టైల్ రంగం ఎదుర్కొంటున్న దుస్థితిపై యూకేకు చెందిన 'డైలీ మిర్రర్' ఓ కథనం ప్రచురించింది. పాకిస్థాన్ టెక్స్‌టైల్ ఎక్స్ పోర్టర్స్ అసోసియేషన్ (పీటీఈఏ) సమాచారం ప్రకారం... టెక్స్‌టైల్ ఎగుమతులు వరుసగా నాలుగో నెలలోనూ తగ్గుముఖం పట్టాయి. గతేడాది జు/లై నుంచి నవంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 6.39 శాతం తగ్గి, 12.844 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు పీటీఈఏ జనరల్ సెక్రటరీ అజీజుల్లా గోహీర్ తెలిపారు. ఒకప్పుడు 19.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు క్రమంగా 17 బిలియన్ డాలర్లకు, అక్కడి నుంచి మరింత కిందకు పడిపోవడమే తప్ప కోలుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారత్, బంగ్లాదేశ్, చైనా, వియత్నాం దేశాలు తక్కువ ఖర్చుతో వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ ప్రపంచ మార్కెట్లో పాకిస్థాన్ వాటాను దెబ్బతీస్తున్నాయి. ఆయా దేశాల్లో స్థిరమైన ప్రభుత్వ విధానాలు, తక్కువ విద్యుత్ చార్జీలు ఉండటంతో పాక్ పరిశ్రమలు వాటితో పోటీపడలేకపోతున్నాయి. దీనికి తోడు పాకిస్థాన్‌లో పత్తి ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. పాత సాగు పద్ధతులు, నాసిరకం విత్తనాల వల్ల 15 మిలియన్ల బేళ్లుగా ఉండే పత్తి ఉత్పత్తి ప్రస్తుతం 5.5 మిలియన్ల బేళ్లకు పడిపోయిందని పాకిస్థాన్ కాటన్ జిన్నర్స్ ఫోరమ్ ఛైర్మన్ ఇహసానుల్ హక్ తెలిపారు. ఇప్పటికే 100 స్పిన్నింగ్ మిల్లులు, 400 జిన్నింగ్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. పత్తి ధర క్వింటాలుకు కాకుండా 40 కిలోలకు రూ.8,000 మేర పడిపోవడంతో రైతులు పత్తి సాగు మానేసి చెరకు సాగు వైపు మళ్లుతున్నారు.

విద్యుత్ చార్జీలు, పన్నుల భారం కూడా పరిశ్రమ నడ్డి విరు స్తోంది. ప్రాంతీయ పోటీదారులు యూనిట్ విద్యుత్‌కు 5-9 సెంట్లు చెల్లిస్తుంటే, పాకిస్థాన్‌లో అది 12 సెంట్లకు చేరుకునేలా ఉంది. తరచూ విద్యుత్ కోతలు, గ్రిడ్ సమస్యలు, ఎగుమతి విధానాల్లో మార్పులు, రవాణా సమ్మెలు పాక్ టెక్స్‌టైల్ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్‌స్టాఫ్‌గా

నగేశ్‌కపూర్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత వాయుసేన (ఐఏఎఫ్) వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా ఎయిర్ మార్షల్ నగేశ్‌కపూర్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ నరమదేశ్వర్ తివారీ స్థానంలో ఆయన నియమితులయ్యారు. గురువారం ఢిల్లీలోని వాయు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా ఎయిర్ మార్షల్ నగేశ్‌కపూర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి వీర జవాన్లకు నివాళులర్పించారు. ఎయిర్ మార్షల్ నగేష్ కపూర్, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేశారు. 1985 డిసెంబర్‌లో ఆయన పాస్‌అవుట్ అయ్యారు. 1986 డిసెంబర్ 6న వైమానిక దళానికి చెందిన ఫ్లయింగ్ బ్రాంచ్ ఫైటర్ స్ట్రీమ్‌లో నియమితులయ్యారు. నిష్ణాతుడైన ఫైటర్ పైలట్, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, ఫైటర్ కంబాట్ లీడర్‌గా ఆయన గుర్తింపు పొందారు. మిగ్-21, మిగ్-29 విమానాలతో సహా అనేక యుద్ధ విమానాలను నడిపారు. ఇక ఐఏఎఫ్‌లో 39 సంవత్సరాలకు పైగా సేవలందించిన ఎయిర్ మార్షల్ నగేశ్‌కపూర్ అనేక ఉన్నత పదవులు చేపట్టారు. వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా నియామానికి ముందు సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా ఆయన పనిచేశారు. 2008లో వాయు సేన పతకం, 2022లో అతి విశిష్ట సేవా పతకం, 2025లో పరమ విశిష్ట సేవా పతకం, సర్వోత్తమ్ యుద్ధ సేవా పతకంతో పాటు రాష్ట్రపతి అవార్డులు కూడా అందుకున్నారు.

కార్ల టెండర్‌పై వెనక్కి తగ్గిన లోక్‌పాల్

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చును వారే భరించాలని షరతు విధించింది. దాంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. మోదీ ప్రభుత్వంలో లోక్‌పాల్ పనితీరు తేలిపోయిందని, అవినీతిని పట్టించుకోకుండా విలాసాల కోసం చూస్తున్నారని విపక్షాలు విమర్శించాయి. అవినీతిపై పోరాడటానికి బదులు... విలాసవంతమైన కార్లను లోక్‌పాల్ కొనుగోలు చేస్తోందని మండిపడ్డాయి.

అగ్ని కీలల్లో 150 ఏళ్ల నాటి చర్చి

అమ్‌స్టర్‌డామ్: నూతన సంవత్సరం వేళ నెదర్లాండ్స్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెంట్రల్ అమ్‌స్టర్‌డామ్‌లోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన వొండెల్కర్క్ చర్చి అగ్నికి దగ్ధమైంది. రంగంలోకి దిగిన అత్యవసర బృందాలు మంటలను నియంత్రించే ప్రయత్నం చేశాయి. చుట్టుపక్కల నివాస సముదాయాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పురాతన చర్చి పైకప్పులో తొలుత మంటలు అంటుకున్నాయి. అనంతరం వేగంగా భవనం మొత్తం వ్యాపించాయి. పై భాగం చెక్కతో నిర్మించినది కావడం, అదే సమయంలో విపరీతంగా గాలి వీయడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. వొండెల్కర్క్ నగరంలో ఈ చర్చిని 1870ల్లో నిర్మించారు. భారీ సంఖ్యలో పర్యటకులు ఇక్కడకు వస్తుంటారు.

గ్యాస్ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

ధరను చమురు కంపెనీలు రూ.111 చొప్పున పెంచాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.1,691.50కి చేరింది. గత రెండు నెలలుగా ఈ ధరలను చమురు కంపెనీలు తగ్గించుకుంటూ వచ్చాయి. ధరల పెంపు నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లపై భారం పడనుంది. అదే సమయంలో ఇంట్లో వాడే ఎల్‌పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. చివరిసారిగా 2025 ఏప్రిల్‌లో రూ.50 చొప్పున పెంచాయి. అంతర్జాతీయ ధరలు, రూపాయి మారకం విలువ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఏటీఎఫ్, ఎల్‌పీజీ ధరలను ప్రతినెలా ఒకటో తేదీన సవరిస్తుంటాయి.

సిగరెట్, పాన్ మసాలాపై 40 శాతం జీఎస్‌టీ

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు 2025'ను ఆమోదించిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ 'పాన్‌మసాలపై ఇప్పటికే 40 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీనికి సెస్ అదనం. తయారీ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులను జాతీయ భద్రత బలోపేతానికి, ప్రజారోగ్యం కోసం ఖర్చు చేయనున్నాం" అని వెల్లడించారు. కాగా, కేంద్రం నోటిఫికేషన్‌తో సిగరెట్ కంపెనీలైన ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి ఆ ఉత్పత్తుల ధరలు పెరగనుండటంతో అమ్మకాలు తగ్గనున్నాయనే అంచనాలతో ఈ స్టాక్స్ నష్టపోయాయి. బీఎస్ఈలో ఐటీసీ షేరు ధర 52 వారాల కనిష్టానికి పడిపోయింది. ఫిలిప్స్ షేరు 10 శాతం కుంగింది.

జీరో రోడ్డు ప్రమాదాలు

(మొదటిపేజీ తరువాయి)

చనిపోయిన వారి కుటుంబాలు జీవితాంతం బాధ పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను తగ్గించడానికి ఆర్టీసీ ఆదర్శంగా ఉండాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం ,ప్రయాణికుల సౌకర్యం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. 260 కోట్ల మంది ప్రయాణికులు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.8,800 కోట్లు ఆదాయంగా వచ్చిందని చెప్పారు. ప్రమాదాలను జీరో స్థాయికి తగ్గించాల్సిన బాధ్యత మన అందరి పై ఉందన్నారు. నగరంలో 326 రూట్లలో ఆర్టీసీ బస్సులు నడుపుతుందని, గ్రామాల్లో క్కడెక్కడ బస్సులు అవసరం చెబితే అక్కడికి బస్సులు నడిపిస్తామన్నారు. రోడ్ సేఫ్టీ మన జీవితంలో అంతర్భాగం కావాలన్నారు. వెహికిల్ ఫిట్నెస్ ఉంటేనే బస్సులు రోడ్డెక్కించాలన్నారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఈడీలు , అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులు వి.యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కిరణ్ కుమార్, అజిత, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉర్దూ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియుద్దీన్, వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరీష్ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని యూనియన్ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది.

గవర్నర్‌కు సీఎం రేవంత్ నూతన వత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం సీఎం... రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్‌ను కలిశారు. పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు సైతం ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ని ఆయన నివాసంలో సీఎం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఇదిలా ఉండగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసం వద్ద ప్రజాప్రతినిధులు కలిసేందుకు బారులు తీరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారులు సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మంత్రులు సీతక్క పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ మల్లురవి తదితరులు ఉన్నారు.

సీఎంకు మీడియా అకాడమీ చైర్మన్...

కాగా, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే తీరని అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించలేదని, డీపీఆర్ రూపొందించకుండానే రూ.27వేల కోట్లు ఖర్చుచేశారన్నారు. డీపీఆర్ లేకపోవడం వల్లే పర్యావరణ అనుమతులు రాలేదన్నారు. ఈ ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకునేలా రూపొందించగా...అక్కడినుంచి లిఫ్టులు ఎక్కువపెట్టలేమనే కేసీఆర్ దానిని శ్రీశైలానికి మార్చారని మండిపడ్డారు. తల వదిలేసి తోక దగ్గర నీళ్లు తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేశారని విమర్శించారు. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల ఒప్పందాన్ని కేసీఆర్ చేశారని ఆరోపణలు చేశారు. ఏపీకి 66శాతం నీళ్లు శాశ్వత హక్కు వచ్చేలా కేసీఆర్ సంతకం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని పేర్కొన్నారు. నదీ జలాల విషయంపై శాసనసభలో చర్చించేందుకు సిద్ధమని...కేసీఆర్‌కు ఆహ్వానం పలుకుతున్నానని రేవంత్ అన్నారు.

బీఆర్ఎస్ మనుగడ కోసమే పాట్లు

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలైన తర్వాత పార్టీ మనుగడ కష్టమని కేసీఆర్ గుర్తించారని రేవంత్ అన్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ జలవివాదం రేపి...ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు సృష్టించి తన పార్టీని బతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీని బతికించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ విమర్శించారు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.2,652 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో నిలిచింది. ఎస్‌జీఎస్‌టీ రూ.1,182 కోట్లు, ఐజీఎస్‌టీ సెటిల్‌మెంట్ రూ.1,549 కోట్లు నమోదు కాగా, ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లు 38.32 శాతం పెరిగాయని వివరించారు. మెరుగైన పన్ను అనుసరణ, కఠిన అమలు చర్యలే ఈ వృద్ధికి కారణమని వెల్లడించారు.

కేంద్రానికి రూ.1.74 లక్షల కోట్లు

దేశంలో జీఎస్‌టీ స్వల్ప వృద్ధి నమోదైంది. డిసెంబరులో స్థూలంగా రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లు జరి గాయి. గతేడాదితో పోలిస్తే 6.1 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్‌టీ రేట్ల కోత కారణంగా దేశీయ విక్రయాల నుంచి వచ్చే వసూళ్లు నెమ్మదించినట్లు కేంద్రం తెలిపింది. డిసెంబరు జీఎస్‌టీ గణాంకాలను గురువారం విడుదల చేసింది. 2024, డిసెంబరులో రూ.1.64 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల్లో 1.2 శాతం వృద్ధితో రూ.1.22 లక్షల కోట్లు వసూళ్లు నమోదు కాగా... దిగుమతైన వస్తువులపై జీఎస్‌టీ వసూళ్లు (19.7 శాతం వృద్ధి) రూ.51,977 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల రూపంలో రూ.28,980 కోట్లు తిరిగి చెల్లించినట్లు కేంద్రం పేర్కొంది. దీంతో నికరంగా జీఎస్‌టీ వసూళ్లు రూ.1.45 లక్షల కోట్లుగా లెక్క తేలింది. నికర వసూళ్లలో గతేడాదితో పోలిస్తే కేవలం 2.2 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది. గతేడాది సెప్టెంబరు 22న 375 రకాల వస్తువులపై జీఎస్‌టీ రేట్లను కేంద్రం తగ్గించింది. ఆ మేరకు రెవెన్యూపై ప్రభావం చూపింది.

ప్రధాని పేరిట మెయిల్స్... రంగంలోకి సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

ఏడీఈ, ఇస్రో, హెచ్ఏఎల్, ప్రీమియర్స్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ తదితర సంస్థలకు మెయిల్స్ పంపాడు. ప్రధానికి ప్రిన్సిపల్ కార్యదర్శి పేరును ప్రస్తావిస్తూ తనకు మోదీ ఆశీస్సులు ఉన్నాయన్నాడు. ఈ వ్యవహారంపై పీఎంవో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ విచారణ ప్రారంభించింది. స్వప్రయోజనాల కోసం అతడు ప్రిన్సిపల్ కార్యదర్శితోపాటు ఏకంగా ప్రధాని పేరును దుర్వినియోగం చేసిన కేసుగా పరిగణించింది. అతడు తన వ్యక్తిగత మెయిల్ అకౌంట్ నుంచి మెయిల్స్ పంపినట్లు, ఉన్నతాధికారులనూ వాటిలో ప్రస్తావించినట్లు గుర్తించింది. 2024 నవంబరులో అప్పటి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎండీ టీవీ చౌదరీ.. నిందితుడి మెయిల్స్‌కు స్పందించినట్లు తెలిపింది. అదే ఏడాది డిసెంబరులో పెంటగాన్‌లోని అమెరికా నేవీకి చెందిన వైస్ అడ్మిరల్ జార్జ్ ఎం వికాఫ్‌కు కూడా నిందితుడు మెయిల్ చేసినట్లు సీబీఐ గుర్తించింది. సున్నితమైన అంశంపై మెయిల్స్ పంపడం వెనక అతడి ఉద్దేశాలను వెలికితీయడంలో నిమగ్నమైంది.

కేసీఆర్‌ను సీఎంగా చూడడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన సోదరులను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు నిరసనగా నిలిచిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అన్యాయానికి ఎదురు నిలుస్తున్న తెలంగాణ తమ్ముళ్లను, ఆడబిడ్డలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గెలుపు ఓటమి శాశ్వతం కావని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతాయని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని పేర్కొన్నారు. ధర్మం, న్యాయం, నిజాయతీ తమవైపే ఉన్నాయని, అందుకే విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 2028లో తిరిగి కేసీఆర్ ని ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

గ్రామీణ ఉపాధి నిర్వీర్యం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద ప్రతి ఇంటికి సగటున 50.24 రోజుల పని లభించినట్లు రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపింది. కాగా, కొత్త చట్టంతో రాష్ట్రాలపై భారం పడుతుందన్న వాదనను చౌహాన్ తోసిపుచ్చారు. కేటాయింపులు సరిపోతాయన్నారు.

ఎంజీఎన్ఆర్ఈజీఏపై అధ్యయనం చేసే విద్యావేత్తలు, పరిశోధకులు, సామాజిక హక్కుల కార్యకర్తల కన్సార్టియం 'లిబ్ టెక్ ఇండియా' స్పందిస్తూ కాలం గడిచే కొద్దీ దీని అమలు ప్రక్రియ పెద్ద ఎత్తున డిజిటల్ వర్క్‌ఫ్లోపై ఆధారపడుతుందని, హక్కులు నిరాకరించబడతాయని, సమస్యల పరిష్కారం ఆలస్యమవుతుందని, నిజమైన పని కనిపించదని హెచ్చరించింది. ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద అవినీతి జరిగిన క్రమంలోనే సాంకేతికపరంగా ముందుకెళుతున్నట్లు ప్రభుత్వం చెబుతుండగా... పాత చట్టం కింద అవినీతి పరిష్కారానికి ఉన్న సోషల్ ఆడిట్లు, విచారణ వ్యవస్థకు నిధుల కొరత ఉన్నదని, వ్యవస్థలు బలహీనమయ్యాయని కార్యకర్తలు వాదించారు. కొత్త చట్టం కేంద్రానికి విశేషాధికారాలు ఇస్తుందన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ పునరుద్దరణ డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఈనెల 5 అనగా సోమవారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. వామపక్షాలు సైతం ఇప్పటికే ఆందోళనలు చేపట్టాయి. కొత్త చట్టం రద్దునకు డిమాండ్ చేశాయి. పంజాబ్‌లో ఆప్ ఒక రోజు అసెంబ్లీ నిర్వహించి వీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా తీర్మానించింది.

ఎస్ఎస్ఎంతో పాటు అనేక సంస్థల బ్యానర్ల కింద వరుస ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. వీటికి కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సహా రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయి. ఎంజీఎన్ఆర్ఈ జీఏను వీబీ జీ రామ్ జీతో భర్తీ చేయ డాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇలాంటి సమయంలో గ్రామీణ ఉపాధి కోసం నిధుల కొరత ఉండదంటూ వీబీ జీ రామ్ జీ కోసం రూ.1,51,282 కోట్లను కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి చౌహాన్ వెల్లడించారు.

చర్చిలో పేదలకు చీరెలు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-మరిపెడ: నూతన సంవత్సరం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని షారోన్ ఏజీ ప్రార్థన మందిరంలో గురువారం పాస్టర్ గుమ్మడి ప్రభాకర్ చేతుల మీదుగా సుమారు 20 మంది పేద విశ్వాసులకు చీరెలు, షర్ట్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సహాయం, సేవా చేయడం వల్ల ఆధ్యాత్మిక వృద్ధి చెందుతుందన్నారు. క్రీస్తు బోధనలతో పాటు ఆయన చూపించిన ప్రేమ, దయ, ఐక మత్యం శ్యామల సందేశాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సహోదర ప్రేమ, సమాధానం, శాంతి కలిగి ఉండాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రమేశ్,గుమ్మడి నారాయణ,గుమ్మడి కళావతి, జి.అనన్య, జి.అక్షిత్ కుమార్, సుందరయ్య, మనెమ్మ, జి.రమేశ్, జి.జీవన్ కుమార్, విశ్వసులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శుభాలు కలగాలి

విశాలాంధ్ర - మరిపెడ: గత సంవత్సరం ఇబ్బందులు తొలగి, నూతన సంవత్సరంలో అందరికి శుభాలు కలుగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలో గుడిపుడి నవీన్ రావు, ఏ1 కాంట్రాక్టర్ రామడుగు అచ్యుత్ రావులను మాజీ ఎంపీపీలు గుగులోత్ వెంకన్న, గుగులోతు అరుణ రాంబాబు, మాజీ జెడ్పీటిసి తేజావత్ శారద రవీందర్ తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ న్యూ ఇయర్‌లో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సకాలంలో పాడిపంటలు, సంపద సంవృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జాటోత్ బాలాజీ, పానుగోత్ వెంకన్న, మాక్సూద్, దిగజర్ల ముఖేష్, ఎల్. వెంకన్న, తుమ్మ సత్యం, గుగులోత్ బాబు నాయక్, అచ్చునాయక్, రవి, రెడ్డి, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే నిజమైన వేడుక

విశాలాంధ్ర-కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: నూతన సంవత్సరం సంబరాలు జరుపుకోవడం ఒక్కరోజు విషయమే కానీ ప్రజల సమస్యలు తీర్చడం ప్రతిరోజు కర్తవ్యమై ఉండాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అభిప్రాయపడ్డారు. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రోడ్లు, ఆసుపత్రులు, తాగునీరు, విద్య, నిర్లక్ష్యం చేయరాదని. ఇవి ప్రజల హక్కులని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రజలు బలంగా ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం బలపడుతుందని పేర్కొన్నారు.

కలెక్టర్ పిలుపుకు స్పందన

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపుకు జిల్లా అధికారుల నుండి మంచి స్పందన లభించింది. పులబోకెలు శాలువాలకు బదులుగా బ్లాంకెట్స్ పుస్తకాలు పెన్నులతో రావాలని కలెక్టర్ సూచన అనుగుణంగా జిల్లా అధికారులు సిబ్బంది బ్లాంకెట్స్ అందజేసి కలెక్టర్ కునూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు తరలి రావడంతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కిటకిటలాడింది. కలెక్టర్ రాహుల్ రాజ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, కార్యాలయ సిబ్బంది కలిసి విద్యార్థులకు చలి నుండి రక్షణ పొందే దుప్పట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లా సమష్టి కృషితో మెదక్ జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లు సాధించి రాష్ట్రస్థాయిలో ఆదర్శ జిల్లాగా నిలవాలన్నారు. కొత్త సంవత్సరం 2026 జిల్లావాసులందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలు చేపట్టిన ప్రతి కార్యం నిర్విఘ్నంగా విజయవంతం కావాలన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు కంచి మధు శాలువాతో సత్కరించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

విశాలాంధ్ర బ్యూరో-మెదక్ : రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు. మెదక్ ఆర్టీసీ బస్సు డిపోలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా మహోత్సవాలను ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు,
శిక్షణా కార్యక్రమాలు, స్కూల్, కళాశాలలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ తప్పనిసరి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, వేగ నియంత్రణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత, పనిచేసే వర్గం ప్రభావితమవుతున్న నేపథ్యంలో, వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు అదనపు కలెక్టర్ సూచించారు. పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో పోలీస్ శాఖ, రవాణా శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేఖ, పోలీస్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా రోడ్డు ప్రమాదాలు నియంత్రిద్దాం: కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లాబ్యూరో: జిల్లాలో సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేద్దామని కలెక్టర్ దివాకర టి.ఎస్. పిలుపునిచ్చారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ట్రాఫిక్ రూల్స్ పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించా లని సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో జాతీయ రోడ్డు మాసోత్సవం సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీ, పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రవాణా శాఖ అధికారులు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ అందరు పాటించేలా పెద్ద ఎత్తున అవేర్నెస్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని తద్వారా వారి తల్లిదండ్రులకు వివరించేలా చూడాలని చెప్పారు. ఇందుకు ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యముగా, అతివేగము, డ్రంకన్ డ్రైవ్, మొబైల్ ఫోను మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడపవద్దని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో అధికారులు విద్యార్థులను విస్తృతంగా భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రవాణా శాఖ పోలీస్ శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్ డి ఓ వెంకటేష్, ఆర్ టి ఓ శ్రీనివాస్, ఏ.ఎం. వి.ఐ. వినోద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా నిల్వలు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: సాగు చేసే రైతులకు సరిపడా యూరియా స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని, మార్క్ ఫెడ్ ద్వారా యూరియా నిల్వలను ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), ప్రైవేట్ డీలర్లకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం మన ఖమ్మం జిల్లాలో 13 వేల 453 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, ఇప్పటివరకు రైతులకు 22 వేల 472 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా పంపిణీ సంబంధిత అంశాలలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాగం, జిల్లా వ్యవసాయశాఖ యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, మీ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేపట్టాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రోడ్డు ప్రమాదాలను నివారిస్తూ భద్రత ఏర్పాట్లపై విస్తృత అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. భద్రత కల్పన అందరి బాధ్యతగా స్వీకరించాలన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను కలెక్టర్ గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కట్టుబాటుగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ వినియోగించాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అంశంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రతా బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ సమర్థవంతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా ఆర్టిఏ అధికారి జోషి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు మనోహర్, సంగం వెంకట పుల్లయ్య, రవాణా శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల సాధనంలో పిల్లలతో ఎస్పీ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-మెదక్ : పట్టణంలోని బాల సాధనంలో పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఘనంగా జరుపుకున్నారు. అక్కడ ఉన్న పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పిల్లలతో ముచ్చటించి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పిల్లలకు ప్రోత్సాహం అందించారు. పిల్లల భవిష్యత్తే సమాజ భవిష్యత్తు అని, వారు మంచి పౌరులుగా ఎదగాలంటే విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సుభాష్ చంద్రబోస్, సీఐల మహేష్, కృష?మూర్తి, శైలేందర్, బాల సాధన అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు మెదక్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి, ముత్తాయి కోట శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయాలను సందర్శించారు. కుటుంబ సమేతంగా వెళ్లగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ కమిటీ బాధ్యతలు సత్కరించారు.

జాతీయ రోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లాఎస్పీ డాక్టర్ శబరీష్‌లు కలిసి గురువారం జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1, 2026 నుండి జనవరి 31, 2026 వరకు జాతీయ రోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాలు - 2026 నిర్వహించనున్నట్లు దీని యొక్క నేపథ్యం సీక్ సే సురక్ష టెక్నాలజీ సే పరివర్తన అని అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు.పాఠశాల, కాలేజీల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించడం కరపత్రాలను పంపిణీ చేయడం, ఉల్లంఘించిన వారిపై చర్యలపై అవగాహన కల్పించడం ఈ నెల 1నుంచి మార్చి1 వరకు జరుగుతుందని అన్నారు. పాదాచారుల భద్రత గురించి అవగాహన కల్పించడం పోలీసు రవాణా మరియు ఆర్ అండ్ బి అధికారులచే 04.01.2026 నుండి10.01. 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.వాహనాల ఫిట్నెస్ మరియు పొల్యూషన్ పత్రాలను తనిఖీలు చేయడం 11.1.2026 నుండి 17. 1. 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ద్వారా బ్లాక్ స్పాట్లను సరి చేయడం బస్టాండు ఆటో స్టాండ్లలో కరపత్రాలను పంపిణీ చేయడం పిల్లలచే రోడ్డు భద్రత గురించి ఆటపాటల తో అవగాహన కల్పించడం 18.1.26 నుండి 24.1.26 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.వైద్యశాఖ, రెడ్ క్రాస్ వారిని భాగస్వాములను చేయడం మీడియా ద్వారా అవగాహన కల్పించడం నివేదికలను మీడియా ద్వారా తెలియపరచడం 25.1. 26 నుండి 30.1. 26 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్టీవో జైపాల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సాయిచరణ్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

భారత్‌లో స్కోడా ఆటో రజతోత్సవ సంవత్సరంలో విస్తరణ

ముంబై: స్కోడా ఆటో 2025 సంవత్సరాన్ని భారతదేశంలో తన ప్రయాణంలో ఇప్పటివరకు అత్యంత కీలకమైన సంవత్సరంగా గుర్తించింది. దేశంలో తన 25వ వార్షికోత్సవాన్ని అత్యంత బలమైన అమ్మకాల పనితీరుతో జరుపుకుంది. ఈ బ్రాండ్ 2025 సంవత్సరాన్ని 72,665 కార్ల అమ్మకాలతో ముగించింది. ఇది 2024లో విక్రయించిన 35,166 యూనిట్లతో పోలిస్తే సంవత్సరానికి 107% వృద్ధిని నమోదు చేసింది. ఈ అసాధారణ పనితీరు 2025ను స్కోడా ఆటో ఇండియా చరిత్రలోనే అతిపెద్ద సంవత్సరంగా నిలిపింది. ఇది ఉత్పత్తులు, మార్కెట్లు, కస్టమర్ టచ్‌పాయింట్‌ల అంతటా వేగవంతమైన వృద్ధిని ప్రతిబింబిస్తుంది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, 2025 సంవత్సరం మాకు ఎప్పటికీ ఒక ప్రత్యేకమైనదిగా నిలిచిపోతుంది. ఇది భారతదేశంలో మా 25వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది, ఈ సంవత్సరంలో మేము మా అత్యంత మెరుగైన, విభిన్నమైన ఉత్పత్తి శ్రేణిని కలిగి ఉన్నామన్నారు. 2025లో స్కోడా ఆటో ఇండియా పనితీరు స్పష్టమైన ఉత్పత్తి, నెట్‌వర్క్ వ్యూహంపై ఆధారపడి ఉంది. కైలాక్ ఒక కీలక వృద్ధి చోదకంగా ఉదపించి, బ్రాండ్ లభ్యతను గణనీయంగా విస్తరించింది.

ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-మేడిపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని శ్రీలత బద్రు నాయక్ కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అలాగే రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గురువారం పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవ్వాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్లు, స్టేషనరీ అందజేత

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం హాస్టల్ విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు దుప్పట్లు మొదలగునవి మాత్రమే తీసుకురావాలని సూచించడంతో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుండి హాస్టల్ పిల్లలకు దుప్పట్లు, వాటర్ బాటిల్స్, స్టేషనరీ పెద్ద ఎత్తున కలెక్టర్ కు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం సంపత్ రావు మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పక్షాన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మహేందర్ జి అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, సంఘ నాయకులు ప్రకాశ్ రెడ్డి, కే కొమురయ్య, బి శ్రీనివాస్, కె శిరీష, ఎం రాజు, ఏ రాజ్ కుమార్, విజయ భాస్కర్, యశ్వంత్, రఫీక్, దుర్గారావు, సారంగపాణి రాజేశ్వరరావు, రహీం, రాజు, తదితరలు పాల్గొన్నారు

కలెక్టర్‌ను కలిసిన బండారు యాదగిరి

విశాలాంధ్ర బ్యూరో-సంగారెడ్డి: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు కొత్త సంవత్సరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం మరింత స్ఫూర్తివంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు జిల్లాలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు జిల్లా యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరిస్తున్నామని అందువల్ల జిల్లా యంత్రాంగం కూడా జర్నలిస్టుల పట్ల అదేవిధంగా సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు ఇటీవల కొత్త అక్రిడిటేషన్ పాలసీ వచ్చిందని దానిలో కూడా అనేక మార్పులు చేయాల్సిందిగా తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ జిల్లాకు చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్‌నిఆధ్వర్యంలో ఇటీవల విజ్ఞప్తి చేశామన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి దీనికి సంబంధించిన వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. త్వరలో మార్పులు జరిగే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల జిల్లాలో అర్హులైన జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వ పాలసీ ప్రకారం అక్రిడిటేషన్ కార్డులను అందించాల్సిందిగా కోరారు. దీనికి తోడు ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల నిబద్ధతతో ఉన్నదని ఆయన వివరించారు. ఈ సంవత్సరము తీపి కబురు చెబుతామని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ సంఘం నేతలకు హామీ ఇచ్చారని వివరించారు. ఆ ప్రకారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇంటి స్థలాలతో పాటు ఉచిత విద్య వైద్య సౌకర్యాలను కల్పించాలని, బస్సు పాస్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. దీనికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండరు ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర-ఖమ్మం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన 2026 సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని రకాల బకాయిలు, కరువు భత్యం బకాయిలు, ఓపియస్ పై నిర్ణయం, పి.ఆర్.సి.పై సానుకూల నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2026 సంవత్సర రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కాలెండరు ఆవిష్కరణ సమయంలో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు దొడ్డా వరప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కరామత్ అలీ, అసోసియేట్ అధ్యక్షులు అరుణాకర్, బాణోత్ రాము, ఆర్థిక కార్యదర్శి శ్రీధర్‌బాబు జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ సైదా,బోణాల సీతారామారావు, అల్తాఫ్, నాగేశ్వరరావు,జమాల్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ : సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలు స్థానిక జిల్లా కార్యాలయం వీరభవన్ లో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి కేక్ కట్ చేసి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం మహబూబాద్ పట్టణ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారు ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరాలని అన్నారు. మానుకోటలో ప్రజలందరూ కులమతాలు లేకుండా ఐకమత్యంతో కలిసి మెలసి ఉండాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలకు పార్టీ శ్రేణులు, అభిమానులు ,అందరూ జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే శతాబ్ది సభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ ,చింతకుంట్ల వెంకన్న, వీరవిల్లి రవి ,వెలుగు శ్రావణ్ ,ఆబోతు అశోక్ ,జలగం ప్రవీణ్ ,వంకాయలపాటి చిరంజీవి, చిదిరాల జ్ఞానేశ్వర్ ,మంద శంకర్, అల్లి వేణు,గాదం శ్యాంప్రసాద్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, ఆర్ డి ఓ వెంకటేష్, డిఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ, పూల మొక్కలను, హాస్టల్ విద్యార్థుల ఉపయోగార్థం బుక్స్, దుప్పట్లు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కొనసాగాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరను అధికారులు విజయవంతం చేయాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని అధికారులకు సూచించారు. నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

సిగరెట్లపై సుంకం పెంపును పునఃపరిశీలించండి: టిఐఐ

న్యూఢిల్లీ: పన్నుల మార్పు ప్రక్రియ మొత్తం ఆదాయ తటస్థంగా ఉంటుందని ప్రభుత్వం గతంలో పలుమార్లు ప్రకటించినప్పటికీ.. నిన్న (31 డిసెంబర్ 2025) ప్రకటించిన కస్టమ్స్ సుంకాల పెంపును చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు 'ది టొబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాస (టీఐఐ) తెలిపింది. ఇంత భారీ పెంపు.. పరిశ్రమపై ఆధారపడిన లక్షలాది మంది రైతులు, ఎంఎస్ఎంఈలు, చిల్లర వ్యాపారులు, స్థానిక విలువ గొలుసులకు తీవ్ర నష్టాన్ని, కష్టాలను కలిగిస్తుంది.
చట్టబద్ధమైన జాతీయ సంస్థలను దెబ్బతీయడంతో పాటు, అక్రమ పరిశ్రమకు ఇది భారీ ఊతమిస్తుంది. దేశంలో విక్రయించే ప్రతి 3 చట్టబద్ధమైన సిగరెట్లకు ఒక స్మగ్లింగ్, అక్రమ సిగరెట్ అమ్ముడవుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ భారీ పన్ను పెంపు అక్రమ, చట్టవిరుద్ధ కార్యకలాపాలను మరింత పెంచుతుంది.
ఇది ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడమే కాకుండా, సంఘ విద్రోహ కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది. 2005-2022 మధ్య 17 సంవత్సరాల పాటు 71 దేశాల్లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. "ఒక మార్కెట్‌లో అక్రమ వాణిజ్యం వేళ్లూనుకుంటే, దానిని తగ్గించడం కష్టమవుతుంది. ప్రభుత్వాలు అక్రమ వాణిజ్యాన్ని నియంత్రించడానికి కేవలం ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై మాత్రమే ఆధారపడలేవు. పన్నులు, ధరల ప్రభావాన్ని విస్మరించకూడదు.

టాటా మోటార్స్ త్రైమాసికంలో 1,15,577 యూనిట్ల అమ్మకాలు

ముంబై: దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో క్యూ3ఎఫ్‌వై25లో 95,770 యూనిట్లతో పోలిస్తే, క్యూ3ఎఫ్‌వై26లో అమ్మకాలు 1,15,577 యూనిట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్ 2025లో దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు 42,508 యూనిట్లుగా నమోదయ్యాయి, ఇది డిసెంబర్ 2024లో నమోదైన 33,875 యూనిట్లతో పోలిస్తే ఎక్కువ. డిసెంబర్ 2025లో ఎంహెచ్, ఐసీవీల దేశీయ అమ్మకాలు 20,363 యూనిట్లుగా ఉన్నాయి, డిసెంబర్ 2024లో ఇది 15,968 యూనిట్లుగా ఉంది. క్యూ3ఎఫ్‌వై26లో ఇది 53,105 యూనిట్లుగా ఉంది, క్యూ3ఎఫ్‌వై25లో ఇది 44,023 యూనిట్లుగా ఉంది. డిసెంబర్ 2025లో దేశీయ, అంతర్జాతీయ అమ్మకాలు 21,646 యూనిట్లుగా ఉన్నాయి, డిసెంబర్ 2024లో ఇది 16,604 యూనిట్లుగా ఉంది. క్యూ3ఎఫ్‌వై26లో అమ్మకాలు 57,080 యూనిట్లుగా ఉన్నాయి. ఇది క్యూ3ఎఫ్‌వై25లో నమోదైన 46,108 యూనిట్లతో పోలిస్తే ఎక్కువ. టాటా మోటార్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ గిరీష్ వాఘ్ మాట్లాడుతూ, "జీఎస్టీ 2.0 మరియు క్యూ2ఎఫ్‌వై26లో పండుగల కారణంగా వచ్చిన అమ్మకాల జోరు క్యూ3ఎఫ్‌వై26లో కూడా కొనసాగింది, ఇది వృద్ధిని సాధించడంలో, వాణిజ్య వాహనాల పరిశ్రమ మొత్తం సెంటిమెంట్‌ను పెంచడంలో సహాయపడిందన్నారు.

సంపాదకీయం

జనాందోళన జ్వాలాముఖి

ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలిన కుల్దీప్ సెంగర్‌కు విధించిన శిక్షను ఢిల్లీ హైకోర్టు తగ్గించినందు వల్ల దేశంలో అల్లకల్లోలం చెలరేగింది. సెంగర్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించక తప్పలేదు. ఎందుకంటే జనాందోళన, ఆగ్రహం కట్టలు తెంచుకునే స్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉత్తరాఖండ్‌లో అంకితా భండారీ అనే యువతిపై అత్యాచారం, హత్య వ్యవహారంపై మళ్లీ ఆందోళనలు మొదలయ్యాయి. ఇలాంటి దుర్ఘటనల మీద జనం రోడ్డెక్కక తప్పడం లేదు. ఈ ఉద్యమాల ప్రభావం మోదీ ప్రభుత్వం మీద ప్రస్తుతానికి కనిపించకపోవచ్చు. కానీ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదనిపిస్తోంది. ఆందోళనకు దిగిన వారు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన వారు కాదు. ఈ ఆందోళనల్లో ప్రధానంగా పాల్గొంటున్న వారు సామాన్య ప్రజలు. ఉత్తరాఖండ్ క్రాంతి దళ్‌కు చెందిన వారు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని ఘెరావ్ చేయడానికి బయలుదేరితే వారిని 10 కిలోమీటర్ల దూరంలోనే ఆపేశారు. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. క్రాంతి దళ్ నాయకుడొకరు పోలీసులను కడిగి పారేశారు. నాయకులకు లొంగి ఉండాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. మేం మిమ్మల్ని విమర్శించేలా కాక అభినందించేలా మసలుకోవాలని హితవు చెప్పారు. నాయకులకు భయపడి మీరు అంకిత కేసును బలహీన పరిచారని గుర్తు చేశారు. మీరు బలపడి, ధైర్యంగా వ్యవహరించేదాకా మీతో ఘర్షణ పడ్తూనే ఉంటామని తెగేసి చెప్పారు. మీ జీతభత్యాలు ప్రజలు చెల్లించే పన్నుల నుంచే వస్తాయని గుర్తు చేశారు. ఈ మాటలకు నిరసన తెలియజేస్తున్న వారికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి కాదు. నిజానికి ఇవి జనం హృదయస్పందనకు ప్రతిరూపాలు. సునీతా భట్నాగర్ అనే మహిళ ఇలాంటి దురంతాలను ఎండగడ్తూ వీడియోలు చిత్రీకరించి బట్వాడా చేస్తుంటారు. ఆ వీడియోలను తొలగించాలని తన మీద విపరీతంగా ఒత్తిడి చేస్తున్నారని ఆమె రోదిస్తూ చెప్పారు. రాణీఖేత్‌లో జరిగిన నిరసన ప్రదర్శనలో అంకిత మీద అత్యాచారానికి పాల్పడడం, హతమార్చడంతో సంబంధం ఉన్న అజయ్ కుమార్, మహేంద్రభట్‌కు వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. బహిరంగ ప్రదర్శనలతో పాటు సమావేశాలలోనూ నిరసనలు తీవ్రస్థాయిలో వ్యక్తమయ్యాయి. అంకితా భండారీ మీద దుర్మార్గానికి పాల్పడిన వారిని శిక్షించకపోతే అనేక మంది ఆహుతైపోతారు అని జనం నినదిస్తున్నారు. ఈ వ్యవహారం కేవలం అంకితకో, ఉన్నావ్ కేసులో బాధితురాలికో పరిమితమైంది కాదు. 2002 లో గుజరాత్ మారణకాండ సందర్భంగా నిండు గర్భిణీ అయిన బిల్కిస్ బానోపై ఎలా మూక అత్యాచారానికి పాల్పడ్డారో తెలుసు. ఆమె రెండు నెలల పాపను నేలకేసి బాది చంపేశారు. ఆమె మీద అఘాయిత్యం చేసిన వారికి అత్యున్నత న్యాయస్థానం తగిన శిక్ష విధించింది. కానీ గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వారు జైలులో సత్ప్రవర్తన కలిగి ఉన్నారని నమ్మబలికి విడుదల చేశారు. ఈ విడుదలకు మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉంది. అంకిత గిరిజన మహిళ. అత్యాచారం చేస్తున్నప్పుడు అంకిత తీవ్రంగా ప్రతిఘటించింది. చివరకు ఆమెను హతమార్చి కాలవలో పడేశారు. విచిత్రం ఏమిటంటే అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి ప్రముఖుడు కనక ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించవద్దని గిరిజన సంక్షేమ కమిషన్ చెప్పడం వింతల్లోకెల్లా వింత. కాదు పరమ దుర్మార్గం.

అంకిత కోసం జనం వీధుల్లోకి రావడంతో జన చైతన్యం పెరుగుతోందని రుజువవుతోంది. కొందరు బీజేపీ నాయకులు, బీజేపీతో సంబంధం ఉన్నవారు కూడా ఈ దాష్టీకాన్ని ఎండగడ్తున్నారు. బద్రీనాథ్ మందిరం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు అజేంద్ర అజయ్ ఈ దుర్మార్గాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. అంకిత మీద అఘాయిత్యానికి పాల్పడిన వారు నైతిక బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలంటున్నారు. ఉత్తరాఖండ్ బీజేపీ విభాగం అధ్యక్షుడు అనవసరంగా నోరు తెరిచి ఖండనమండనలకు పాల్పడవలసిన అవసరం లేదని హెచ్చరించారు. మరో వేపు సామాజిక కార్యకర్తలూ ఉద్యమ బాట పట్టారు. నాలుగుసార్లు బీజేపీ అభ్యర్థిగా శాసనసభ సభ్యురాలైన విజయ్ బర్త్వాల్ కూడా గళమెత్తారు. ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు జరగాలంటున్నారు. అత్యాచారం చేసిన వారు మా పార్టీకే చెందిన వారు కావడం సిగ్గు చేటుగా ఉందని కిరణ్‌శర్మ అనే మరో బీజేపీ మద్దతుదారు అంటున్నారు. అంకితను బలిపెట్టిన బీజేపీ నాయకుడు దుష్యంత్ కుమార్ గౌతంకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం అత్యంత సిగ్గుమాలిన విషయమని కిరణ్‌శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిరణ్‌శర్మ పంచాయితీ సభ్యురాలే కావొచ్చు. కాని ఆమెలో మానవత్వం తొణికిసలాడుతోంది. బీజేపీ నాయకులు ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నందుకు సిగ్గుతో తలవంచుకుంటున్నారు. అంకిత పని చేస్తూన్న రిసార్ట్ యజమాని పులకిత్ ఆర్య, రిసార్ట్ మేనేజర్ సౌరభ్ భాస్కర్, బీజేపీ ఎమ్మెల్యే రేణుబిష్త్ పాత్ర కూడా ఉంది. దుష్యంత్ గౌతం అంకితను తనకు "ప్రత్యేక సేవలు" అందించాలని కోరారు. ఆమె నిరాకరించడంతో ఘాతుకానికి పాల్పడ్డారు. ఆమె రిసార్ట్‌లో బస చేస్తున్న గదిని కాల్చేశారు. తరవాత ఆ శిథిలాల మీద బుల్డోజర్ నడిపించారు. ఇంతకన్నా ఘోరం ఏమిటంటే ఆమె శవ పరీక్షలో ఒక్క మహిళా డాక్టర్ కూడా లేరు. నిబంధనల ప్రకారం మహిళా డాక్టర్ ఉండాల్సిందే. కానీ నిబంధనలు పాటించకుండానే శవ పరీక్ష తంతు ముగించేశారు. అంకిత నీటిలో మునిగిపోయి మరణించిందని కట్టుకథ అల్లారు. ఉత్తరాఖండ్ ప్రశాంతంగా ఉంటుందనుకుంటాం. అక్కడ నేరాల సంఖ్య మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తక్కువే. కానీ అధికార పార్టీకి చెందిన నాయకులు పాల్పడే దుర్మార్గాలకు కొదవేమీ లేదు. నిర్భయపై ఢిల్లీలో అత్యాచారం జరిగినప్పుడు ఢిల్లీలో భీకర నిరసన ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా దేశంలోని అనేక ప్రాంతాలలో నిరసనల అగ్ని అంటుకుంది. అర్ధరాత్రి వేళ సోనియాగాంధీ వీధుల్లోకి వచ్చి నిరసనకారులతో మాట్లాడారు. తరవాత నిర్భయ చట్టం వచ్చింది. దోషులకు శిక్ష పడి ఉండొచ్చు. కానీ పశు ప్రవృత్తి ఉన్న వారిని, ముఖ్యంగా వారు పలుకుబడిగల రాజకీయ నాయకులైనప్పుడు, అందునా అధికార పార్టీకి చెందిన వారైనప్పుడు ఎంతటి దారుణాలకు పాల్పడినా తప్పించుకోవడానికి అవకాశం మిగిలే ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మీద, వివిధ రాష్ట్రాలలోని బీజేపీ ప్రభుత్వాల మీద క్రమంగా జనంలో వ్యతిరేకత పెరుగుతోంది. ఏలిన వారు విన్నపాలు విననప్పుడు జనం రోడ్డెక్కుతారు. అప్పుడు వారిని నిలవరించే శక్తి ఏ ప్రభుత్వానికీ ఉండదు.

ఇదేమి ప్రజాస్వామ్యం

మనిషన్నాక కొంచెం సిగ్గు బిడియం ఉండాలి. అలాకాక అన్ని వదిలేసి ప్రజల ముందు పచ్చి అబద్ధాలు పదేపదే వల్లె వేయడానికి వెనుకాడరు. ఏంటి బావ ఈరోజు ఘోరంగా తిడుతున్నావ్. ఎవరిని ఏంటి కథ. ఏముంది రోజూ ఉండే కథే. వెనుక ముందు చూడరు. ఎవరున్నా పట్టించుకోము. నోటి నుంచి వచ్చే మాటల్లో 10 శాతమన్నా నిజాలుండవు. అన్నీ అబద్ధాలే. నిత్యం వినే ప్రజలు ఏమనుకుంటారనే ఆలోచనే ఈ నాయకులకు రావడం లేదు. నిన్న చెప్పిందే ఈ రోజు. ప్రతిరోజూ అదే మాట. నిజమేనయ్యా ప్రభుత్వం చేసిన మంచి వివరించి ప్రజలకు చెప్పి ఇంకా ప్రజల అవసరాలు అడిగి తెలుసుకోవాలి. అలా కాకుండ సమయం మొత్తం ప్రతిపక్షాలను తిట్టడంకోసమే వెచ్చిస్తున్నారు. పై నాయకుని నుంచి కార్యకర్తల వరకు అదే ధోరణి. అసలు ప్రపంచంలోని మనది అతి పెద్ద ప్రజాస్వామ్యం అని గర్వంగా చెప్పుకుంటాం కాని అది నేతి బీరకాయలోని నెయ్యిలాగే ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ముఖ్యం. ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రజల నుంచి ఉత్తమ నాయకుల్ని ప్రజలు ఎన్నుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటాం. ఆ ప్రజాస్వామ్యంలో అవసరాలు అడగడానికి ప్రభుత్వాన్ని, నాయకుల్ని ప్రశ్నించే హక్కు ప్రజలందరికి ఉంటుంది. కాని ప్రశ్నించే వాడు నాయకులకు శత్రువు లాగ కనబడుతున్నాడు. నాయకులు ప్రజలకు దైవ స్వరూపులుగా మారిపోతున్నారు. రాజుల కాలం నాటి వలె పరిపాలన సాగుతోంది. అధినాయకుడు చెప్పింది ప్రశ్నించకుండ అమలు జరిపేలా ప్రస్తుతం సమాజంలో పాలన జరుగుతోంది. ప్రజల వద్దకు నాయకులు రావడం తగ్గిపోయింది. శాసనసభ్యుని అనుచరులే ప్రజలుగా

నాయకులు పరిగణిస్తున్నారు. ముఖ్యమంత్రులు తీసుకున్ననిర్ణయాలు మంత్రులకు, శాసనసభ్యులకు శిరోధార్యం గా మారింది. వారి అనుచరులు ఆలోచించకుండా అనాలోచితంగా అచరించడం పరిపాటిగా మారింది. దాంతో ప్రజాస్వామ్య దేశంలో అప్రజాస్వామ్యం నాలుగుపాదాల నడుస్తోంది. ఇది ప్రజల పాలిట అశనిపాతంలా తయారైంది. ప్రతిపక్ష పార్టీలకు సమయమిచ్చి వారి ఆవేదన వినడం తగ్గిపోయింది. దాంతో జీతం కోసం సభల్లో ఇచ్చే బేటా కోసమే సభలకు హజరవుతున్నారా అనే సందేహం ప్రజలకు కల్గుతోంది. ప్రస్తుతం ప్రతి పార్టీలో అధినాయకుడు చెప్పింది చేయడానికి కిందివారు అలవాటుపడడంతో పార్టీలో ప్రజాస్వామ్యం బదులు ఏకస్వామ్యంతో పార్టీలు నడవడంతో పార్టీలకు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ జెండా మోయడంతో సామాన్య కార్యకర్త, నాయకుల వెంట తిరిగే స్వంతపనులు చేయించుకోవడం కోసమే పార్టీ ఉపయోగపడుతోంది. పార్టీ స్వామ్యం నాయకుని స్వామ్యంగా మారిపోయింది. పార్టీలోగాని ప్రభుత్వంలోగాని ప్రజాస్వామ్యం మచ్చుకైనా కనబడదు.

ఈ స్థితిలో పార్టీలు నడవడంతో ఆలోచనాపరులు, మేధావులు ఇంటికి పరిమితం కావలసి వచ్చింది. ఆలోచించకుండా నాయకులు చెప్పింది ఆచరించే వారు మాత్రమే పార్టీలలో మనగలుగుతున్నారు. ఈ స్థితిలో ఓటు వేయడం ఓటుకు డబ్బు తీసుకోవడంలో సామాన్య ప్రజల పనిగా మారింది. అధికారం కోసం అంతులేని అరాచకాలు విచ్చలవిడిగా సాగుతున్నయి. ఏం చేసినా అంతిమంగా అధికారమే ప్రధానంగా రాజకీయాలు సాగుతున్నాయి. కుల మతాలు మనిషికి అవసరం లేకపోయినా అవి రాజకీయాలకు అవసరంగా మారి ప్రజల్ని వాటివైపు మరలిస్తున్నారు. అందుకు ఇటీవల ఒక కార్పొరేషను మేయరుగా కేరళలో బీజేపీ విజయం సాధించడమే ఒక ఉదాహరణ. కులమత రాహిత్య సమ సమాజమే తమ ధ్యేయమని ప్రతి పార్టీ చెబుతూ మరో పక్క కులమత కుంపట్లు రాజుకునేలా చేయడం పార్టీ పని. వామపక్ష పార్టీలు మాత్రం ఆ దుర్గతికి దిగజారలేదు. కాని ప్రజలకు వరాలు ఇచ్చే పార్టీల వెంటే ప్రజలుండటం విచారించదగినది. కాని ప్రజలు అమాయకంగా గుడ్డిగా నమ్మి ఓటు వేయడం లేదు. అన్ని తెలిసి కూడ ప్రత్యామ్నాయం లేదనే ఆ వరాలకు తలొగ్గి నడుస్తున్నారు. అయితే వామపక్ష పార్టీలకు ప్రజలు దూరమయ్యారా లేక ప్రజలకు ఆ పార్టీలు దూరమయ్యాయా అనేది విశ్లేషిస్తే పార్టీలే దూరమయ్యాయని ఎక్కువ మంది చెబుతారు. అయితే దూరమవడానికి ఆయా పార్టీల అలసత్వం మాత్రం కాదు. ముఖ్యంగా ఈ రోజుల్లో ప్రతి కార్యక్రమానికి డబ్బు అవసరం. ఈ దశలో సంపాదనపరులు ప్రస్తుతం పెద్ద పార్టీలుగా పిలవబడి అధికారంలోకి వచ్చి తెలుగుదేశం వైసీపీకి మాత్రమే విరాళాలు కురిపిస్తున్నారు. ఇటీవల అధికారంలో ఉన్న తెలుగుదేశం కన్నా ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకే ఎక్కువ విరాళాలు రావడం గమనార్హం. పెట్టుబడిదారులు తమ అవసరాలు తీర్చుకోవడానికి తామే సర్వే నిర్వహించి అధికారంలోకి వచ్చే పార్టీలకు అడగకుండానే విరాళాలు అందచేస్తున్న సంగతి తెలిసింది. ఈ స్థితిలో నిత్యం పేదల కోసం గొంతెత్తి వామపక్ష పార్టీలకు నిధులు లేని సమస్య వెంటాడుతోంది. దాంతో ప్రధాన పార్టీలు అధికారమే ప్రధానంగా భావించి అప్రజాస్వామికంగా పాలన సాగిస్తున్నారు. ప్రజాస్వామ్యం కోరే మేధావులు ఇంటికి పరిమితమయితే వామపక్ష పార్టీలు తమ శక్తి మేరకు ప్రభుత్వ దమనకాండపై పనిచేస్తూనే ఉన్నారు. మేధావులు దేశ ప్రగతి యువత పైనే ఆధారపడి ఉందంటున్నారు. కాని యువతలో ఎక్కువ శాతం సినిమాలవైపు, మద్యం వైపు బెట్టింగులవైపు ఆకర్షితులవుతున్నారు. ఈ స్థితిలో సినిమా హీరోలు కూడ ప్రస్తుత దేశ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం కొంత సమయం వెచ్చించి తమను ఆరాధ్య దైవంగా కొలిచే యువతను సమాజంలోని అసమానతలు రూపుమాపే ప్రయత్నంలో భాగస్వాములయ్యే విధంగా మరల్చడం ఆ హీరోలు బాధ్యతగా తీసుకోవలసిన అవసరం ఉంది. ఇటీవల సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ఆ రకంగా ఆలోచించి బయటకు రావడం సంతోషం. అలాగే సినిమా వాళ్లను నమ్మే యువతను మార్చవలసిన నైతిక బాధ్యత వాళ్లపైనే ఉంది. అపుడే ప్రస్తుతం అప్రజాస్వామ్యంగా పాలన చేస్తున్న వారిని ఇంటికి పరిమితం చేసి ప్రజారంజకంగా పాలన సాగుతుంది. ఇది విద్యాధికులు మేధావులు కోరుకునే విషయంగా గమనించాలి.

సెల్: 9885569394

కార్మిక హక్కులు ప్రశ్నార్థకం

బి.వి.వి. కొండలరావు

భారతదేశంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు సాధారణంగా "సరళీకరణ", "సమర్థత" "వ్యాపారం చేయడానికి సౌలభ్యం" అనే పేర్లతో ప్రచారం చేయబడ్డాయి. దాదాపు 29కార్మిక చట్టాలను నాలుగు కోడ్లలో విలీనం చేయడం ద్వారా, ప్రపంచీకరణకు అనుగుణంగా కార్మిక నియంత్రణను ఆధునీకరిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటోంది. కానీ కార్మికుల దృష్టిలో ఇది కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదు. ఇది పని స్థలాల్లో శక్తి సమతుల్యతను మౌలికంగా మార్చే మార్పు. సరళంగా చెప్పాలంటే, కానీ ఈ సంస్కరణల భాష వెనుక ఒక లోతైన మార్పు దాగి ఉంది. లేబర్ కోడ్లు రాష్ట్ర యజమాని కార్మికుల మధ్య సంబంధాన్ని మౌలికంగా మార్చాయి అది కార్మికుల పక్షాన కాదు. అమలు వ్యవస్థను బలహీనపరుస్తూ, ఉద్యోగ భద్రతను తగ్గిస్తూ, సామూహిక చర్యలను పరిమితం చేస్తూ, గిగ్, అసంఘటిత కార్మికులకు కేవలం ప్రతీకాత్మక రక్షణ మాత్రమే ఇస్తున్నాయి. ఈ లేబర్ కోడ్లు యజమానులకు కార్మికులను నియమించడం, తొలగించడం, క్రమశిక్షణ విధించడం సులభతరం చేస్తాయి అదే సమయంలో కార్మికులు న్యాయమైన వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత లేదా సామూహిక స్వరం కోసం పోరాడడం కష్టతరం చేస్తాయి. ఇది తటస్థ సంస్కరణ కాదు కార్మికుల గౌరవం కంటే కార్పొరేట్ సౌలభ్యాన్ని ప్రాధాన్యం చేసే ఉద్దేశపూర్వక పునఃరూపకల్పన.

రాష్ట్రం వెనక్కి తగ్గడం : అమలు నుండి "సహకారం" వైపు

ఈ సంస్కరణల భాష వెనుక ఒక లోతైన మార్పు దాగి ఉంది. లేబర్ కోడ్లు రాష్ట్రం యజమాని, కార్మికుల మధ్య సంబంధాన్ని మౌలికంగా మార్చాయి. పాత కార్మిక చట్టాలు ఒక మౌలిక వాస్తవాన్ని అంగీకరించాయి. ప్రతీకారం భయంతో కార్మికులు తమపై జరుగుతున్న దోపిడీపై బహిరంగంగా ఫిర్యాదు చేయలేరు. అందుకే లేబర్ ఇన్స్పెక్టర్లకు అకస్మాత్తుగా తనిఖీలు చేయడం, కార్మికులను గోప్యంగా ప్రశ్నించడం, చట్ట ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయడం వంటి బలమైన అధికారాలు ఇవ్వబడ్డాయి. కార్మిక చట్టాల ఉల్లంఘనలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడ్డాయి.కానీ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్, 2020 ఈ వ్యవస్థను "నమ్మకం ఆధారిత" నమూనాతో భర్తీ చేసింది. ఇన్స్పెక్టర్లను ఇప్పుడు ఇన్స్పెక్టర్ కమ్ ఫెసిలిటేటర్లుగా పిలుస్తున్నారు. వారి ప్రధాన పాత్ర చట్టాన్ని అమలు చేయడం కాకుండా యజమానులకు సలహాలు ఇవ్వడమే. తనిఖీలు కంప్యూటర్ ద్వారా ముందుగానే షెడ్యూల్ చేయబడతాయి. దీని వల్ల యజమానులకు ఓవర్ టైమ్, అసురక్షిత యంత్రాలు, ప్రమాదాల నివేదికలను తక్కువగా చూపించడం, పిల్లల కార్మికులను ఉపయోగించడం వంటి ఉల్లంఘనలను దాచుకునే అవకాశం లభిస్తుంది. ఉల్లంఘనలు బయటపడినప్పటికీ, చాలా సందర్భాల్లో యజమానులకు ముందుగా "సరిదిద్దుకునే" అవకాశం ఇస్తారు. ఒకప్పుడు జైలు శిక్షకు గురయ్యే నేరాలు ఇప్పుడు కేవలం జరిమానాలకే పరిమితం. పెద్ద కంపెనీలకు ఇది కార్మిక చట్టాలను ఒక లెక్కల వ్యవహారంగా మార్చింది. చట్టాన్ని ఉల్లంఘించడం ఎంత ఖర్చవుతుంది అన్నదే ప్రశ్న. శిక్ష తీవ్రత తగ్గినప్పుడు, భయపెట్టే శక్తి కూలిపోతుంది. కార్మికులే మూల్యం చెల్లిస్తారు.

ఉద్యోగ భద్రత క్షీణత : హైర్-అండ్-ఫైర్ సంస్కృతి తిరిగి రావడం

ఉద్యోగ భద్రత భారత కార్మికులకు లభించిన కొద్ది ముఖ్యమైన రక్షణల్లో ఒకటి. గతంలో 100 లేదా ఎక్కువ కార్మికులు ఉన్న సంస్థలు ఉద్యోగులను తొలగించడానికి లేదా మూసేయడానికి ముందు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇది ఉద్యోగ నష్టం కేవలం వ్యక్తిగత విషయం కాదు, అది కుటుంబాలు, సమాజాన్ని ప్రభావితం చేస్తుందనే సత్యాన్ని అంగీకరించింది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ ఈ పరిమితిని 100 నుండి 300 కార్మికుల వరకు పెంచింది. దీనివల్ల ఫార్మల్ రంగంలో ఉన్న పెద్ద సంఖ్యలో కార్మికులు రక్షణకు బయటపడ్డారు. యజమానులు ఇప్పుడు తక్కువ పర్యవేక్షణతోనే ఉద్యోగులను తొలగించగలరు పరిహారం చెల్లిస్తే చాలు, కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రభుత్వాలు ఈ పరిమితిని మరింతపెంచే అధికారాన్ని కూడా కలిగి ఉన్నాయి. దీని ఫలితంగా ఉద్యోగాలు ఎప్పుడైనా పోవచ్చు అనే భయం కార్మికుల్లో నాటుకుపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఫిర్యాదులు చేయడం, యూనియన్ కార్యకలాపాలు నిర్వహించడం లేదా భద్రత కోసం డిమాండ్ చేయడం ప్రమాదకరంగా మారుతుంది. భద్రత స్థానంలో భయం, స్వరం స్థానంలో మౌనం వస్తాయి.

సామూహిక హక్కుల క్షీణత : సిద్ధాంతంలో మాత్రమే మిగిలిన సమ్మె హక్కు

సమ్మె హక్కు లేకుండా సామూహిక చర్చలు అర్థరహితమే. భారత న్యాయస్థానాలు కూడా సమ్మె లేకుండా యూనియన్ హక్కులు అర్థం లేనివని పలుమార్లు పేర్కొన్నాయి. కానీ లేబర్ కోడ్ల కింద సమ్మె చేయడం దాదాపు అసాధ్యంగా మారింది. మునుపు అవసర సేవల్లో మాత్రమే ముందస్తు నోటీసు అవసరం. ఇప్పుడు అన్ని రంగాల కార్మికులు 14 నుండి 60 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలి. నోటీసు ఇచ్చిన వెంటనే సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో సమ్మె చట్టవిరుద్ధం. "చట్టవిరుద్ధ సమ్మెల"కు విధించే శిక్షలు కూడా పెంచబడ్డాయి. యజమానులు ఈ కాలాన్ని ఉపయోగించి ప్రత్యామ్నాయ కార్మికులను నియమించడం, కార్మికులను బెదిరించడం లేదా యూనియన్లను బలహీనపరచడం చేస్తారు. సమ్మెలను నిషేధించలేదు కానీ అవి అమలులో సాధ్యం కానివిగా మారాయి. హక్కులు కాగితాలపై ఉన్నాయి, కానీ వాటిని వినియోగిస్తే శిక్షలు తప్పవు.

పొడవైన పని గంటలు, బలహీనమైన భద్రత

లేబర్ కోడ్లు రోజుకు 12 గంటల పని షిఫ్టులను అనుమతిస్తాయి, వారానికి 48 గంటల పరిమితిని ఉంచినా వాస్తవంలో ఇది కార్మికులను మరింత అలసటకు గురిచేస్తుంది. ముఖ్యంగా ఫ్యాక్టరీలు, గోదాములు, నిర్మాణ స్థలాల్లో పొడవైన పని గంటలు ప్రమాదాలు, గాయాలు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలను పెంచుతాయి. పని చేయడానికి అంగీకరించకపోతే ఉద్యోగం పోతుందనే భయం వల్ల నిజమైన సమ్మతి ఉండదు. మహిళా కార్మికులకు కుటుంబ బాధ్యతలు, భద్రతా సమస్యలు మరింత భారంగా మారుతాయి. అదే సమయంలో, భద్రతా చట్టాల వర్తింపు పరిమితులను పెంచడం వల్ల అనేక చిన్న సంస్థలు తనిఖీలు, సంక్షేమ బాధ్యతల నుంచి బయటపడుతున్నాయి. నివారణ స్థానంలో కాగితాల ప్రక్రియలు, ప్రమాదాల తర్వాత మాత్రమే చర్యలు.

గిగ్ కార్మికులు : హక్కులు లేని గుర్తింపు

గిగ్ ప్లాట్‌ఫాం కార్మికులను లేబర్ కోడ్లు గుర్తిస్తున్నాయి కానీ వారికి ఉద్యోగి హోదా ఇవ్వడం లేదు. ఫలితంగా కనీస వేతనం, ఉద్యోగ తొలగింపు రక్షణ, పని గంటల పరిమితులు, చెల్లింపు సెలవులు, యూనియన్ హక్కులు, లేబర్ కోర్టుల ప్రాప్యత ఇవేవీ వారికి వర్తించవు. బదులుగా ప్రభుత్వం భవిష్యత్తులో ఇవ్వవచ్చు అనేక సంక్షేమ పథకాలు మాత్రమే ఉన్నాయి. ప్లాటారేమ్ నుండి వచ్చే విరాళాలు పరిమితమైనవి, ఐచ్ఛికమైనవి. అల్గారిథంలు వేతనాలు, పనివిభజన, అకస్మాత్తు డీయాక్టివేషను నిర్ణయిస్తాయి.

అసంఘటిత కార్మికులు : చట్టం వెలుపలే

భారతదేశంలో ఎక్కువమంది కార్మికులు అసంఘటితరంగంలో పని చేస్తున్నారు. లేబర్‌కోడ్లు వర్తింపు పరిమితులను పెంచడంద్వారా వలసకార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, గృహ కార్మికులను చట్ట పరిరక్షణకు దూరం చేస్తున్నాయి. అంతర్రాష్ట్ర వలస కార్మికులకు ఉన్న ప్రత్యేక రక్షణలు తొలగించబడ్డాయి.

అసంఘటితత్వం ఇక మినహాయింపు కాదు అది వ్యవస్థీకృతమవుతోంది

సమిష్టి ప్రభావం : హక్కుల స్థానంలో భయం

ముగింపు : శక్తి లేని హక్కులు అర్థరహితం

లేబర్ కోడ్ల వృద్ధి, సమర్థతను వాగ్దానం చేస్తాయి. కానీ అసురక్ష, అలసట, మౌనం మీద నిర్మితమైన వృద్ధి న్యాయమైనదీ, స్థిరమైనదీ కాదు.

సమ్మె చేయలేని, ఫిర్యాదు చేయలేని, భద్రతపై ఆధారపడలేని, న్యాయమైన వేతనంకోరలేని, ఎప్పుడైనా తొలగించబడేకార్మికుడు స్వేచ్ఛగలకార్మికుడు కాదు అతను కేవలం మార్చగలిగే ఒక ఇన్పుట్‌మాత్రమే. ఆ కార్మికచట్టాలు ఇక కార్మికులను కాపాడకపోతే, గౌరవం, జీవనోపాధి, సామాజికన్యాయం అనే రాజ్యాంగ హామీలే బలహీనపడతాయి. భారతదేశం ఎదుగుతుందా లేదా అన్నదికాదు ప్రశ్న ఎదుగుదల కార్మికులహక్కులు, మానవత్వాన్ని గౌరవిస్తుందా అన్నదే అసలు ప్రశ్న.

- ఎఐటీయుసి సెక్రటరీ అండ్ ట్రెజరర్

కాలుష్యంపై కన్నేసి ఉంచండి!

జనక మోహనరావు దుంగ

మానవాళి అభివృద్ధిలో పర్యావరణం కీలకపాత్ర పోషిస్తోంది. పర్యావరణం ఎంత ఆరోగ్యంగా ఉంటే, మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ ఉన్న జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతి పెద్ద రంగాలలో ఒకటి. ఒక ప్రాంతంలోని భౌతిక, రసాయన, సాంస్కృతిక వాతావరణం, ఆ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని కాలుష్య స్థాయి, జీవావరణ వైవిధ్యం, పరిశుభ్రమైన తాగునీటి లభ్యత, పారిశుద్ధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.6 కోట్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. అంతేకాక, వందకు పైగా అనారోగ్యాలు పర్యావరణ ఆరోగ్య సమస్యలతో నేరుగా ముడిపడి ఉన్నాయని కూడా ఆ నివేదిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 155 దేశాలు తమ పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కల్పించినప్పటికీ, భూమి, గాలి, నీరు, రసాయన కాలుష్యం వంటి "పర్యావరణ ప్రమాదాల" వల్ల 23 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పర్యావరణంలో మార్పులు ప్రజల జీవనోపాధికి, ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నాయి. గత పదేళ్లుగా వాతావరణంలో వేడి పెరుగుతోంది. శిలాజ ఇంధనాల వాడకం పెరగడం వల్ల భూతాపం పెరుగుతోంది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగింది. అడవులు తగలబడటం, అకాల వరదలు, తుఫానులు సాధారణబయ్యాయి. వాతావరణ మార్పు అనేది సూక్ష్మజీవుల మనుగడకు, వైరస్‌ల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

పర్యావరణంలో సవాళ్లు : వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరగడం, అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు పెరగడం, అలాగే ఆర్కిటిక్ ప్రాంతాల్లో మంచు కరగడం వంటివి పర్యావరణానికి ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి నిధి ఇటీవల ఒక నివేదికలో క్షీరదాలు, చేపలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాల జనాభా 1970 నుంచి 2016 మధ్య సగటున 68 శాతం క్షీణించాయని తెలిపింది. ఇది జీవ వైవిధ్యానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. అలాగే పట్టణీకరణ, పంటలు, పశువుల పెంపకం, కాగితాల తయారీ కోసం ప్రతి సంవత్సరం కోటి హెక్టార్లకు పైగా చెట్లను నరికేస్తున్నారు.

ప్రపంచంలోని అతి పెద్ద పర్యావరణ సమస్యలలో వాయు కాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42లక్షల నుంచి 70లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి పది మందిలో తొమ్మిది మంది అధిక కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చు కుంటున్నారు. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, భూమిపై సముద్రమట్టం సంవత్సరానికి సగటున 3.2 మి.మీ పెరుగు తోంది. ఈ శతాబ్దం చివరి నాటికి అది దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశంఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పెరుగుదల వల్ల సముద్ర తీరప్రాంతాలు ముంపునకు గురై, సుమారు 34 కోట్ల నుంచి 48 కోట్ల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది.

ప్రతి గంటకు 300 ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో

వున్న అడవులు నరికేస్తున్నారు. ఇలాగే కొనసాగితే, 2030 నాటికి కేవలం 10శాతం అటవీ ప్రాంతం మాత్రమే మిగులుతుంది. భూ-వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్‌లో 30 శాతం మహాసముద్రాలు గ్రహిస్తాయి. దీని కారణంగా సముద్ర జలాలు ఆమ్లీకరణకు గురవుతున్నాయి. అప్పుడు 2050నాటికి పగడపు దిబ్బలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నేలలో కనీసం 3 నుంచి 6 శాతం సేంద్రీయ పదార్థం ఉంటుంది. కానీ ప్రపంచంలో చాలా చోట్ల ఇది ఉండాల్సిన దాని కంటే చాలా తక్కువగా ఉంది. ఇది నేల కోతకు సంకేతం.

పరిష్కారాలు : మన దేశంలో పర్యావరణ పనితీరును మెరుగుపరచడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. ఈ పనిని ముఖ్యమైన రంగాలన్నీ కలిసి అన్ని వైపుల నుంచి ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

విధానాలు- పాలన : పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రస్తుతం ఉన్న చట్టాలను అమలుచేస్తూనే ప్రభుత్వం కొత్త నియమాలను రూపొందించాలి. గాలి, నీటి కాలుష్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, జీవ వైవిధ్యం వంటి విషయాలకు సంబంధించిన నియమాలను పటిష్టం చేయాలి. పర్యావరణ పనితీరు సూచిక వంటి సంస్థల నుంచి లభించిన డేటాను ఉపయోగించుకుని కాలుష్యానికి సంబంధించిన బలహీనమైన ప్రాంతాలను గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను కనుగొనాలి.

శక్తి - వాతావరణ చర్యలు : శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని వేగవంతం చేయాలి. సౌర శక్తి, పవన శక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెంచడం చాలా ముఖ్యం. 'నేషనల్ సోలార్ మిషన్', 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' వంటి కార్యక్రమాలు ఇప్పటికే బాగా పనిచేస్తున్నాయి. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి, 'ఉజాల' వంటి పథకాలను ప్రోత్సహించాలి. బొగ్గు వంటి ఇంధనాల వాడకాన్ని దశల వారీగా తగ్గించి, దాని స్థానంలో కాలుష్య రహిత సాంకేతికతను ప్రోత్సహించాలి.

కాలుష్య నియంత్రణ : గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. దీనిలో పారిశ్రామిక ఉద్గారాలను నియంత్రించడం, ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడాన్ని నివారించడం వంటి చర్యలు ఉంటాయి. నదుల కాలుష్యాన్ని తగ్గించడానికి 'నమామి గంగే' వంటి పథకాలను విస్తృతం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించడం, వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించడం, చెరువులు, నదుల వంటి నీటి వనరులను కాపాడటం కూడా అవసరం. వ్యర్థ పదార్థాల నిర్వహణకు 'ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ' వంటి విధానాలను కచ్చితంగా అమలు చేయాలి.

జీవవైవిధ్యం -అడవుల సంరక్షణ : 'నగర్ వన్ యోజన' వంటి పథకాల ద్వారా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచాలి. అలాగే, 'మిష్టి' వంటి కార్యక్రమాలతో తీర ప్రాంతాలలో మడ అడవులను కాపాడాలి. వ్యవసాయంలో పర్యావరణానికి హాని కలిగించని విధానాలను, అంటే సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడిని ప్రోత్సహించాలి. అడవులను, వాటిలోని జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి 'ప్రాజెక్ట్ టైగర్', 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' వంటి ప్రాజెక్టులను కొనసాగించాలి.

ప్రజలు, వ్యాపార సంస్థల పాత్ర: పర్యావరణ సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. వ్యర్థ పదార్థాలను వేరు చేయడం, నీటిని పొదుపుగా వాడటం, వినియోగాన్ని తగ్గించడం వంటి వాటిని ప్రోత్సహించాలి. కంపెనీలు కూడా పర్యావరణ హితమైన ఉత్పత్తి విధానాలను అవలంబించాలి. కాలుష్యాన్ని తగ్గించడానికి, వ్యర్థాలను పునర్వినియోగం చేయడానికి సాంకేతికతను ఉపయోగించాలి. స్థానిక ప్రజలను పర్యావరణ పరిరక్షణలో భాగం చేయడం ద్వారా, ఈ ప్రయత్నాలు మరింత విజయవంతం అవుతాయి.

సెల్: 8247045230

మీడియాపై బీజేపీ మంత్రి చిందులు

ఇండోర్: మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాశ్ విజయవర్గీయ మీడియాపై విరుచుకుపడ్డారు. అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇండోర్‌లోని భగీరథ్‌పురా ప్రాంతంలో జరిగిన కలుషిత తాగునీటి ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఎదురుదాడికి దిగారు. భగీరథ్‌పురా ఇండోర్-1 అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో కలుషిత నీటితో అతిసారం కారణంగా 8 మంది మరణించగా, 212 మంది ఆస్పత్రి పాలయ్యారు. 50 మంది డిశ్చార్జ్ కాగా, పలువురు చికిత్స పొందుతున్నారు. ఈ అంశంపై రాష్ట్రపట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ మంత్రి విజయవర్గీయను మీడియా వివరణ కోరింది. భగీరథపురాకు చెందిన పలువురు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు చెల్లించిన బిల్లులు ఎందుకు వాపసు పొందలేదని, నివాసితులకు తాగునీటి ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారని పాత్రికేయులు నిలదీశారు. దీంతో ఆగ్రహించిన మంత్రి పనికిరాని ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారంటూ ఓ విలేకరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండోర్‌లో నీటికాలుష్యం కారణంగా మరణించిన వారి సంఖ్య 8 నుండి 10కి చేరిందని, బాధ్యత వహించాల్సిన బీజేపీ నేత అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జితు పట్వారా విమర్శించారు.

అతివాదులకు హిట్లర్ గతే

ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: దేశంలోని కొన్ని భాగాల్లో కశ్మీరీలను లక్ష్యంగా చేసుకుంటున్న వారు హిట్లర్ మార్గాన్ని అనుసరిస్తున్నారని, ఏదో ఒక రోజు అతివాదులకు అంతం కావాల్సిందేనని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ 'కొందరు హిట్లర్ పథాన్ని ఎంచుకున్నారు. హిట్లర్ తరహా పాలనను కోరుకుంటు న్నారు. ఇలాంటి లక్ష్యాలు పెట్టుకున్న వారు కొందరు ఉండటం మన విధి' అని వ్యాఖ్యానించారు. 'హిట్లర్‌కు అంతం తప్పలేదు. తనను తాను కాల్చుకొని చనిపోయాడు. అక్కడితో నాజీయిజానికి తెరపడింది. అతివాదుల పరిస్థితి కూడా అంతే' అని కశ్మీరీలపై దాడుల గురించి ప్రశ్నకు ఫరూక్ బదులిచ్చారు. ఈ కొత్త సంవత్సరంలో భారత్‌కు దాని ఇరుగు పొరుగు దేశాలకు మధ్య శాంతి-స్నేహం ఏర్పడాలని ఆకాంక్షించారు. 'నూతన సంవత్సరం మొదలైంది. ఆ భగవంతుడు కష్టాలను తీర్చేందుకు వర్షం, హిమ పాతం కురిపించాలి. దేశంలో శాంతి నెలకొనాలని ప్రార్థిస్తున్నాం. పక్క దేశాలతో స్నేహాన్ని ఆకాంక్షిస్తున్నా. అప్పుడే మన కష్టాలన్నీ తీరగలవు' అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా అంత్యక్రియలకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ హాజరు కావడంపై స్పందిస్తూ 'అది మంచిదే. బంగ్లాదేశ్‌తో భారత్‌కు సుదీర్ఘ స్నేహమున్నది. సంబంధాలు మరింత బలపడాలి' అని ఫరూక్ తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కశ్మీరీ భాషలో అనువదించడంపై ప్రశ్నకు 'చాలా ఏళ్ల కిందటే రాజ్యాంగాన్ని కశ్మీరీలో అనువదించారు' అని ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు.

సరిహద్దుల్లో పాక్ డ్రోన్ కలకలం

కశ్మీర్: నూతన సంవత్సరం వేళ నియంత్రణ రేఖ వెంబడి పాక్ డ్రోన్ కలకలం సృష్టించింది. భారత గగనతలంలోకి ప్రవేశించి ఐఈడీ, మాదక ద్రవ్యాలు జారవిడిచినట్లు తెలుస్తోంది. దీంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లోని నియంత్రణరేఖ వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. ఖాదీ కర్మదా ప్రాంతంలోకి పాక్ డ్రోన్ చొరబడింది. దాదాపు ఐదు నిమిషాల పాటు అక్కడే చక్కర్లు కొట్టింది. ఐఈడీ, మందుగుండు సామగ్రి, డ్రగ్స్‌ను జారవిడిచింది. డ్రోన్ కదలికలను గుర్తించిన వెంటనే భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ నుంచి జారిపడిన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏదైనా ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందా అనే కోణంలో ఖాదీ కర్మదా సహా పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఈ ఘటన పూంఛ్ ప్రాంతంలో జరగబోయే ఉగ్రదాడిలో భాగంగా అనుమానిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. నూతన సంవత్సరంలో పాక్ మద్దతున్న ఉగ్రవాద గ్రూపులు జమ్మూకశ్మీర్‌లో దాడికి కుట్ర చేశాయని గతంలో నిఘా వర్గాలు సూచించాయన్నారు. భారత సైన్యం జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి నియంత్రణ రేఖ వెంబడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా... డాక్టర్ సహా ఏడుగురి అరెస్ట్

తిరువనంతపురం: కేరళ రాజధాని తిరువనంతపురంలో విద్యార్థులు, డాక్టర్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఎండీఎంఏ, హైబ్రిడ్ గంజాయి, ఇతర మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఓ డాక్టర్ సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. విద్యార్థులు, డాక్టర్లకు కొందరు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు జిల్లా యాంటీ-నార్కోటిక్స్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్‌కు సమాచారం అందింది. కనియాపురం తోపిల్ ప్రాంతంలోని అద్దె ఇంటిలో డ్రగ్స్ సరఫరాదారులు నివసిస్తున్నట్లు యాంటీ-నార్కోటిక్స్ అధికారులకు తెలిసింది. దీంతో ఆ ఇంటిని చుట్టుముట్టి దాడి చేశారు. సోదాలు చేశారు. నాలుగు గ్రాముల ఎండీఎంఏ, గ్రాము హైబ్రిడ్ గంజాయి, వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఏడుగురు నిందితులను అధికారులు గుర్తించారు. డాక్టర్ విఘ్నేష్ దాతన్, డెంటల్ విద్యార్థిని హాలీనా, ఐటీ ఉద్యోగి అవినాష్, అసిమ్, అజీత్, అన్సియా, హరీష్‌ను అరెస్ట్ చేశారు. అసిమ్, అజీత్, అన్సియా గతంలో అనేక మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్నారని నిర్ధారించారు. నిందితులకు చెందిన రెండు కార్లు, రెండు బైకులతో పాటు పది మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ బృందాన్ని అడ్డగించే ప్రయత్నం విఫలమైందని పోలీస్ అధికారి తెలిపారు. పోలీస్ వాహనాన్ని కారుతో ఢీకొట్టి నిందితులు పారిపోయినట్లు వెల్లడించారు.

బీజేపీ బాటలో మమత

ఆలయ నిర్మాణాలకు శ్రీకారం

కోల్‌కతా: త్వరలోనే తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎలాగైనా పశ్చిమబెంగాల్‌లో పాగా వేయాలని బీజేపీ సుదీర్ఘకాలంగా తంటాలు పడుతోంది. కానీ సాధ్యపడలేదు. ఈసారైనా బెంగాల్‌లో బీజేపీ జెండా పాతాలని మేథోమథనం చేస్తోంది. ఇంకోవైపు నాలుగోసారి అధికారాన్ని స్థిరపరచుకోవాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యూహాలు రచిస్తున్నారు. బీజేపీ వర్సెస్ మమత మధ్య వ్యూహాలు-ప్రతివ్యూహాలు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే మరోసారి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు మమతా బెనర్జీ వ్యూహాలు రచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఆలయాల నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ చేసే ఆరోపణలను తిప్పికొట్టేందుకు మమత ఈ ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల మమతా బెనర్జీ ఆలయాల నిర్మాణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బీజేపీ నుంచి ఎదురవుతున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ఈ కొత్త ఎత్తుగడ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దిఘాలో జగన్నాథ ఆలయ పనులు ప్రారంభించారు. కోల్‌కతాలోని న్యూటౌన్‌లో దుర్గా ఆలయ నిర్మాణం చేపట్టారు. ఉత్తర బెంగాల్‌లోని సిలిగురిలో మహాకాళ్ ఆలయ ప్రాజెక్టు ప్రారంభించారు. 17 ఎకరాల్లో దుర్గా అంగన్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మమత మాట్లాడుతూ తనపై చాలామంది ఆరోపణలు చేస్తారని, బుజ్జగింపు రాజకీయాలు చేస్తానని నిందిస్తారని వ్యాఖ్యానించారు. వాస్తవంగా తాను లౌకికవాదినని ఆమె చెప్పుకొచ్చారు. తాను అన్ని మతాలను నమ్ముతానని, శాంతియుత సహజీవనాన్ని విశ్వసిస్తానని అన్నారు. తాను హాజరుకాని ఏ వేడుకలు ఉన్నాయని మమత ప్రశ్నించారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఒక సీనియర్ నేత మాట్లాడుతూ ముస్లింలను సంతృప్తిపరిచే పార్టీగా తమపై ఎప్పుడూ బీజేపీ ముద్ర వేస్తోందని, అలా ప్రయత్నం చేస్తూనే ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆలయాల నిర్మాణంతో ఆ విమర్శ పోతుందని, అన్ని విశ్వాసాలను గౌరవించే నాయకురాలిగా మమత ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు. బీజేపీ కూడా మమతకు ధీటుగా ఎత్తుగడలు వేస్తోంది. ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల శంఖారావం పూరించారు. బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని సూచించారు.

రాష్ట్రపతి, ప్రధాని నూతన సంవత్సర శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'నూతన సంవత్సరం సందర్భంగా దేశంలో, విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం కొత్త శక్తి, సానుకూల మార్పులకు ప్రతీక. ఆత్మపరిశీలనకు, కొత్త సంకల్పాలు తీసుకొనేందుకు మంచి అవకాశం. ఈ సందర్భంగా దేశాభివృద్ధి, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణపై మన నిబద్ధతను చాటుకుందాం. 2026 మనందరి జీవితాల్లో శాంతి, సంతోషం తీసుకురావాలని, మరింత బలమైన, సుసంపన్నమైన భారత నిర్మాణానికి కొత్త శక్తిని నింపాలని ఆకాంక్షిస్తున్నానని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. '2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ ఏడాది అందరికీ శాంతి, ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా. బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే మన సమష్టి సంకల్పాన్ని బలోపేతం చేయాలని కోరుకుంటున్నా'నని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ఈ ఏడాది అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలని కోరుకుంటు న్నాను. 2026లో మీ అన్ని ప్రయత్నాలు విజయవంతం కావాలని, మంచి ఆరోగ్యం, శ్రేయస్సు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నా. సమాజం శాంతి, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నా'నని ప్రధాని మోదీ అభిలషించారు.

ఇది ఉద్యమాల సంవత్సరం: ఖర్గే

న్యూఢిల్లీ: పని హక్కు, ఓటు హక్కు, గౌరవప్రదంగా జీవించే హక్కు కోసం నూతన సంవత్సరంలో ఉద్యమాలు జరగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. ఆయన గురువారం దేశ ప్రజలకు ఎక్స్ మాధ్యమంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీయే పాలనలో పేట్రేగిన అవినీతి... దుష్పరిపాలన కారణంగా కొత్త సంవత్సరంలోనూ సంక్షోభాలు, సవాళ్లు తప్పవన్నారు. న్యాయమైన హక్కుల పరిరక్షణకుగాను కొత్త సంవత్సరాన్ని ఉద్యమ వత్సరంగా మారుద్దామని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక విలువలను కలిసి కాపాడుకుందామని ఖర్గే అన్నారు. అలాగే, పౌరుల సాధికారతకు సామాజిక సామరస్యాన్ని బలపర్చుకోవడం కోసం పాటుపడదామన్నారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు భద్రత, రైతుల సుసంపన్నత, వెనుకబడిన వర్గాలకు గౌరవప్రద జీవితం, అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం కోసం ఉద్యమాలు ఐక్యంగా పోరాడాలని ఖర్గే సూచించారు. 2025లో దేశం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నదో అందరూ గమనంలో ఉంచుకోవాలన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టం రద్దు, రూపాయి పతనం, ఎస్ఐఆర్ ప్రక్రియ, నిరుద్యోగం పెరగడం వంటి అనేక అంశాలను గుర్తుచేశారు. వీటన్నింటి దృష్ట్యా 2026లో ఉద్యమ కార్యాచరణ ఉండాలని సూచించారు. అలాగే, కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సౌభాగ్యం కలగాలని, ప్రతి ఒక్కరు పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఎక్స్ మాధ్యమంగా ప్రజలకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

రూ.1.48 కోట్ల ఫ్లాట్... రూ.20,552 నగదు

ఆస్తి వివరాలు వెల్లడించిన సీఎం నితీశ్

పట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2025 ఏడాది ముగింపు సందర్భంగా తన ఆస్తి వివరాలను వెల్లడించారు . సీఎంతోపాటూ క్యాబినెట్ మంత్రులు కూడా తమ ఆస్తులను ప్రకటించారు. ఈ వివరాలను క్యాబినెట్ సెక్రటేరియట్ విభాగం తాజాగా విడుదల చేసింది. సీఎం నితీశ్ కుమార్‌కు ద్వారకలోని బీహార్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓ ఫ్లాట్ ఉంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1.48 కోట్లు. ఇక తన వద్ద రూ.20,552 నగదు ఉన్నట్లు సీఎం తెలిపారు. అంతేకాదు సీఎం మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తున్నారు. స్టేట్ బ్యాంక్ -పాట్నా సెక్రటేరియట్ ఖాతాలో రూ. 27,217, ఢిల్లీలోని ఎస్‌బీఐ పార్లమెంటరీ హౌస్ ఖాతాలో రూ.3,358, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతాలో రూ.27,191 నగదు ఉన్నట్లు సీఎం వెల్లడించారు. తన వద్ద రూ.11,32,753 విలువ చేసే ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు, రూ.2.03 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన మొత్తం చరాస్తుల విలువ రూ.17,66,196. డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా సహా పలువురు మంత్రులుకూడా తమ ఆస్తి వివరాలను బహిర్గతం చేశారు. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ... తన వద్ద రూ.1.35 లక్షల నగదు, తన భార్య వద్ద రూ.35,000 నగదు ఉన్నట్లు ప్రకటించారు. ఎస్‌బీఐ ఖాతాలో రూ.15,35,789, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలో రూ.2,09,688 ఉన్నట్లు వివరించారు. బాండ్లు, షేర్లలో కూడా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. భార్య, కుమార్తె, కొడుకు పేర్లపై బ్యాంకు డిపాజిట్లు కూడా ఉన్నాయి. ఇక సామ్రాట్ చౌదరి వద్ద రూ.ఏడు లక్షల విలువైన బొలెరో నియో ఉంది. తన భార్య వద్ద, తన వద్ద కలిసి రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, పాట్నాలోని గోలా రోడ్డులో తన భార్య పేరుమీద రూ.29 లక్షల విలువైన ఫ్లాట్ ఉంది. ఇక సామ్రాట్ చౌదరి వద్ద రూ.నాలుగు లక్షల విలువైన ఎన్‌పీ బోర్ రైఫిల్, ఆయన తండ్రి ఇచ్చిన రూ.2 లక్షల విలువైన రివాల్వర్ కూడా ఉన్నాయి. మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ... తన వద్ద రూ.88,560 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.55 లక్షలకుపైగా సేవింగ్స్ ఉన్నట్లు ప్రకటించారు. శివ బయోజెనెటిక్, పవర్ గ్రిడ్ వంటి కంపెనీల్లో షేర్లు సహా ఇతర సంస్థల్లో పెట్టుబడులు, రూ.9.90 లక్షల విలువైన 90 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ప్రకటించారు. పలువురు మంత్రులు కూడా ఆస్తి వివరాలను ప్రకటించారు.

తొలి వందే భారత్ స్లీపర్ రైలు సిద్ధం

న్యూఢిల్లీ: ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలో పట్టాలెక్కనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలి రైలు గౌహతి-కోల్‌కతా మధ్య అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటించారు. ఈ రైలుకు ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ... 'వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ పూర్తయింది. త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మెరుగైన భద్రత, రాత్రిపూట సుదూర ప్రయాణాలకు ఆధునిక ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది' అని తెలిపారు. ఈ నెల 18-19 తేదీల్లో ప్రారంభించవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2019 నుంచి భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లు దేశ వ్యాప్తంగా వివిధ మార్గాల్లో పరుగులు తీస్తున్నాయి. ఈ క్రమంలో స్లీపర్ వర్షన్ అందుబాటులోకి తెచ్చింది. రైలు వేగాన్ని పెంచేందుకు వివిధ పరీక్షలు నిర్వహిస్తు న్నారు. రాజస్థాన్ కోటా-నాగ్దా సెక్షన్ల మధ్య ట్రయల్స్ నిర్వహించారు. ఇది విజయవంతమైనట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్టంగా గంటకు 182 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది.

ఎయిర్ మార్షల్ శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు

బెంగళూరు: ఎయిర్ మార్షల్ సీతేపల్లి శ్రీనివాస్‌కు ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (ఏఓసీ ఇన్ సీ) ట్రెనింగ్ కమాండ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు భారత వాయు సేన గురువారం వెల్లడించింది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థైన ఎయిర్ మార్షల్ శ్రీనివాస్ 1987, జూన్ 13న ఐఏఎఫ్ కదనరంగంలో ప్రవేశించారు.

కేటగిరి ఎ అర్హతగల ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఆయనకు 4,200 గంటలు విమానాలు నడిపిన అనుభవం ఉంది. మిగ్-21, ఇస్క్రా, పీసీ-7 ఎంకే 2, హెకపీటీ-32, మైక్రోలైట్ వంటి విమానాలను ఆయన నడపగలరు. చేతక్/చీతా హెలికాప్టర్లను నడపగల సెకెండ్ పైలట్‌గానూ ఆయన అర్హత సాధించారు. ఇదిలావుంటే, ఎయిర్ మార్షల్ శ్రీనివాస్‌తో పాటు ఎయిర్ ఫోర్స్ అకాడమీలో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (పర్సనల్ ఆఫీసర్స్), చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ (ఫ్లైయింగ్) నియామకాలు జరిగాయి.

అణుశక్తి కేంద్రాల సమాచార మార్పిడి

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ దేశాలు అణుశక్తి కేంద్రాల సమాచారాన్ని గురువారం పంచుకున్నాయి. అటామిక్ కేంద్రాలపై దాడి చేయరాదు అన్న ఉద్దేశంతో ఆ స్థావరాల జాబితాను రెండు దేశాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయి. సుమారు మూడు దశాబ్దాల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పెహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేవు. అయినా కానీ రెండు దేశాలు పూర్తి స్థాయిలో అణు కేంద్రాల సమాచారాన్ని అందజేసుకున్నాయి. న్యూక్లియర్ కేంద్రాలపై దాడిని నిలువరించే క్రమంలో సమాచారాన్ని షేర్ చేసుకున్నట్లు విదేశాంగ శాఖ కార్యాలయం పేర్కొంది. దౌత్యపరమైన రీతిలోనే ఈ జాబితా మార్పిడి జరిగినట్లు తెలిసింది. అణుశక్తి కేంద్రాల సమాచారాన్ని పంచుకునేందుకు 1988 డిసెంబరు 31వ తేదీన ఒప్పందం కుదిరింది. అయితే 1991 జనవరిలో ఆ ఒప్పందం అమలు జరిగింది. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీన ఆ సమాచారాన్ని పంచుకుంటారు. అణు కేంద్రాల జాబితాను పంచుకోవడం ఇది 35వసారి అవుతుంది. 1992 జనవరి ఒకటో తేదీన తొలిసారి సమాచారాన్ని షేర్ చేసుకున్నారు. అదేవిధంగా తమ కస్టడీలో ఉన్న పౌర ఖైదీలు, మత్స్యకారుల వివరాలనూ పంచుకున్నాయి. పౌర ఖైదీలు, మత్స్యకారుల జాబితాల ప్రకారం పాకిస్థాన్ చెరలో భారతీయులు, భారతీయులుగా పరిగణిస్తున్నవారు 257 మంది ఉన్నారు. వారిలో 58 మంది పౌర ఖైదీలు కాగా... మిగతా 199 మంది మత్స్యకారులు. మన కస్టడీలో పాక్ జాతీయులు, పాక్ జాతీయులుగా పరిగణిస్తున్న వారు 424 మంది ఉన్నారు. అందులో 391 మంది పౌర ఖైదీలు కాగా... 33 మంది జాలరులు. 2008లో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం దౌత్య మార్గాల ద్వారా ఈ వివరాలను పంచుకున్నాయి.

జర్మన్ బేకరీ కేసు నిందితుడి కాల్చివేత

పూణె: పూణె జర్మన్ బేకరీ పేలుడు కేసులో నిందితుడు(సహ) అస్లాం షబ్బీర్ షేక్(బంటి జాహగీర్దార్) హత్యకు గురయ్యాడు. మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో బైక్‌పై వచ్చిన దుండగులు అతడిని కాల్చి చంపారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర పోలీస్ శాఖ ధృవీకరించింది. జర్మన్ బేకరీ పేలుడు కేసులో పాక్ ప్రేరేపిత ఉగ్రవాది హిమాయత్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అస్లాం షబ్బీర్ షేక్ (బంటి జాహగీర్దార్) సహనిందితుడు. ఉగ్రవాదులకు ఆయుధాలు సరఫరా చేయడంతో పాటు ఈ పేలుడుకు సహకరించాడనే అభియోగాలు అతనిపై ఉన్నాయి. ఈ కేసులో బంటి జహగీర్దార్ 2010లో అరెస్టయ్యాడు. 2013లో బాంబే హైకోర్టు అతనికి బెయిల్ మంజూరు చేయగా... అప్పటి నుంచి బయటే ఉంటున్నాడు. బుధవారం శ్రీరాంపురంలో ఓ అంత్యక్రియల కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా... బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతన్ని కాల్చి చంపారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. నిందితులను పట్టుకునేందుకు ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. జర్మన్ బేకరీ పేలుడు కేసు (2010) భారతదేశంలో జరిగిన ప్రధాన ఉగ్రదాడి. ముంబై దాడుల తర్వాత అంతటి దాడిగా పేరుగాంచింది. ఫిబ్రవరి 13వ తేదీన పూణె కోరేగావ్ పార్క్ సమీపంలోని జర్మన్ బేకరీ వద్ద పేలుడు జరిగింది. ఈ ఘటనలో 18 మంది(విదేశీయులు సహా) ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 60 మందికి పైగా గాయపడ్డారు. తొలుత ఇది సిలిండర్ పేలుడుగా భావించారు. ఫోరెన్సిక్ నివేదికలో ఆర్డీఎక్స్ వాడినట్లు తేలింది. దీంతో ఉగ్రదాడి అయి ఉంటుందని పూణె పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈలోపు దాడికి తామే బాధ్యులమని లష్కరే తోయిబా, ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రసంస్థలు ప్రకటించుకున్నాయి. కరాచీ ప్రాజెక్టులో భాగంగా డేవిడ్ హెడ్లీ నేతృత్వంలో ఈ దాడికి రూపకల్పన జరిగిందని భారత దర్యాప్తు సంస్థలు తేల్చాయి.

మోదీ ప్రభుత్వం చైనాతో రాజీ పడిందా!

పాక్-భారత్ మధ్య దౌత్యం వాదన తిప్పికొట్టాలి: ఒవైసీ

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య రాజీకి మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా వాదనను భారత్ గట్టిగా తిప్పికొట్టాలని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఇది దేశానికి అవమానకరమని అన్నారు. ప్రధాని చైనా పర్యటన వేళ మోదీ సర్కారు ఈ మేరకు ఒప్పందం ఏమైనా చేసుకున్నదా అంటూ అసహనం వ్యక్తంచేశారు. భారతదేశ ప్రతిష్ఠ, సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టి చైనాతో సంబంధాలు మెరుగు పర్చుకుంటారా అంటూ కేంద్రప్రభుత్వాన్ని ఒవైసీ నిలదీశారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిందంటూ మనకంటే ముందే ప్రకటించారు. వాణిజ్యపరమైన ఆంక్షల ద్వారా శాంతి నెలకొల్పినట్లు చెప్పుకున్నారు. ఇప్పుడు చైనా కూడా ఇదే తరహా వాదన వినిపిస్తున్నది. ఇది మన దేశానికి అవమానకరం. ప్రభుత్వం దీనిని తీవ్రంగా ఖండించడం అవసరం' అని సామాజిక మాధ్యమం వేదికగా ఒవైసీ వ్యాఖ్యానించారు. భారత్, పాకిస్థాన్ సమానమన్న రీతిలో చైనా వైఖరి ఉందన్నారు. దక్షిణాసియాలో తమదే అగ్రదేశమనేలా వ్యవహరిస్తోందని ఒవైసీ వ్యాఖ్యానించారు. 'చైనా విదేశాంగ మంత్రి మాటలు ఆశ్చర్యపరిచాయి. దీనిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఖండించాలి. దేశ వ్యవహారాల్లో ఇతరుల జోక్యానికి ఆస్కారం లేదన్న హామీ ఇవ్వాలి' అని హైదరాబాద్ ఎంపీ డిమాండ్ చేశారు. కాగా, ఈ ఏడాది తమ దేశం మధ్యవర్తిత్వం వహించిన కీలకాంశాల్లో భారత్-పాక్ ఘర్షణలు ఉన్నట్లు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

56 శాతం పెరిగిన డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కొత్త సంవత్సరం వేళ డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు గత ఏడాదితో పోలిస్తే 56 శాతం పెరిగి నట్లు పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేళ 868 డ్రంకెన్ డ్రైవింగ్ చలాన్లు జారీ చేసినట్లు పోలీసులు చెప్పారు. గత ఏడాది ఇదే రోజు ఆ సంఖ్య 558గా ఉన్నట్లు పేర్కొన్నారు. పటిష్టమైన రీతిలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయడం వల్ల కేసుల సంఖ్య పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవింగ్, స్పీడింగ్, మోటార్‌సైకిల్ స్టంట్స్, ప్రమాదకర ఉల్లంఘనలను అడ్డుకునేం దుకు ప్రత్యేక ట్రాఫిక్ బృందాలను మోహరించినట్లు అధికారులు చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులు పెరగడం ఆందోళనకరమే అని కొందర న్నారు. డిసెంబరు 31వ తేదీ రాత్రంతా అనేక ప్రదేశాల్లో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు చెప్పారు. చెకింగ్‌ను తప్పించుకునే బైకర్‌లను పట్టుకు నేందుకు అనేక చోట్ల చెక్‌పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. సీసీటీవీ నిఘా ద్వారా సమర్థవంతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ కొనసాగించినట్లు చెప్పారు. న్యూ ఇయర్ సంబరాల నేపథ్యంలో ఢిల్లీ పోలీసు శాఖ అదనంగా సుమారు 20 వేల సిబ్బందిని శాంతి, భద్రతల కోసం మోహరించింది. జనం రద్దీగా ఉండే ప్రదేశాలైన కన్నాట్ ప్లేస్, హౌజ్ ఖాస్, ఏరోసిటీ వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. కేవలం జరిమానా విధించడం మాత్రమే కాదు అని, మద్యం తాగి వాహనం నడపరాదు అన్న బలమైన సందేశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో పకడ్బందీగా ప్లాన్ అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఎయిరిండియా పైలట్లకు

డీజీసీఏ షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ: భద్రతా ప్రమాణాల ఉల్లంఘనపై ఎయిరిండియా కాక్‌పిట్ సిబ్బందికి విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ-టోక్యో మధ్య నడిచిన విమానాల్లో భద్రతా లోపాలు, నిబంధనల అతిక్రమణ ఉన్నా... వాటిని పట్టించు కోకుండా విమానాలను నడిపినందుకు ఈ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యంగా ఢిల్లీ నుంచి టోక్యో వెళ్లిన ఏఐ-357, తిరుగు ప్రయాణంలో టోక్యో నుంచి ఢిల్లీ వచ్చిన ఏఐ-358 విమానాల నిర్వహణలో లోపాలు జరిగి నట్లు డీజీసీఏ గుర్తించింది. ఈ విమానాలకు సంబంధించిన 'మినిమమ్ ఎక్విప్‌మెంట్ లిస్ట్' నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంది. ఇది కేవలం ఒక్కసారి జరిగిన పొరపాటు కాదని, గతంలోనూ వేరే సెక్టార్లలో ఇలాంటి ఉల్లంఘనలే జరిగాయని డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, సివిల్ ఏవియేషన్ నిబంధనల ప్రకారం... బాధ్యులైన పైలట్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-కాప్రా : ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలో నూతన ఆంగ్ల సంవత్సర 2026 సందర్భంగా కార్మికులతో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్. బోస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల కారణంగా ప్రజలు తీవ్రమైన ఆర్థిక భారాలు మోశారన్నారు.
2025లో ధరల పెరుగుదల, విద్య-ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణ ప్రజల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపాయన్నారు. అయినప్పటికీ శ్రమజీవులు తమ హక్కుల కోసం సాగించిన పోరాటాలు స్ఫూర్తిని ఇచ్చాయన్నారు.
2026 నూతన సంవత్సరం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు, కార్మిక రైతు వ్యతిరేక చట్టాల రద్దుకు, సామాజిక న్యాయం సాధనకు పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తోందన్నారు.
కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలతోనే సాధ్యమన్నారు. ప్రజల ఐక్యతతోనే సమానత్వం, న్యాయం, సామ్యవాద సమాజ నిర్మాణం సాధ్య మని విశ్వసిస్తూ ఈ నూతన సంవత్సరం ప్రజా పోరాటాలకు కొత్త ఊపునివ్వా లని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు స్వామిదాస్, జాన్, శ్రీనివాస్,యాకూబ్, నగేష్, ఎల్లయ్య, పాపయ్య, జమా లయ్య, ఓంకార్, ఎల్లేష్, లక్ష్మమ్మ, బుజమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి



విశాలాంధ్ర-దుండిగల్: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉన్నత స్థాయిలో జీవించాలని మాజీ కౌన్సి లర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానందని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి హృదయపూర్వకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూ ఇయర్ వేడుకల్లో సుధీర్ బాబు

విశాలాంధ్ర-కొత్తూరు: నూతన సంవత్సరం సందర్భంగా కొత్తూరు మండల కేంద్రం పరిధిలోని బైపాస్ రోడ్డు, నాట్కో జంక్షన్ వద్ద బుధవారం కొత్తూరు సీఐ నర్సయ్య ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి.సుధీర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా కొత్తూరు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య స్టేషన్ సిబ్బందితో కలిసి కమిషనర్ సుధీర్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, శంషాబాద్ డీసీపీ రాజేష్, పోలీసు సిబ్బందితో కలిసి సుధీర్ బాబు కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
నూతన సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా పోలీసు సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. విధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో కొత్తూరు సీఐ నర్సయ్య, నందిగామ సీఐ ప్రసాద్ లతో పాటు ఆయా పోలీస్టేషన్ లకు చెందిన సీఐ లు, ఎస్ ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర- బషీర్ బాగ్: దళిత బహుజన జీవితాలకు వెలుగు ఇచ్చిన బీమా కోరేగావ్ మహర్ రేజిమెంట్ సౌర్య తిరుగుబాటును స్ఫూర్తిగా తీసుకొని రాజ్యాధికారం సాధన కోసం సన్నద్ధం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. జనవరి 1బీమా కోరేగావ్ మహర్ రేజిమెంట్ సౌర్య దివస్ సందర్భంగా నేడు ట్యాంక్ బండ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పార్టీ, ఆధ్వర్యంలో విజయ్ దివాస్ ప్రదర్శనలో పాల్గొన్నరు. తొలుత డా. అంబేద్కర్ విగ్రనికి, మహర్ సైనికుల అమరవీరుల స్తూపనికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు.
మహర్ రీజ్మెంట్ సౌర్య విజయ్ దివస్ స్ఫూర్తితో పిస్వా వారసులు అయినా నరేంద్ర మోడీ ఎన్డీఏ ఆర్ఎస్ఎస్ సనాతన రాజ్యాని రాజకీయంగా డా.అంబేద్కర్ ఆలోచన విధాన వెలుగులో రాజకీయంగా ఓడించడమే మహర్ రీజ్మెంట్‌కు దళిత బహుజన జాతికి ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్సి రాష్ట్ర లీగల్ కన్వీనర్ జి, విజకుమారి, మాల మహానాడు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జెన్ రావు, నక్క దేవేందర్, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటికాల గణేష్, దళిత బహుజన పార్టీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, హైకోర్ట్ నాయవాదులు మద్దెల రాయప్ప, ఎం, నర్సింహాలు, విద్యార్థి నాయకులు చందు హేమత్ సాయి వంశీ తదితరులు పాల్గొన్నారు.

బొకేలు వద్దు.. బ్లాంకెట్లు ఇవ్వండి

నూతన సంవత్సరంలో మానవత్వమే గొప్ప కానుక: మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ :: సచివాలయంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో సెర్ప్ డైరెక్టర్లు, సిబ్బంది మంత్రి సీతక్కను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల బొకే కాకుండా తెలంగాణ నేతన్నలు తయారు చేసిన దుప్పటిని మంత్రి సీతక్కకు దివ్య దేవరాజన్ ప్రజెంట్ చేశారు. సెర్ప్ డైరెక్టర్లు, సిబ్బందిని మంత్రి సీతక్క అభినందించారు. అనంతరం ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సెర్ప్ డిపార్ట్‌మెంట్ ద్వారా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం తీవ్రంగా క ృషి చేస్తోందని తెలిపారు. నూతన సంవత్సరాన్ని ఆరాటాలతో కాకుండా మానవత్వంతో ప్రారంభించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం నుంచి బొకేలు కాకుండా శాలువలు, దుప్పట్లు ఇవ్వాలని సూచించారు. అలా అందే దుప్పట్లు పేద విద్యార్థులు, చలితో వణికే పిల్లలకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి తెలియజేయగా ఆయన కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని వెల్లడించారు. చలికాలంలో నిరాశ్రయులు, వ ృద్ధులు, కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తుచేస్తూ, బొకేలు క్షణాల్లో వాడుక లేకుండా పోతే ఒక దుప్పటి మాత్రం పేదవాడికి రక్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. "బొకేలు వద్దు%ా% బ్లాంకెట్లు ఇవ్వండి" అంటూ ఆమె పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో మానవత్వమే గొప్ప కానుక అని స్పష్టం చేశారు. సెక్రటేరియట్ ముందు శాలువలు, దుప్పట్లు సులభంగా లభించేలా టెస్కో ద్వారా ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేసేందుకు క ృషి చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. పేదల చిరునవ్వే నిజమైన నూతన సంవత్సర శుభాకాంక్ష అని, చిన్న సహాయం కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందని ఆమె అన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర-కొత్తూరు: మతసామరాస్యానికి ప్రతికగా నిలిచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో గురువారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగరుకుంట నవీన్ కుమార్ రెడ్డి, షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తూరు మండలం, ఇన్ ముల్ నర్వ పంచాయతీ పరిధిలో గల పవిత్ర హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా లో ప్రతి ఏటా జరిగే ఉర్సు ఉత్సవాలకు ముందు ముజావర్లు నిర్వహించే ఫాతేహా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగరుకుంట నవీన్ కుమార్ రెడ్డి లతో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని బాబాలకు చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలకు ముందు ప్రతి ఏటా ముజావర్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితి అని పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రపంచ శాంతిని కోరుతూ ప్రజలందరు బాగుండాలని నిత్యం దర్గాలో ముజావర్లు ప్రార్థిస్తుంటారని కొనియాడారు. ఈ నెల 15,16,17 తేదీల్లో జరుగబోయే ఉర్సు ఉత్సవాలను అందరు కలిసి ఘనంగా జరుపుకోవాలని సూచించారు. దర్గా అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, ఆల్ ఇండియా క ృష? మహేష్ ప్రజా సేన అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరి, బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ మిట్టు నాయక్, శివాచారి, తస్లీమ్, రషీద్, ఖాలెద్, షాహిద్, రవికుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్ పీర్ దర్గా ఒక పవిత్ర పుణ్యస్థలం: అలీ

విశాలాంధ్ర-కొత్తూ రు: మతాలకు అతీ తంగా ప్రతి ఒక్కరూ సందర్శించే ఒక పవిత్ర పుణ్యస్థలం జహంగీర్ పీర్ దర్గా అని సినీ నటుడు అలీ అన్నారు. దర్గాలో జరుగుతున్న ఫతేహా ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఆయన దర్గాను సందర్శించారు. సతీపుత్ర సమేతంగా హాజరైన ఆయన దటీలు కప్పి ముస్లిం పండితుల ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పలుమార్లు దర్గాను సందర్శించానని, ఇక్కడికి వస్తే ఎంతో ప్రశాంతంగా ఉంటుందని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఆయన అన్నారు. జనవరి 15వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆలయ నిర్వాహకులు ఇక్కడ కార్యక్రమాలు అన్నింటిని ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సినీనటుడు అలీకి ఘన స్వాగతం పలికారు. ఉత్సవాలలో పాల్గొన్న ఆయన పండితుల ఆశీస్సులు తీసుకున్నారు..

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకై వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టులను జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) / జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ (ఎన్‌యుహెచ్‌ఎం) కింద కాంట్రాక్ట్ పద్ధతిలో తాత్కాలికంగా భర్తీ చేయుటకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 మెడికల్ ఆఫీసర్ పోస్టులు (అవసరాన్ని బట్టి పెరగవచ్చు లేదా తగ్గవచ్చు) భర్తీ చేయబడతాయని, అభ్యర్థులు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం, 1956 ప్రకారం గుర్తింపు పొందిన %వీదీదీూ% డిగ్రీ కలిగి, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్లో నమోదు అయి ఉండాలని, అలాగే ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.52,000/- వేతనం చెల్లించబడుతుందని తెలిపారు.
వాక్-ఇన్-ఇంటర్వ్యూ వివరాలు:
ఈ నెల 5న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు వేదిక: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, 4వ అంతస్తు, జిహెచ్ఎంసీ భవనం, హరి హర కళా భవనం, సికింద్రాబాద్‌లో ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు రూ.500/- నమోదు ఫీజును డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించి, పూర్తిగా నింపిన దరఖాస్తు ఫార్మేట్‌తో పాటు అన్ని ఒక సెట్ జిరాక్స్ కాపీ, అలాగే ఒరిజినల్ సర్టిఫికేట్లతో వాక్-ఇన్-ఇంటర్వ్యూకు హాజరుకావలసిందిగా తెలియజేశారు. దరఖాస్తు ఫారమ్ మరియు పూర్తి వివరాలు జిల్లా అధికారిక వెబ్ సైట్ ప్రీజూం://ష్రఎంవతీఖఎెన్.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.ఱఅలో అందుబాటులో ఉంటాయని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి: కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లా అభివృద్ధికి అహర్నిశలు క ృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కలెక్టరేట్ కానారేన్స్ హాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జితేందర్ రెడ్డి , డిఆర్ఓ ఈ వెంకటాచారితో కలిసి ఆమె పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఆ విధంగా శాఖ అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది నూతన ఉత్సాహంతో పనిచేయాలని తెలిపారు. తదుపరి జిల్లా కలెక్టర్ కు. అధికారులు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, సిపిఓ డాక్టర్. సురేందర్, సంక్షేమ అధికారులు అక్కేశ్వరరావు, జి ఆశన్న, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటి, జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, జిల్లా వయోవ ృద్ధుల సంక్షేమ అధికారి రాజేందర్, అధికారులు తాసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లా అభివృద్ధితో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి అన్నారు. గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, అడిషనల్ కలెక్టర్లు కదిరవన్, జితేందర్ రెడ్డి, డిఆర్ఓ ఈ.వెంకటాచారిలతో కలసి హైదరాబాద్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. టీజీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్, కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, అసోసియేట్ అధ్యక్షులు ఆశన్న, ట్రెజరర్ ఎం.వి.రమణ, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటాచారి, జాయింట్ సెక్రటరీ విద్యాసాగర్, గౌస్, పబ్లిసిటీ సెక్రటరీ మంచాల రవీందర్, శ్రవణ్ రెడ్డి, సభ్యులు మల్లికార్జున్ రెడ్డి, ఫయాం, కోటాజి, సురేందర్, రాజేందర్, శ్రీరాం, చంద్రజ్యోతి, కేదారేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఏవీ రమణ, పరుచూరి కృష్ణ, గుమ్మడి గోపాలకృష్ణ, కట్ట జనార్దన్, గొట్టిముక్కల రామకృష్ణ, రాజు, పర్చూరు ప్రసాద్, చప్పిడి రాజశేఖర్, పారా రామకృష్ణ, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర, హైదరాబాద్ హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు ప్రాజెక్టులో పెద్దపూర్ నుంచి సింగపూర్ వరకు ఉన్న 1600 ఎంఎం డయా ఫేజ్ - 3 మెయిన్ పైప్‌లైన్‌లో భారీ లీకేజీలను అరికట్టడానికి అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టనున్నారు. దీనితో పాటు, టిఎస్ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో 132కేవీ కంది సబ్‌స్టేషన్ వద్ద పెద్దపూర్ ఫీడర్‌కు సంబంధించి ఏంఆర్‌టి టెస్టింగ్, హాట్ లైన్ రిమార్క్లు లతో పాటు సాధారణ నిర్వహణ పనులు నిర్వహించనున్నారు. ఈ పనులు ఈ నెల 3 శనివారం ఉదయం 10 గంటల నుంచి 4న తెల్లవారుజామున 4 గంటలకు చేపడతారు. కావున ఈ 18 గంటలు కింద పేర్కొన్న ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు: ఓ అండ్ ఎం డివిజన్ 15 : మలేషియన్ టౌన్‌షిప్, మాదాపూర్, కొండాపూర్, డోయెన్స్ సెక్షన్, మాదాపూర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి). ఓ అండ్ ఎం డివిజన్ 9 : భరత్ నగర్, మూసాపేట సెక్షన్, గాయత్రీ నగర్ సెక్షన్, బాలానగర్ సెక్షన్, కేపిహెచ్ బి కొంత భాగం, బాలాజీ నగర్ సెక్షన్ కొంత భాగం. ఓ అండ్ ఎం డివిజన్ 6 : ఫతేనగర్. ఓ అండ్ ఎం డివిజన్ 17 : గోపాల్ నగర్, హాఫీజ్‌పేట్ సెక్షన్, మయూరి నగర్ మరియు మియాపూర్ సెక్షన్. ఓ అండ్ ఎం డివిజన్ 22: ప్రగతినగర్ సెక్షన్, మరియు మైటాస్. ?ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2: బిహెచ్‌ఈఎల్, ఎంఐజి-1 అండ్ 2, రైల్ విహార్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, చందానగర్. కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరడమైనది.

నూతనోత్సాహంతో ముందుకు సాగండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వారి క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో నవీన్ ఆధ్వర్యంలో అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసే విషయంలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజాప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని సమన్వయంతో పని చేస్తేనే అభివ ృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో నవీన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మార్గదర్శకత్వంతో ప్రభుత్వ కార్యక్రమాలు మరింత సమర్థంగా అమలు చేయడానికి క ృషి చేస్తామని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు బి.శ్రీనివాసులు, ఘన్సీరాం, నయాబ్ తహసీల్దార్లు దేవేందర్, శ్యాంసుందర్ రెడ్డి, ఆర్ఐ సుదర్శన్, సర్వేయర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శంకర్ కంటి ఆసుపత్రి, మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఉచిత కంటి పరీక్షలు మరియు కంటి శుక్లాల (ముత్యబిందు) ఉచిత ఆపరేషన్ శిబిరం గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ తరహా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ మరియు శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షులు మహ్మద్ మునీర్, సాజిద్, అబ్దుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌తో మెరుగైన ఆరోగ్యం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అథ్లెటిక్స్ ఆరోగ్యాన్ని,జీవన ప్రమాణాన్ని పెంపొందిస్తాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద డిసెంబర్ 27,28లో కరీంనగర్ లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కాంపిటీషన్‌లో సత్తా చాటిన మేడ్చల్ జిల్లాకు చెందిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యుల బృందం అధ్యక్షులు, వెటరన్ క్రీడాకారుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కాంపిటీషన్‌లోని వాకింగ్,రన్నింగ్,జావలిన్ త్రో,లాంగ్ జంప్,హై జంప్ వంటి భాగాలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను పరిచయం చేయగా క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అథ్లెటిక్స్ మనలోని మానసిక ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరకధ ృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రత్నకుమార్,శ్రీలక్ష్మి,లక్ష్మణ్ రావు, కోశాధికారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మధుసూదన నగర్‌లో గల మంజు అనురాగ్ ఎన్ క్లేవ్‌లో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ హాజరై కేకులు కట్ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో ఈ నూతన సంవత్సరంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, కిట్టు, బాచితోపాటు మంజు అనురాగ్ ఎన్‌క్లేవ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఈ లక్ష్మణ్‌కు సన్మానం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహించిన లక్ష్మణ్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లు లక్ష్మణ్‌కు పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలతో నూతన సంత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కొత్త సంవత్సరంలో ఎస్ఈగా ప్రమోషన్ రావడంతో కాంట్రాక్ట్ అసోసియేషన్ తరపున పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొని సన్మానించడం జరిగింది.

నేడు చిక్కడపల్లి లింక్ బ్రిడ్జికి ప్రారంభోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : అశోక్ నగర్ నుంచి దోమలగూడ హుస్సేన్ సాగర్ నాలా లింక్ బ్రిడ్జి పనులు ఇప్పటికే పూర్తి కాగా ఈ లింక్ బ్రిడ్జిను ఈ నెల 2న జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలు ప్రారంభించనున్నారు. చిక్క డపల్లి నుంచి అశోక్ నగర్, దోమలగూడను కలిపే లింక్ బ్రిడ్జి మీదుగా దోమలగూడ నుంచి లిబర్టీ జీహెచ్ ఎంసీ ఆఫీస్ వరకు ఈ బ్రిడ్జి కొనసాగనుంది. 2కిలో మీటర్ల వరకు విస్తరించిన ఉన్న ఈ బ్రిడ్జిపై వెళ్తే కేవలం 10 నిమిషాల్లో లిబర్టీకి చేరుకోవచ్చు. ఈ మార్గంలో ఎలాంటి సిగ్నల్స్ ఉండవు. రూ.6కోట్ల వ్యయంతో 2023లో పనులు ప్రారంభమయ్యాయి.
48 మీటర్ల విస్తీర్ణంతో ప్రధాన బ్రిడ్జి నిర్మాణం...
ప్రధాన బ్రిడ్జి 48 మీటర్ల విస్తీర్ణంతో నిర్మించారు. దోమలగూడ వైపు నుంచి లిబర్టీకి వెళ్లే ర్యాంపును 38 మీటర్లతో నిర్మించారు. అశోక్ నగర్ వైపు నుంచి వెళ్లే వారికి 22 మీటర్లతో ర్యాంపును నిర్మించారు. చిక్కడపల్లి సుధాహోటల్ నుంచి త్యాగరాయ గానసభ, నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్ నగర్ నుంచి లిబర్టీకి చేరుకోవచ్చు. దోమలగూడ సూరజ్ గర్ కాలనీ నుంచి గగన్ మహల్, లిబర్టీ జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు నేరుగా వెళ్లొచ్చని జీహెచ్ ఎంసీ ప్రాజెక్ట్ ఏఈ ప్రశాంత్ తెలిపారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి: తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సి.నారాయణ రెడ్డి, కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా వాల్ , టేబుల్ క్యాలెండర్ -2026 ను ఆవిష్కరించారు. అనంతరం కె. చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) , కె. శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (ఎల్బి) మరియు సంగీత, జిల్లా రెవెన్యూ అధికారులను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె.రామారావు కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను, అదనపు కలెక్టర్లను మరియు జిల్లా రెవిన్యూ అధికారిని కలిసి సెంట్రల్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి శ్ సత్యనారాయణ అన్న పదవీ విరమణ అభినందనోత్సవానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నూతనకంటి వెంకట్,శాంతి శ్రీ, అలివేలు, అనిత, నాగేశ్వరావు, రాకేష్,బాలేశ్వరి, జ్యోత్స్న, మాసూద్ అలీ, శాంతిరేఖ, మధుశ్రీ, కవిత, నాగు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: విశ్వనాథన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సమయం ఆదాతోపాటు సులభతరంగా పనిచేయడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం వల్ల ఉద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణం ఎన్టీఆర్ పరిపాలనా భవనం రెండో అంతస్థులో సమాచార శాఖ కమిషనరేట్‌లో గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఆయన ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు కృత్రిమ మేథ (ఏఐ), చాట్ జీపీటీ, గూగుల్ జెమినీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కంటే ఉద్యోగులు తమ పనితీరులో మెరుగైన ఫలితాలు కనపర్చారని కితాబిచ్చారు.

కమిషనర్‌కు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఆంగ్ల నూతన సంవత్సర సు పురస్కరించుకుని కమిషనర్ శ్రీ ఆర్ వి కర?న్ కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ లు , జోనల్ కమిషనర్ లు , విభాగాల అధిపతులు, డిప్యూటీ, ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్‌కు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో అదనపు కమిషనర్‌లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, వినయ్ కృష్ణా రెడ్డి, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, జోనల్ కమిషనర్‌లు సంచిత్ గంగ్వార్, రాధిక గుప్తా, హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, ముకుంద రెడ్డి, ప్రియాంక అలా, బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, చంద్రకళ, ఎన్.రవికిరణ్, శ్రీనివాస్ రెడ్డి, విజిలెన్స్ ఏఎస్పీ నరసింహా రెడ్డి, సీసీపి శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్‌లు భాస్కర్ రెడ్డి, సహదేవ్ రత్నాకర్, జ్యోతి, నిత్యానందు, ఎస్.ఈ.గోపాల్ చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్ వెంకటేశ్వర రెడ్డి, ఫైనాన్సియల్ అడ్వైజర్ శరత్ చంద్ర, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, అసిస్టెంట్ ఫుడ్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ మూర్తి రాజు, కంట్రోల్ రూం ఓఎస్‌డి అనురాధ, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ఉద్యానవన అధికారి సునంద, కమిషనర్ పేషీ పిఎస్ రమణ, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబరాబాద్ సీపీఓలో నూతన సంవత్సరం వేడుకలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: 2026 నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ సైబరాబాద్ సీపీ డాక్టర్ యం. రమేష్, ఐపీఎస్., జాయింట్ సీపీ (ట్రాఫిక్) డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్., డీసీపీలు, పోలీస్ సిబ్బందితో కలిసి ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్లోని ఆడిటోరియంలో కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించిన సిబ్బందిని ముందుగా సీపీ అభినందించారు. పోలీస్ సిబ్బంది అంకితభావంతో పోలీసు విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలందరికీ సీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఐపీఎస్., మాదాపూర్ డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, ఎస్బీ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, విమెన్ & చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల కమలాదేవికి సీఆర్ ఫౌండేషన్ నివాళి



విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి 25వ వర్ధంతి సందర్భంగా సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంక్షేమ కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆరుట్ల కమలాదేవి బర్కత్ పురాలోని రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి మహిళా కళాశాలలో మొదటి విద్యార్థిని గా ఆనాడు బాలికలకు హాస్టల్ వసతి కోసం పోరాటం చేసి వైఎంసి వద్ద ఉన్న ఉమెన్స్ హాస్టల్ను ఏర్పాటు చేయడం కోసం పోరాటం చేశారని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణలో స్వాతంత్రం రాకపోవడంతో భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన సాయుధ పోరాటంలో ఆరుట్ల కమలాదేవి ఆరుట్ల రామచంద్రారెడ్డి తుపాకి పట్టుకొని పాల్గొన్నారు అని తెలిపారు. మొదటి శాసనసభ ఎన్నికల్లో ఆలేరు నుంచి ఎన్నికయ్యారని తెలిపారు.సిపిఐ శాసనసభ పక్షా నేతగా పనిచేశారని అన్నారు. భారత జాతీయ మహిళా సమైక్య నాయకురాలుగా అనేక మహిళల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. ఆరుట్ల కమలాదేవి ఆశయాలను సాధించడం కోసం మనందరం కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి-వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవరావు , మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, అడ్వైజర్ ఉష, సిఆర్ పాలీక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె రజిని, సభ్యులు, లలిత, వంకా లక్ష్మి వృద్ధాశ్రమ వాసులు సాంబశివరావు, హోమ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకపూడి గాంధీకి శుభాకాంక్షల వెల్లువ



విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: నూతన సంవత్సరం 2026 సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో కార్పొరేటర్లు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, విరేశం గౌడ్, మోహన్ ముదిరాజు , నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలందరూ గత సంవత్సరాన్ని స్మరించుకుంటూ నూతన సంవత్సరంలోకి అడిగిడుతూ ఈ నూతన సంవత్సరం ఆశలు, ఆశయాలు మరియు విజయాలు చేకూరి, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ 2026 ఆంగ్ల నూతనసంవత్సర కాలంలో మీరు నిత్యనూతన ఉత్సాహం తో, చిరునవ్వుతో ఉండాలని , మీ జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని, మీరు చేయబోయే ప్రతీ కార్యం లో మీకు విజయం సిద్ధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మీకు మీ కుటుంబసభ్యులకు 2026 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలియచేస్తున్నాను అని తెలియచేసారు.

అన్నదాన క్షేత్రం భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర- మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయం బోడుప్పల్ ఆలయ విస్తీర్ణంలో భాగంగా గురువారం ఉదయం అన్నదాన క్షేత్రం భవనానికి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్యులు, శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య సంస్థానాధీశ్వరులు, శ్రీ విద్యారణ్య భారతి స్వామీజి వారి కరకమలములచే 2 నూతన ద్వారాలు (చౌకోట్లు)కు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఏర్పాటు చేయడం జరిగింది. సనాతన ధర్మం కోసం అందరూ పాటుపడాలని స్వామివారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, ఎస్. శ్రీనివాస్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ రూపొందించాలి

ముఖ్యమంత్రికి ఎస్టీయూటీఎస్ వినతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న సర్వీసు రూల్స్‌ను వెంటనే రూపొందించాలని కోరుతూ ఎస్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం, సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో కలిసి సంఘ నాయకులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందం గౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ... రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ లేకపోవడం వల్ల పాఠశాల విద్యాశాఖలో పర్యవేక్షణాధికారుల వ్యవస్థ లేక తీవ్ర సంక్షోభం ఏర్పడిందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. దీని కారణంగా ఉపాధ్యాయులకు పదోన్నతి చానెల్ నిలిచిపోయిందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ కమిటీ చైర్మన్ కె.కేశవ రావుతో చర్చిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. దీంతో పాటు డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాబేర్ అలి, ఎ.వి.సుధాకర్, కరుణాకర్ రెడ్డి, మాతంగి శంకర్, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, ఇఫ్తెకారుద్దీన్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరించిన సీఎం

విశాలాంధ్ర, హైదరాబాద్ : నిహైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2026 సంవత్సరానికి రూపొందించిన నూతన డైరీ ని ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి గారు ఆవిష్కరించారు. నిసచివాలయంలోని ఆయన కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టులను అన్ని విధాల ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. నిహైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ .రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దేల్లిబాపూరావు, ఈసీ సభ్యులు ఎన్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, శంకర్ సిగ, ముత్యాల సత్తిబాబు, నాగరాజు వనం, ఎన్. శ్రీనివాసరెడ్డి ,అశోక్ దయ్యాల, అమిత్ బట్టు సహా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్. రవి కాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రెస్ క్లబ్ పక్షాన ఒక వినతి పత్రాన్ని బ పాలకమండలి సమర్పించింది. ముఖ్యమంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు విజయ కుమార్ రెడ్డి రమేష్ వరికుప్పల మొక్కను అందజేసి శాలువాతో ఈ సందర్భంగా సత్కరించారు.ని

తెలంగాణ అభివృద్ధికి కృషి చేద్దాం: సబిత

విశాలాంధ్ర - మొయినాబాద్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ హెూంమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని మొయినాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో సబితారెడ్డిని మర్యాదపూర్వకంగా నివాసంలో కలిసి పూల బోకేతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాల గమణం మారుతున్నప్పటికి గ్రామాల అభివ ృద్ధి జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడిచిన 2025 సంవత్సరంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం ఎంతో కృషి చేశారని అదే విధంగా ఈ కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అందరూ క ృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీని అభివ ృద్ధి చేసినప్పుడే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అన్ని రంగాలలో అభివ ృద్ధి చెందుతుందని తెలిపారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక

విశాలాంధ్ర-పటాన్ చెరువు: గంగా జమున తెహజీబ్ సంస్కృతికి పటాన్ చెరువు పట్టణం ప్రతీక అని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గాలో ఏర్పాటు చేసిన ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేష్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, వాజిద్ అలీ, హమీద్, అజ్మత్ ఖురేషి,.మొయిన్, షకీల్, ఇమ్రాన్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక దేవాలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పటాన్ చెరువు: ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని పటాన్ చెరువు నియోజకవర్గంలోని రుద్రారంలో గల గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవాలయాన్ని గురువారం ఉదయం పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే జిఎంఆర్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలందరి సహకారంతో పటాన్ చెరువు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, ఆలయ కమిటీ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, సిఐలు వినాయక రెడ్డి, నరేష్, రవీందర్ రెడ్డి, రమణా రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు రాజు, వెంకన్న, నరసింహ రెడ్డి, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాసిందే బీఆర్ఎస్: ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ :: తెలంగాణ నదీ జలాలను మరణశాసనం రసిందే బీఆరెస్ పార్టీ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసమే పి.ఆర్.ఎల్.ఐ.సి నీటి సామర్థ్యాన్ని 1 టి.యం.సి కి కుదించారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ తో హాలయ్ బలయ్ చేసుకుని తెలంగాణా ప్రయోజనాలను తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కృష్ణా జలాశయాలలో 763 టి.యం.సి లు తెలంగాణాకు కేటాయించాల్సిందే అని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుండి శ్రీశైలం ఎందుకు మార్చారన్నారు. పి.ఆర్.ఎల్.ఐ. సి 90శాతం పూర్తి అయిందనడం వాస్తవం కాదని, ప్రాజెక్టును పూర్తి చేయాలి అంటే 80 వేల పై చిలుకు వ్యయం అవుతుందన్నారు. 2015 లో ఈ ప్రాజెక్టును పూర్తికి 35 వేల కోట్లతో అంచనా వేశారని, 2022 లో సి.డబ్ల్యు.సి కి ఇచ్చిన డి పి ఆర్ లో భూసేకరణ, కాలువల నిర్మాణం లేకుండానే 55 వేల కోట్లకు పెంచారని వెల్లడించారు.

పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో పి.ఆర్.ఎల్.ఐ సి మీద పెట్టిన ఖర్చు 27 వేల కోట్లు మాత్రమే అని స్పష్టం చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మా ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తం 7 వేల కోట్లు అని తెలిపారు. జూరాల వద్దే కొనసాగితే ఇంత వ్యయం ఉండదని, 90 టి.యం.సి ల నీటితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి కట్టుబడి ఉన్నామన్నారు. జలాశయాలలో తెలంగాణ వాటా పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ లో వాదనలు గట్టిగా విపిస్తున్నామన్నారు. కృష్ణా జలాశయాలలో తెలంగాణా ప్రభుత్వం గట్టిపట్టు పడుతుందనడానికి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు కు రాసిన లేఖే నిదర్శనమన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురి అయ్యిందని పేర్కొన్నారు. నది జలాల అంశంపై బి.ఆర్.ఎస్ చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమన్నారు.

ఫలించిన పోలీస్ త్రిముఖ వ్యూహం

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: సూర్యాపేట జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగియడంలో జిల్లా పోలీస్ శాఖ అమలు చేసిన త్రిముఖ వ్యూహం కీలక పాత్ర పోషించింది.

పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చట్టాలు, శిక్షలపై విస్తృత అవగాహన కల్పించారు. బైండోవర్ కేసు కాదని, సత్ప్రవర్తనకు ఇచ్చే హామీ మాత్రమేనని ప్రజలకు వివరించారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవారిపై ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టారు.అలాగే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి మద్దతుదారులకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనల పరిణామాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ ముందస్తు ప్రణాళికలు, నిరంతర ప్రజాసంపర్కంతో పోలీసులు ప్రజల్లో మార్పు తీసుకురావడంతో జిల్లాలో ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించగలిగినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు.

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలో 2026 నూతన సంవత్సర వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్సిడెంట్ ఫ్రీ/ యాక్సిడెంట్ ఫ్రీ గా ప్రశాంతంగా ముగిశాయి. సైబరాబాద్ పోలీసుల ముందస్తు పకడ్బందీ ప్రణాళికలు, నిరంతర నిఘా, క్షేత్రస్థాయి సమన్వయంతో అమలు చేసిన భద్రతా చర్యల ఫలితంగా నూతన సవత్సర వేడుకలు సజావుగా సాగాయి. డిసెంబర్ 31 న్యూ ఇయర్ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ యం. రమేష్, ఐపీఎస్, తన కార్యాలయం నుంచే అత్యున్నత స్థాయిలో నేరుగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులకు ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు. సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్., లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన డీసీపీలు రాత్రంతా క్షేత్రస్థాయిలోనే ఉండి విధులు నిర్వర్తించారు. ట్రాఫిక్ సజావుగా సాగడం, నిబంధనల కట్టుదిట్టమైన అమలు, ప్రజలు సురక్షితంగా వేడుకలు జరుపుకునేలా విస్తృత చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అనుకోని సంఘటనలు జరగకుండా నివారించేందుకు 2025 డిసెంబర్ 31 రాత్రి నుంచి 2026 జనవరి 1 ఉదయం వరకు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై సైబరాబాద్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సైబరాబాద్ పోలీసులు 55 బృందాలతో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 928 మందిని గుర్తించి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేశారు. మద్యం మత్తులో పట్టుబడిన వారిలో 695 ద్విచక్ర వాహనాలు, 31 మంది త్రిచక్ర వాహనాలు, 199 ఫోర్ వీలర్ వాహనాలు, 3 భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. నిందితుల డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకుని, మోటారు వాహనాల చట్టం1988లోని సెక్షన్ 19 ప్రకారం సస్పెన్షన్ నిమిత్తం సంబంధిత ఆర్టీఏలకు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. మియాపూర్, ఆర్సీ పురం, రాయదుర్గం, గచ్చిబౌలి, కుకట్పల్లి, మేడ్చల్, నార్సింగి, రాజేంద్రనగర్, కేపీహెచ్బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల విస్తృత ప్రణాళికలు కారణంగా సైబరాబాద్ పరిధిలో ఎక్కడా పెద్ద రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోలేదని పోలీసులు వెల్లడించారు.

ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా గైబువల్లి నియామకం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ , హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లిని నియమించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ ఢిల్లీలోని ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యాలయంలో గురువారం ఢిల్లీలో ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రి డా. జితేందర్ సింగ్ చేతుల మీదుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్. గైబువల్లి మాట్లాడుతూ గత 25 సంవత్సరములుగా హిందీ భాష ప్రచారం, హిందీ భాషాభివ ృద్ధికి చేస్తున్న క ృషిని గుర్తించి తనకు పదవి బాధ్యతలు అప్పగించిన ఎర్త్ సైన్సెస్ కేంద్రమంత్రి జితేందర్ సింగ్ కేంద్ర ప్రభుత్వ పెద్దలకు, ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఎర్త్ సైన్సెస్ కేంద్ర మంత్రిత్వ శాఖలో హిందీ భాషాభివ ృద్ధికి తన వంతు క ృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి డా.జితేందర్ సింగ్ ఎస్. గైబువల్లిని ఘనంగా సత్కరించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ తరపున కేంద్రమంత్రి డా. జితేందర్ సింగ్ ను ఎస్.గైబువల్లి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి డా.జితేందర్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన హిందీ సలహాకార సమితి మొట్ట మొదటి మీటింగ్ లో ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలో హిందీ భాష వాడుకపై చర్చించారు. అనేక కార్యక్రమాల ద్వార హిందీ భాషను ముందుకు తీసుకెళ్ళాలని నిర?యించడం జరిగినది. ఈ కార్యక్రమములో సెక్రటరీ రవిచంద్రన్, జాయింట్ సెక్రటరీ సెంథిల్ పాండ్యన్, భారతదేశంలోని ఎర్త్ సైన్సెస్ వివిధ హెూదాలలోని అధికారులు, రాజ్ బాషా విభాగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరించాలని సీఎంకు వినతి



విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన టూరిజం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి. ఈ సందర్భంగా టూరిజంలోని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, గతంలో ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా పదవి విరమణ వయసు 61 సంవత్సరాలకు పెంచాలని ముఖ్యమంత్రి దృష్టికి సబ్బు రాజమౌళి తీసుకెళ్లడం జరిగింది. టూరిజం కార్పొరేషన్‌లో ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సబ్బు రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంకలు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌లు హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సిఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు...

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్‌లు హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావుని మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను సిపిఆర్ఓ విభాగం సిబ్బంది పి.ఆర్.ఓ దశరథంతో కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రేవంత్ రెడ్డిని కలిసిన జగదీశ్వర్ గౌడ్

విశాలాంధ్ర-శ శేరిలింగంపల్లి: నూతన సంవత్సరం పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి జగదీశ్వర్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నిరేవంత్ నాయకత్వంలో రాష్ట్రం లో ప్రజా ప్రభుత్వ స్థాపన ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి ముందడుగు పడిందని,మున్ముందు తెలంగాణ రాష్ట్ర సంక్షేమం,అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆకాంక్షించారు జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.

ఏసు చూపిన బాటే మార్గదర్శకం

విశాలాంధ్ర, పటాన్ చెరువు: సమాజంలో ఇతరుల పట్ల ప్రేమ, సహాయం, చూపించడమే క్రీస్తు మార్గమని యేసు క్రీస్తు చూపించిన ఆదర్శమైన బాట ప్రపంచానికి మార్గదర్శకం అని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. గురువారం నూతన సంవత్సరం పురస్కరించుకొని పటాన్ చెరువు నియోజకవర్గంలోని మరనాత హీలింగ్ చర్చ్ లో నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ భాస్కరరావు ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేసి చిన్న పిల్లలకు, భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరంలో ప్రపంచ శాంతి నెలకునాలని, సమాజంలో స్వార్థం కొంతమేర వీడి పేద ప్రజలకు సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాటి పట్టణంలోని మరనాత హీలింగ్ చర్చ్ దినదినాభివృద్ధి చెందుతుందని చర్చి మౌలిక వసతులకు తన వంతు సహాయంగా చర్చి అభివృద్ధికి అండగా నిలబడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి శంకర్, ఎన్టీఆర్ యువసేన నాయకులు మధు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లారీ ఢీకొని 52 గొర్రెలు మృత్యువాత

విశాలాంధ్ర - చిప్పగిరి: కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున గుంతకల్-ఆలూరు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 52 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, 28 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా పామిడి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు రామచంద్ర, చిరంజీవికి 300 గొర్రెలు ఉన్నాయి. వీటిని మేపుకుంటూ కుందనగుర్తి వచ్చారు. గుంతకల్ నుంచి ఆలూరు వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో

కుందనగుర్తి సమీపంలో రోడ్డు పక్క గా నేమకల్లు వెళ్తున్న గొర్రెల మందను వేగంగా ఢీకొంది. దీంతో గొర్రెలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి మృత్యువాత పడ్డాయి. 52 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడగా... గాయపడిన గొర్రెలకు చికిత్స అందిస్తున్నారు. దీంతో గొర్రెలకాపరులు ... తమ జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో లబోదిబోమంటున్నారు. కుటుంబాలను ఎలా పోషించుకోవా లంటూ బావురుమన్నారు. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతినాల్సిన దుస్థితి ఏర్పడిందని

ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, గ్రామ రెవెన్యూ కార్యదర్శి చందు నాయక్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన గొర్రెలను పక్కకు తరలించి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి... లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, గొర్రెలకాపరులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

నూతనోత్తేజంతో పార్టీ ఉద్యమ నిర్మాణం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: 'అలజడి మా ఊపిరి... ఆందోళనే మా ఆయుధం... ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ నిర్మాణానికి పునరంకితమవుదాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దాసరి భవన్‌లోని సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఈశ్వరయ్య పాల్గొన్నారు. సీపీఐ అధ్వర్యంలో నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఈశ్వరయ్య కేక్ కట్ చేశారు. రాష్ట్ర ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026ను పోరాట సంవత్సరంగా ఈశ్వరయ్య ప్రకటించారు. గత సంవత్సరం మిగిల్చిన చేదు జ్ఞాపకాలు పునశ్చరణ చేసుకుంటూ భవిష్యత్తులో మరింత శక్తి, సామర్థ్యాలు ప్రజలకు ఇవ్వాలని సీపీఐ పక్షంగా ఆకాంక్షించారు. నూతన సంవత్సరం అంటే క్యాలెండర్‌లో తేదీ మారడం తప్ప... కొత్తగా సాధించిందేమీ లేదని వ్యాఖ్యానించారు. ప్రజల అణచివేత, ఆకలి, పేదరికం, పీడన, మతోన్మాదరహిత వ్యవస్థ కోసం పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పునరంకితమవుతోందన్నారు. భవిష్యత్తు పోరాటాలు మరింత బలంగా చేపడుతుందని ప్రకటించారు. రాజ్యాంగం, లౌకికవాదం పరిరక్షణ దిశగా ముందుకు సాగుదామని సూచించారు. కమ్యూనిస్టు పార్టీ 101 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నూతనోత్తేజంతో పార్టీ ఉద్యమ నిర్మాణం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పెనుమత్స దుర్గాభవాని, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు, నాయకులు కేవీ భాస్కరరావు, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, కొ్ట్రు రమణారావు, సంగుల పేరయ్య, తూనం వీరయ్య, దోనేపూడి సూరిబాబు, ఎస్‌కే నజీర్, లంకా గోవిందరాజులు, కొడాలి ఆనందరావు, ఓర్సు భారతి, కేఆర్ ఆంజనేయులు, కంచర్ల భార్గవ్, మోహన్, కార్తీక్ పాల్గొన్నారు.

యువత భవితతో రాజకీయ చెలగాటమా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వార్షిక క్యాలెండర్‌లు మారుతున్నా నిరుద్యోగ యువత భవిష్యత్ మాత్రం మారడం లేదని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటైందని పాలకుల తీరును విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినాగానీ నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీలు అమలు చేయలేదని కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి అధికార పార్టీ నేతలకు పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు పంచడంలో నిమగ్నమైందన్నారు. ఉద్యోగాల కోసం లక్షలాది మంది ఎదురు చూస్తుంటే, వారి ఆశలు, ఆశయాలు, భవిష్యత్తుతో రాజకీయ చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగమైనా భర్తీ చేశారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, నిరసనలు, పోరాటాలు మరింత ఉధృతం చేయాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం పోరాటమే శరణ్యమని, ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఇచ్చిన హామీల అమలు చేయని పక్షంలో యువత ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఈశ్వరయ్య హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రైతు సంఘం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, చీకటి సైదారావు, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, సీరం రవి, గాడి అజయ్, కారేపు కార్తీక్‌రవి, బాలల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి లోహిత్, ధృతిశ్రీ పాల్గొన్నారు..

హరిప్రసాద్ బొడ్డుపల్లి దేశానికి గర్వకారణం

గ్రీన్‌విచ్ వర్సిటీ విద్యార్థి నేతపై సీపీఐ నాయకుల ప్రశంస

విశాలాంధ్ర-హైదరాబాద్: లండన్‌లోని గ్రీన్‌విచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు, నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన హరిప్రసాద్ బొడ్డుపల్లి గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్యాలయం మగ్దూంభవన్‌ను సందర్శించారు. పార్టీ నాయకులను కలిశారు. గ్రామీణ నేపథ్యం నుంచి బ్రిటన్ పార్లమెంటులో అడుగుపెట్టే స్థాయికి ఎదిగిన హరిప్రసాద్‌ను నాయకులు అభినందించారు. 'హరిప్రసాద్ నేడు బ్రిటన్ పార్లమెంటుకు హాజరవుతున్నారు. వేర్వేరు దేశాలకు చెందిన 30వేల మందికిపైగా విద్యార్థులకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన తండ్రి బొడ్డుపల్లి శ్రీనయ్యకు పుత్రోత్సాహం కలిగిస్తున్నారు. సమానత్వం, సేవ, నాయకత్వం విలువలను ముందుకు తీసుకెళుతున్నారు' అంటూ నాయకులు ప్రశంసించారు. హరిప్రసాద్ బొడ్డుపల్లి దేశానికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి హరిప్రసాద్ ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు.

వీఐకి రూ.638 కోట్ల జీఎస్టీ జరిమానా

న్యూఢిల్లీ: టెలికాం సంస్థ వోడాఫోన్ ఐడియా (వీఐ)కు రూ.638 కోట్ల జీఎస్టీ జరిమానా కట్టాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుజరాత్, అహ్మదాబాద్‌లోని కేంద్ర వస్తు, సేవల పన్ను అదనపు కమిషనర్ కార్యాలయం గురువారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. అయితే దీనిపై కోర్టుకు వెళతామని వీఐ తెలిపింది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి (ఏజీఆర్) బకాయిల విషయంలో వీఐకు ఊరట లభించిన మరుసటి రోజు తాజా పరిణామం చోటుచేసుకున్నది. దీనిపై వీఐ స్పందించింది. 'కేంద్ర జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 74 కింద ఉత్తర్వులు వచ్చాయి. డిమాండు, వడ్డీతో కలిపి రూ.6,37,90,68,254 కట్టాలని ఆదేశాల్లో ఉన్నది. దీనిని అహ్మదాబాద్‌లోని సీజీఎస్టీ అదనపు కమిషనర్ కార్యాలయం పంపింది. తక్కువ పని చెల్లించినట్లు ఆరోపించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అధికంగా పొందినట్లు వెల్లడించారు. అత్యధిక ఆర్థిక ప్రభావం విధించిన పన్ను డిమాండ్, వడ్డీ, జరిమానా మేరకే ఉంటుందని వెల్లడించింది. ఈ ఉత్తర్వులపై చట్టపరమైన అవకాశాలను అన్వేషిస్తామని వోడాఫోన్ ఐడియా ప్రకటన పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో ఆగని అరాచకాలు

హిందువులపై వరుస దాడులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులపై అరాచకాలు కొనసాగు తున్నాయి. కొంతమంది మతోన్మాదులు హిందువులపై దాడులు చేసి చంపేస్తున్నారు. నెలలో నలుగురు హిందువులపై దాడులు జరగటం ఇక్కడి హిందువులను తీవ్రంగా భయపెడుతోంది. డిసెంబర్ 16వ తేదీన ఓ బట్టల ఫ్యాక్టరీలో పని చేస్తున్న దీపు చంద్రదాస్ అనే యువకుడు మతోన్మాదుల దాడికి గురయ్యాడు. అతడితో పాటు పని చేస్తున్న వారే ఈ దారుణానికి ఒడిగట్టారు. కొట్టి చంపేసి, చెట్టుకు వేలాడదీసి కాల్చేశారు. దైవ దూషణకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఈ ఘోరం చేశారు. ఈ ఘటన జరిగిన వారం రోజులకే రాజ్‌భరీలోని హోసయ్‌దంగ గ్రామానికి చెందిన 29 ఏళ్ల అమ్రిత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే యువకుడిని మతోన్మాదులు దారుణంగా కొట్టి చంపేశారు. దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఈ ఘోరానికి ఒడిగట్టారు. 29వ తేదీన సైల్‌హెట్ సదర్ కాదిర్‌పురకు చెందిన భజేంద్ర బిశ్వాస్ అనే 40 ఏళ్ల వ్యక్తి తనతో పాటు పని చేసే యువకుడి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ యువకుడు భజేంద్రను తుపాకితో కాల్చి చంపేశాడు. పొరపాటున తుపాకీ పేలటంతో ఈ దారుణం జరిగిందని పోలీసులకు చెప్పాడు. ఈ మూడు ఘటనల నుంచి తేరుకోక ముందే మరో దారుణం జరిగింది. డిసెంబర్ 31వ తేదీన ఖోకన్ దాస్ అనే హిందూ వ్యక్తి మతోన్మాదుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఆస్పత్రి బెడ్‌పై ప్రాణాలతో పోరాడుతున్నాడు. షరియాత్పూర్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. నిన్న రాత్రి ఖోకన్ దాస్ ఇంటికి వెళుతుండగా ఓ గ్యాంగ్ అతడిపై కత్తులతో దాడి చేసింది. విచక్షణా రహితంగా పొడిచింది. తర్వాత అతడిపై గ్యాంగ్ సభ్యులు కిరోసిన్ పోసి నిప్పంటించారు. అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు అతడిని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

'ఆర్థిక' వాస్తవికత ఏమిటి?

కేంద్రానికి డి.రాజా ప్రశ్న



న్యూఢిల్లీ: ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రకటించుకోవడంలో నిజమెంత అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. పేదలు నిరుపేదలు అవుతున్నారు... సామాన్యులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు... అసలు ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితి ఏమిటి అంటూ ఓ మీడియా సంస్థతో మాట్లాడిన రాజా ఆందోళన వ్యక్తంచేశారు. జపాన్‌ను అధిగమించినట్లు ప్రభుత్వం గొప్పలు పోతోంది కానీ దేశంలో జరుగుతున్నదేమిటి? భారతీయ రూపాయి మారక విలువెంత? అది కనిష్ఠ స్థాయికి ఎందుకు పడిపోయింది? నిరుద్యోగిత రేటు ఏమిటి? ద్రవ్యోల్బణం పరిస్థితేమిటి?' అంటూ డి.రాజా ప్రశ్నించారు. ధరలు దిగిరావడం లేదని, పేదరికం కొనసాగుతోందని, దారిద్ర్య రేఖ దిగువన అనేక మంది బతుకుతున్నారని ఆయనన్నారు. పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్న వాస్తవ పరిస్థితులను సర్కారు పరిగణనలోకి తీసుకొని.. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించాలని ప్రభుత్వానికి సూచించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఉభయ తెలుగు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెందాలని వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల వెంకన్నను గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు. ఉభయ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెంది ... సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా బాగా వృద్ధి చెందాలని తెలిపారు.

ఖర్సావాన్ అమరవీరుల గుర్తింపు కోసం కమిటీ

గిరిజన యోధులకు హేమంత్ సోరెన్ నివాళి

రాంచీ: ఖర్సావాన్ అమరవీరుల కుటుంబాలను గుర్తించేందుకు కమిటీని నియమించనున్నట్లు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పారు. ఖర్సావాన్ నరమేధంలో ప్రాణాలు అర్పించిన గిరిజనులకు సెరైకెలాలోని సాహిద్ స్థల్‌లో గురువారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోరెన్ మాట్లాడుతూ గువా పోలీస్ కాల్పుల ఘటనలో మరణించిన అమరవీరుల వలె తగిన గౌరవం కల్పించేలా ఖర్సావాన్ గిరిజన అమరవీరుల కుటుంబాలను, వారితో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు త్వరలో ఒక కమిటీని నియమించనున్నామని అన్నారు. జల్, జమీన్, జంగిల్‌తో పాటు గిరిజన కమ్యూనిటీ, వారి హక్కుల కోసం, ఆదివాసీ యోధులు తమ ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. గిరిజనుల ప్రయోజనాల కోసం అత్యున్నత త్యాగం చేసిన గిరిజన వీరులకు నివాళులు అర్పించేందుకు కొల్హాన్ ప్రాంతం నుండి మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సాహిద్ స్థల్‌కి చేరుకుంటారని అన్నారు. గిరిజన అమరవీరులను మరిచిపోలేరని, వారి జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోవని, వారి త్యాగం వల్లే గిరిజనులు నేడు సంతోషంతో జీవిస్తున్నారని అన్నారు. సాహిద్ స్థల్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలో ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. 1948 జనవరి 1న సెరైకెలా-ఖర్సావాన్ జిల్లా (అప్పటి విభజించని బీహార్‌లో భాగం) ఒడిశాలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ తమ నీరు, అడవి, భూమి (జల్, జమీన్, జంగిల్) రక్షించడానికి ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన వందలాది మంది గిరిజనులపై పోలీసులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.

మా ప్రాజెక్టులు చరిత్రలో నిలుస్తాయి: శివకుమార్

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులో వరుసగా ప్రధాన మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు నగర భవిష్యత్ రూపాన్ని గణనీయంగా మారుస్తాయని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న రోడ్డు, సొరంగం, పై వంతెన, టౌన్‌షిప్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. శివకుమార్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరులో ట్రాఫిక్ సవాళ్లను అధిగమించడం కోసం విస్తృత విజన్‌తో ముందుకెళ్లబోతున్నట్లు తెలిపారు. బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ) పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వివిధ ప్రాజెక్టులకు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. బెంగళూరు బిజినెస్ కారిడార్‌గా వ్యవహరించే 120 కిమీల రింగ్ రోడ్డును ఇప్పటికే నోటిఫై చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, డబ్బు నిర్ణయించామని డీకే శివకుమార్ వెల్లడించారు. చిన్న పట్టణాల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్కడ భూముల్లో 35 శాతం కమర్షియల్ అవుతాయని, వాటికి అంచనా మించిన ధర కల్పిస్తామన్నారు. అలాగే, 1.5 కిమీల కట్ అండ్ కవర్ సొరంగాన్ని బీడీఏ నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. కర్నాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ), నందీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐసీఈ) సంబంధిత భూ సమస్యలను ప్రస్తావిస్తూ కేసుల్లో ఉన్న భూములకు ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం అన్వేషిస్తుందని డీకే శివకుమార్ అన్నారు. తమ స్థాయి ప్రభుత్వం కంటే గొప్పదని ఎన్ఐసీఈ వర్గాలు భావిస్తున్నారని, వారికి ఎలా బుద్ధి చెప్పాలో నాకు తెలుసని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. 'ఎన్ఐసీఈ నుంచి ఎన్ఓసీ ఇంకా అందలేదన్నారు. బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ ఈ ఏడాది 50 ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని, స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి గుడ్డె' (సజీవ సాక్షి)ను అనేక ప్రాంతాల్లో చైర్మన్ ఏర్పాటు చేయబోతున్నట్లు డీకే శివకుమార్ తెలిపారు.

ఫుల్లుగా తాగేశారు!

- ఒక్కరోజే రూ.172కోట్ల మద్యం విక్రయాలు
- డిసెంబర్‌లోనే రూ.2,767కోట్ల అమ్మకాలు
- 2024తో పోలిస్తే 8శాతం పెరుగుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎక్సైజ్ శాఖ పంట పండింది. వరుస పండుగలు, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆబ్కారీ ఖజానాపై కనకవర్షం కురిసింది. డిసెంబర్‌లో ముక్కోటి ఏకాదశి, క్రిస్మస్, 2025 ముగింపు, నూతన సంవత్సరానికి ఆహ్వానం వంటి వేడుకలను పురస్కరించుకుని మందుబాబులు ఫుల్లుగా తాగేశారు. అధికారిక గణాంకాల ప్రకారం డిసెంబర్ 1 నుంచి 31 వరకు మొత్తం మద్యం అమ్మకాలు సుమారు రూ. 2,767 కోట్లు గా నమోదయ్యాయి. 2024 డిసెంబర్‌లో ఇవి రూ. 2,568 కోట్లు ఉండగా, ఈసారి సుమారు 8 శాతం వృద్ధి నమోదైంది. ప్రత్యేకంగా డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో అమ్మకాలు భారీగా జరిగాయి. కేవలం ఈ మూడు రోజుల్లోనే సుమారు రూ. 543 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. వీటిలో కూడా కేవలం 31వ తేదీ ఒక్కరోజే రూ.172కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగడం విశేషం. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వైన్ షాపులకు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లకు రాత్రి 1 గంట వరకు ప్రత్యేక అనుమతులిచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న మందుబాబులు మద్యంలో మునిగి తేలారు. వైన్ షాపులు, బార్లు మందుబాబులతో కిటకిటలాడాయి. డిసెంబర్ 31వ తేదీ ఒక్కరోజే 2,20,719 కేసుల మద్యం, 95,026 కేసుల బీర్లు విక్రయాలు జరిగాయి. ఇది కూడా అంతకుముందు సంవత్సరం రికార్డును అధిగమించడం గమనార్హం. 2024లో డిసెంబరు చివరి మూడు రోజుల అమ్మకాలు రూ. 336 కోట్లు ఉండగా, 2025లో రూ.543కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అలాగే 2024 డిసెంబరు 31వ తేదీ కంటే ఈసారి 60కోట్ల అదనపు అమ్మకాలు సాగాయి. ఇక జిల్లాల వారీగా చూస్తే విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా మద్యం విక్రయాలు సాగి, సుమారు రూ. 178.6 కోట్లు అమ్మకాలతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత తిరుపతి జిల్లా సుమారు రూ. 169.4 కోట్లుతో ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా సుమారు రూ. 155.4 కోట్లు అమ్మకాలతో తృతీయ స్థానాల్లో నిలిచాయి. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లా సుమారు రూ. 30.7 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లా సుమారు రూ. 35.4 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా సుమారు రూ. 65 కోట్లు అమ్మకాలతో చివరి స్థానాల్లో నిలిచాయి. జనవరి 1వ తేదీ కూడా వైన్ షాపులకు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లకు రాత్రి 1 గంట వరకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. దీంతో గురువారం అమ్మకాలు కూడా భారీస్థాయిలోనే కొనసాగుతున్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత ఏడాది జనవరి 1వ తేదీతో పోలిస్తే ఈ సంవత్సరం మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగినట్లు చెపుతున్నారు.

సీఎస్ దంపతులకు టీటీడీ వేద పండితుల ఆశీర్వచనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సీఎస్ కె.విజయానంద్ దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వేద పండితులు ఆశీర్వచనం అందించారు. టీటీడీ వేద పండితులు గురువారం సీఎస్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ క్యాలెండర్, డైరీతో పాటు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అఖిల భారత సేవల ఉన్నతాధికారులు, వివిధ శాఖాధిపతులు, సచివాలయం, ఇతర విభాగాల అధికారులు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, జె.శ్యామల రావు, జయలక్ష్మి తదితర ముఖ్య కార్యదర్శులు, కలక్టర్లు, జెసిలు, వివిధ శాఖాధిపతులు ప్రతినిధులు ఉన్నారు. అలానే అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కావలికి చెందిన శ్రీశైవ క్షేత్ర శివశక్తి పీఠం ట్రస్ట్ మురళీమోహన స్వామీజీలు సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క బహుకరించి... శాలువాతో సత్కరించారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, విజయవాడలోని అగ్నిమాపక శాఖ డీజీ పి వెంకట రమణను కలిశారు. వారిని సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - సచివాలయం: ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా జి.రామకృష్ణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా నాపా ప్రసాద్ సహా కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత మూడో బ్లాక్‌లో ఉన్న ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగులు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు సహకారంతో ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అప్ప అధ్యక్షుడు రామకృష్ణ హామీ ఇచ్చారు

బాబు విదేశీ పర్యటనలపై గోప్యత ఎందుకు?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన విదేశీ పర్యటన వివరాలు గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోందని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో ముఖ్యమంత్రులు తమ పర్యటనల వివరాలను ప్రజలకు ముందే చెప్పేవారన్నారు. చంద్రబాబు ఎక్కడికి, ఎందుకు వెళుతున్నారన్నది చెప్పకపోవడం పారదర్శకతకు విరుద్ధమన్నారు. చంద్రబాబు సింగపూర్ వెళ్లారా.. లండన్ వెళ్లారా అని ప్రశ్నించారు. తన జీవితం తెరిచిన పుస్తకమనే చంద్రబాబు విదేశీ పర్యటన విషయాలను గోప్యంగా ఎందుకు ఉంచారని సుధాకర్ బాబు ప్రశ్నించారు. జీఏడీ వద్ద సీఎం పర్యటన వివరాలు లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణిస్తున్నారని, వాటి ఖర్చులు ఎవరు భరిస్తున్నారని సుధాకర్ బాబు ప్రశ్నించారు. సొంత ఖర్చులంటూ చెప్పుకునే వారి జీతాలకు... ఈ స్థాయి ఖర్చులకు పొంతన ఉందా అని ప్రశ్నించారు. డీజీపీఏ నిబంధనల ప్రకారం బిల్లులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

అన్ని మతాల వారు సామరస్యంగా జీవిచడమే నిజమైన అభివృద్ధి: బీపీ నాయక్

విశాలాంధ్ర,బోనకల్:నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా క్రైస్తవ సోదరా సోదరీమణుల ఏర్పాటు చేసిన పలు ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యువ నాయకులు బీపీ నాయక్ క్రైస్తవ బంధువులు, మహిళలు, చిన్నారులు పలికిన అపూర్వ స్వాగతానికి ఆయన మంత్రముగ్ధులు ఐయ్యానని అన్నారు. ఈ పర్వదినాన అందరితో ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియమైన క్రైస్తవ సోదర సోదరీమణులారా, ముందుగా, ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మీ అందరికీ హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. క్రీస్తు ప్రభువు జననోత్సవం తర్వాత వచ్చే ఈ కొత్త సంవత్సరం, మీ అందరి జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త ఆనందాలు, కొత్త విజయాలు తీసుకొచ్చేలా ప్రార్థిస్తున్నాను.మీరు ఏర్పాటు చేసిన ఈ ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉంది. క్రైస్తవ సమాజం ఎల్ల వేళలా ప్రేమ, శాంతి, సేవా గుణాలతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రభువైన యేసుక్రీస్తు బోధలు ప్రేమించు, క్షమించు, సహాయం చేయు ఈ రోజుల్లో మరింత అవసరం.లి మన లిరాష్ట్రంలో అన్ని మతాల వారు సామరస్యంగా జీవిస్తూ, ఒకరినొకరు గౌరవిస్తూ ముందుకు సాగాలి.లి అదే నిజమైన అభివృద్ధి, నిజమైన శాంతి. ఈ 2026 సంవత్సరం మీ కుటుంబాలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతోషం కలిగించాలి. మీ చర్చిలు, సంఘాలు మరింత బలోపేతమై, సమాజ సేవలో ముందుంజలో ఉండాలి. యువత ఉత్సాహంతో, పెద్దల ఆశీర్వాదంతో మన రాష్ట్రం మరింత ఎదగాలి. మరోసారి, మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు! దేవుడు మీ అందరినీ ఆశీర్వదించుగాక అని తన మనసులోని మాటలు పంచుకొని వారందరితో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు,పెద్దలు,ఆడపడుచులు,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కోదాడ-విశాలాంధ్ర : కోదాడ పట్టణంలోని ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.గురువారం హుజుర్నగర్ రోడ్ లో సభ్యులందరూ కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వృత్తిపరమైన ఒత్తిడిని పక్కన పెట్టి, సభ్యులందరి మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్మ, స్వామి, సురేష్, శ్రీను, లక్ష్మణ్,వనం ప్రభాకర్, వీరన్న, అల్లిక శ్రీను, విష్ణు హరీష్, ల్యాబ్ వాసు, సైదాచారి,ఆల్బమ్ సైదా, స్వాతి నాని,శ్రావణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర -ఖమ్మం : నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. రెవెన్యూ సంఘం, ఇతర అధికారుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలి టి.ఎన్.జి.ఓ., టి.జి.ఓ., తహసిల్దార్ సంఘం, పంచాయతీ కార్యదర్శుల సంఘాలకు చెందిన సంఘాల క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చిన వివిధ వర్గాలకు చెందిన అధికారులు, సిబ్బంది నుంచి కలెక్టర్ కేవలం నోట్ బుక్స్, పెన్స్, చదువుకునే పిల్లలకు అవసరమయ్యే స్టేషనరీ వస్తువులు మాత్రమే తీసుకున్నారు. ఖమ్మం బాల సదనంకు చెందిన పిల్లలు, ఎస్సి, బీసీ, మైనారిటీ గురుకులాల పిల్లలు జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలు సొంతంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డులను కలెక్టర్ పరిశీలించి వారిని అభినందించారు. అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ, చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ, బ్రహ్మకుమారీలు, జూబ్లీ క్లబ్ కమిటీ, రైస్ మిల్స్ అసోసియేషన్, పోలీస్ శాఖ, ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలెక్టర్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగా లని, నూతనంగా ఎంపికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఆధ్వర్యంలో గ్రామ పాల న బాగుండాలని, నూతన సంవత్సరంలో ఖమ్మం నగర వ్యాప్తంగా రోడ్డు పనులు, వివిధ అభివృద్ధి పనులు పూర్తి కావాలని, అభివృద్ధిలో దూసుకు పోవాలని అన్నారు. నూతన సంవత్సరంలో జిల్లా సర్వతోముఖాభివృద్ధితో ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ ఆకాంక్షించారు.

చిన్నారులను ఆశీర్వదించిన సర్పంచ్ వీర ప్రతాప్

విశాలాంధ్ర -కారేపల్లి : మండల కేంద్రమైన సింగరేణి గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వర్లు-స్వరూప దంపతుల కుమార్తెలు వాసవి, శ్యామలిల ఓణీల వేడుకలు స్థానిక సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో తురక సాంబ, పాలిక రమేష్,పెద్దమ్మ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నూతన సంవత్సరం 2026 సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా పౌర సంబంధాల అధికారి మాదంశెట్టి కృష్ణమూర్తి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, వివిధ విభాగాల అధికారులు జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. అధికారులకు, సిబ్బందికి నూతన శుభాకాంక్షలు తెలిపారు.

ద్వేష రాజకీయాలకు చెక్..

రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఖమ్మంలో ప్రజా ర్యాలీ

విశాలాంధ్ర- ఖమ్మం రూరల్ : భాష, మతం, కులం, ప్రాంతం, లింగం పేరుతో సమాజంలో పెరుగుతున్న ద్వేష ప్రసంగాలు, ద్వేష నేరాలు దేశ ఐక్యతకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ముప్పుగా మారుతున్నాయని రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ పేర్కొన్నారు. ద్వేషానికి అడ్డుకట్ట వేయడం దేశ హితం కోసమేనని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. హేట్ స్పీచ్ & హేట్ క్రైమ్స్ నివారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకురావాలన్న నిర?యాన్ని స్వాగతిస్తూ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో శాంతియుత ప్రజా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, యువత, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

భావప్రకటన స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం ఈ అంశంపై తీసుకుంటున్న ముందడుగు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దేశం బాగు కోసం మీరు ఆలోచిస్తే, దేశ ప్రజలు మీకోసం ఆలోచిస్తారు" అని అన్నారు. ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీ పోలీసు శాఖ సమన్వయంతో ఎక్కడా ఉద్రిక్తతలకు తావు లేకుండా శాంతియుతంగా కొనసాగింది. "వి ద్వేషానికి చోటు లేదు, రాజ్యాంగమే మా దారి", "విభజన కాదు, సమైక్యత కావాలి" వంటి నినాదాలు ప్రజల్లో చైతన్యం నింపాయి. ఈ ర్యాలీకి జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, పౌరహక్కుల కార్యకర్తలు మద్దతు తెలిపారు. హేట్ స్పీచ్‌పై చట్టం అవసరమే అయినప్పటికీ, మీడియా స్వేచ్ఛకు భంగం కలగకుండా, నిజమైన ప్రజాహిత విమర్శలను కట్టడి చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలతో చట్టం అమలవ్వాలని వారు సూచించారు. అలాగే, హేట్ స్పీచ్ & హేట్ క్రైమ్స్ నివారణ దిశగా ముందడుగు వేసిన సిద్ధరామయ్య నేత ృత్వంలోని కరా?టక ప్రభుత్వ చర్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయని వక్తలు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించి ప్రభుత్వ ఉత్తర్వు తీసుకురావడం అభినందనీయమన్నారు.ర్యాలి మొత్తం "షక్రియా షక్రియా" నినాదాలతో మార్మోగింది. రాజ్యాంగ పరిరక్షణకు, దేశ హితం కోసం తీసుకునే బాధ్యతాయుత నిరయాల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఈ నినాదాలు ప్రతిబింబించాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమైక్యతే లక్ష్యంగా, రాజ్యాంగమే దారిగా సాగిన ఈ శాంతియుత ప్రజా ర్యాలీ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గం బాధ్యులు నజురుద్దీన్ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు సైదా కూసుమంచి మండల అధ్యక్షులు ఖలీమ్ కొండపల్లి అధ్యక్షులు సుభాని ఖమ్మం రూరల్ అధ్యక్షులు గౌస్ పాషా.. మత పెద్ద ఇమామ్ .అబ్దుల్ ఘని రాజ్యాంగ పరిరక్షణ వేదిక గౌరవ సలహాదారులు సయ్యద్ ఇస్మాయిల్ పెంటూ సాహెబ్. ఇబ్రహీం. అబ్దుల్ ఘని. హుస్సేన్. తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ముగిసిన కుష్టు వ్యాధి సర్వే

1708 మందిని అనుమానితులుగా గుర్తింపు : డి ఎం హెచ్ ఓ తుకారామ్ రాథోడ్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే ముగిసిందని జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ అన్నారు. ఏ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గుర్తింపు సర్వే పూర్తయినట్లు తెలిపారు. గత నెల 18 నుంచి 31 వరకు జరిగిన ఇంటి ఇంటి సర్వే కార్యక్రమంలో 1436 టీమ్లు పాల్గొన్నట్లు తెలిపారు. 247693 ఇండ్లను సందర్శించి 8,89,635 మంది వ్యక్తులను ప్రతి ఇంటికెళ్ళి క్షుణ?ంగా పరిశీలించామన్నారు. 1708 మంది కుష' అనుమానితులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. వీరిని ఈ నెల నుండి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యులు, ఉప కేంద్రాలలో డీపీఎంఓలు నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు వచ్చిన అనుమానిత కేసులలో నలుగురిని కుష్టు వ్యాధిగ్రస్తులు గా నిర్ధారించి ముందులు ఇవ్వడం జరిగిందన్నారు. సమాజంలో ఎవరికైనా శరీరంపై రాగి వర?ంలో లేదా పాలిపోయిన మచ్చలు ఉండి తిమ్మిరిగా ఉండి గిచ్చినా నొప్పి లేవకుండా మచ్చలుంటే వారు తక్షణమే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. అది కుష్టు వ్యాధియా కాదా అని నిర్ధారించుకోవాలని సూచించారు.

వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించి మందులు వాడినట్లయితే పూర్తిగా నివారించవచ్చ న్నారు. అంగవైకల్యాలకు దారి తీయకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. సమాజంలో ఇంకాకుష్టు వ్యాధిపై అనుమానాలు, అపోహలు ఉన్నాయన్నారు. వ్యాధి సోకిన వారు ఇంకా గోప్యంగా ఉండి సమాజంలో వ్యాధిని వ్యాపింప చేస్తున్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. బి.పుల్లా రెడ్డి, ఫిజియోథెరపిస్టు జి. భద్రు మోహన్ డి.పి.యం ఓ లు పాల్గొన్నారు.

టీజీ టెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

విశాలాంధ్ర -ఖమ్మం : జనవరి 3 నుండి జనవరి 20 వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని పరీక్ష కేంద్రాలలో నిర్వహించే టీజీ టెట్ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7:30 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కలకోట గ్రామ సమీపంలో మిషన్ భగీరథ

పైపులు పగిలి నీళ్లు వృధాగా పోతున్న పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర,బోనకల్ :మండలం కలకోట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లవాగు ప్రక్కన ఉన్నటువంటి మిషన్ భగీరథ పైపులు లీకై గత కొన్ని రోజులుగా ఆ లైన్ ద్వారా వెళ్లే గ్రామాలకు నీటి సరఫరా సరిగా లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే దీనిపై ఆర్. డబ్ల్యు. ఎస్ డి ఈ స్పందించి పైపులు మరమ్మతులు చేసి ప్రజలకు నీళ్లు సరఫరా వెంటనే ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం కలిసి శుభాకాంక్షలు తెలిపిన డిసిసి అధ్యక్షులు

విశాలాంధ్ర -ఖమ్మం ఫ నూతన సంవత్సరమును పురస్కరిం చుకొని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గారు.

ఆరోగ్యం బాగుకోసం నడక శ్రేయస్కరం

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్

విశాలాంధ్ర- మంథని: ప్రస్తుతం మానవ జీవన శైలిలో వస్తున్న మార్పు, తగ్గుతున్న శారీరక శ్రమ, ఆహార అలవాట్లు అనేక రుగ్మతలకు దారి తీస్తోంది. ఉరుకులు, పరుగులమయంగా మారుతున్న పరిస్థితుల్లో లేనిపోని జబ్బులు తెచ్చుకుంటున్నారు. దీనికి చెక్ పెట్టాలంటే నిత్యం ఉదయం, సాయంత్రం పూట ఒక గంటపాటు నడక సాగించాల్సిం దేనని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. గురువారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో ఆరోగ్యం పట్ల మరింత చైతన్యం పెరిగింది. నడక, యోగా, వ్యాయామంపై అత్యధికులు ఆసక్తి చూపుతున్నారు. ప్రజలు పలువురు ఒక బృందంగా ఏర్పడి నూతన సంవత్సరంలో నడక ప్రారంభించాలన్నారు. ఇలా క్రమం తప్పకుండా రోజూ నడిస్తే మధు మేహం వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు. అలాగే మధుమేహ ఉన్నా సరే గ్లూకోజు అదుపులో ఉంటుందని, అధిక రక్తపోటు, గుండె, క్యాన్సర్ సమస్యలు తదితర ముప్పును తగ్గిస్తుందని, శరీర బరువును నియంత్రిస్తుందని, మానసిక ఒత్తిడి, నిద్రలేమిని అధిగమించవచ్చునని. జీవక్రియలను మెరుగుపర్చుతుందని, మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరగడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని డాక్టర్ తెలిపారు. నడక వయసు పైబడిన వారికి మరింత ముఖ్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశార. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి రమేష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, వాకర్స్ అసోసియేషన్ నాయకులు కర్రు శ్రీనివాస్, బండి శ్రీనివాస్, అంకరి ప్రకాష్, ఇసంపెల్లి కొమురయ్య, తాటి సమ్మయ్య గౌడ్, వీర శంకర్ గౌడ్, రాంసింగ్, రవి గౌడ్, కరుణ కృష?, నల్ల సతీష్, ఆకుల రాజబాబు, బత్తుల శ్రీనివాస్, ఐలి రవి, బొద్దుల సమ్మయ్య లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర -ఖమ్మం క్రైమ్ : భవిష్యత్తులో ఎదురైయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున పోలీస్ సిబ్బందికి, హెూంగార్డ్, ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం చేసిన సమిష్టి కృషి ఫలితమే నేడు సంతోషకరమైన వాతావరణంలో వేడుకలు జరుపుకుంటానమని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జిల్లా పోలీసు యంత్రాంగం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్ రావు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఏసీపీలు, అర్ఐలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ కమిషనర్ కార్యాలయ మినిస్ట్రీయల్ స్టాఫ్, పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జియం

విశాలాంధ్ర- మంథని: గురువారం నూతన సంవత్సరం సందర్భంగా జీఎం కార్యాలయం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు కేక్ ను కట్ చేసి జీఎం కార్యాలయ అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి బి.టి.మురళి కృష్ణ ఏరియా ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, యాదయ్య, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, విభాగాధిపతులు రాజా రెడ్డి, బి.వి.సత్య నారాయణ, రాజేంద్ర కుమార్, శంకర్, సుదర్శనం, సురేఖ, రాజేశ్వరి, శ్యామల, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి అజయ్ కుమార్

విశాలాంధ్ర -ఖమ్మం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అదేవిధంగా రాజ్యసభ సభ్యులు ముదిరాజు రవిచంద్ర కూడా,మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో ఆప్యాయంగా మాట్లాడారు.

సేవతో ప్రారంభమైన కొత్త ఏడాది

ఖమ్మంలో 100 మంది పేద వైశ్య మహిళలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర -ఖమ్మం : నూతన సంవత్సరాన్ని సేవా కార్యక్రమాలతో స్వాగతిస్తూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో 100 మంది పేద వైశ్య మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మిట్టపల్లి రవి మాట్లాడుతూ సభ్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా మహిళలకు చీరల పంపిణీ చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు దాతలు ఉదారంగా సహకరించారు. చిరు వ్యాపార సంఘం తరఫున 30 చీరలు, శ్రీనివాస స్టీల్ షాప్ వారు 11 చీరలు, కనికిచర్ల కోటేశ్వరి 10 చీరలు, దేవత్ కుసుమ 10 చీరలు, నాగమణి టీచర్ 5 చీరలు, ఆత్మకూరి వెంకటేశ్వరరావు 20 చీరలు, వేముల రామ్మోహన్ రావు 10 చీరలు, వేముల వెంకటేశ్వరరావు గారు 10 చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ శివాలయం ప్రధాన కార్యదర్శి కొదుమూరి భద్రయ్య, సంఘ కార్యవర్గ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అధ్యక్షులు మిట్టపల్లి రవి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కృషి పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలు సాధ్యం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు : కేజీబీవీ ఎస్ఓ ఝాన్సీ సౌజన్య

విశాలాంధ్ర -కారేపల్లి : ప్రతి విద్యార్థి కృషి పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని కస్తూరిబా గాంధీ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రత్యేక అధికారి జి ఝాన్సీ సౌజన్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో రాణించి సామాజిక అవగాహన కలిగి ఉండాలన్నారు.నూతన సంవత్సర వేడుకలలో విద్యార్థులు ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత,షహన్ సుల్తానా, ఝాన్సీ, విజయ, మమత, అన్నపూర్ణ విజయలక్ష్మి,స్వాతి,రమ, శ్రీలత, వసంత, కృష్ణ వేణి, సమీనా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రి పొంగులేటి ప్రజా పాలన

క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు :తుంబూరు దయాకర్ రెడ్డి

విశాలాంధ్ర -ఖమ్మం : ప్రజా పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందుతున్న సంక్షేమ పథకాల ఫలాలు నూతన సంవత్సరంలో కూడా ప్రతి అర్హుడికి చేరాలని దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా పాలనలో రెండేళ్ల కాలంలోనే "మంత్రి పొంగులేటి మార్క్" స్పష్టంగా కనిపిస్తోందని, సొంత నియోజకవర్గం పాలేరుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ సంక్షేమ పథకాల అమలులో ఆయన ప్రత్యేక ముద్ర వేశారని కాంగ్రెస్ నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు

విశాలాంధ్ర - మణుగూరు : నూతన సంవత్సరం సందర్భంగా గురువారం మణుగూరులోని రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందరరేగా అధ్యక్షురాలు పూనెం సరోజ కేక్ ను కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం సభ్యులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకురాలు ఎం డి షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత,దాకూరి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్.జి.ఎఫ్ ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడమే పరమావదిగా ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఎస్ జీ ఎఫ్) లక్ష్యమని బాధ్యులు వెల్లడించారు. జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎస్. జీ. ఎఫ్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పంచల నాగభూషణం, నాగమణి దంపతుల కుమారుడు కరుణ్ కుమార్ పుట్టినరోజు సందరరేగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్, ఆర్ టీసి బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సెంటర్ లలో దిక్కుమొక్కు లేని వారికి, బిచ్చగాళ్ల కు అన్నదానం చేసారు. ఎస్. జి.ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ సారధ్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ జీ ఎఫ్ ఉమెన్స్ గిల్డ్ ప్రతినిధులు లోగాని జ్యోతిరాణి, చుంచు అంజలి, ఎస్ జీ ఎఫ్ సభ్యుడు సిహెచ్. శ్రీనివాసరావు, దాతలు పంచల నాగభూషణం, నాగమణి, అమృత రావు, పాల్, కవిత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ళపాడు నర్సరీకి పూర్వ వైభవం తేవాలి : జిల్లా కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రామవరం పట్టణ సమీపంలోని గరిమెళ్ళపాడు నర్సరీకి మళ్లీ పూర్వ వైభవం తేవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి నర్సరీ ఒకప్పుడు కళకళలాడేది. కొన్ని కారణాలు, అధికారుల నిర్లక్ష్య ధోరణికి ఈ నర్సరీ మసకబారిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ గరిమెళ్ళపాడు (హెచ్ఎన్ టిసి) నర్సరీని సందర్శించారు. సుమారు 72 ఎకరాల్లో విస్తరించి ఉన్న నర్సరిలో కలెక్టర్ కలియతిరిగారు. నర్సరీ దృశ్యాలను కలర్ చూసి కలత చెందారు. ఆ ప్రాంతమంతా చాలా వరకు అందవిహీనంగా మారిపోయింది. గతంలో ఉన్న పాత భవనాలను ఒక్కొక్కటిగా నిశితంగా కలెక్టర్ పరిశీలించారు.

అలాగే ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కలు, గతంలో ఉన్న మొక్కలు, వివిధ విభాగాలు తదితర ప్రతి ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి, హార్టికల్చర్ సిబ్బంది రాజారామ్ నుండి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గతంలో నర్సరీ ఏ విధంగా ఉండేదో, ప్రస్తుతం పరిస్థితికి కారణాలపై సమీక్షించారు. మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అవసరమైన చర్యలపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒకప్పటిలాగె మళ్లీ తీర్చిదిద్దేలా చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో చర్చించి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కలెక్టర్ చొరవతో నర్సరీకి మంచి రోజులు రాబోతున్నాయని అక్కడి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి ఆశ్రమంలో ఫాస్టర్ డా. సుబ్బలక్ష్మికి ఆత్మీయ సన్మానం

విశాలాంధ్ర కొత్తగూడెం అర్బన్ : సర్వజ్ఞాని ప్రార్థన మందిరం నిర్వాహకురాలు ఫాస్టర్ డాక్టర్ కె. సుబ్బలక్ష్మి ని ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు. నూతన సంవత్సరం వేడుకలలో భాగంగా గొల్లగూడెంలోని సర్వజ్ఞాని ప్రార్ధనా మందిరంలో గురువారం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు సుగుణారావు మాట్లాడుతూ క్యాన్సర్, ఇతరవ్యాధులకు కారణమయ్యే ప్లాస్టిక్ ను వాడకూడదనే సంస్థ వ్యవస్థాపకులైన ప్రకృతి కవి జయరాజు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ చర్చ్ లో నెలకు రెండు సార్లు అన్నదానం స్టీల్ ప్లేట్స్, గ్లాసులలోనే చేస్తూ సభ్యులకు ప్రకృతిపై అవగాహనను కల్పిస్తున్న సుబ్బలక్ష్మి ని ఆశ్రమం తరపున సన్మాన గ్రహీతగా ఎంపిక చేశామన్నారు. ఆమె గత 10 నెలలుగా ప్లాస్టిక్ నిషేధాన్ని ఆచరిస్తూ దీనివల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు అవగాహన కల్పిసున్నారని సుగుణ రావు తెలిపారు. ఆమె మాట విని అందరూ స్టీల్ పాత్రలనే వాడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి, ఆశ్రమ మెమంటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, బి.శివకుమార్, నాగేశ్వరరావు, అనిల్, సత్తిబాబు, విశ్వేశ్వరీ, శ్రీనివాస్, సౌందర్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సమిష్టిగా సాధిద్దాం

ఏరియా జీఎం షాలెం రాజు : కార్యాలయం ఆవరణలో 2026- వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఈ సంవత్సరం యువ రక్తంతో నిండిన సింగరేణి సంస్థను చూస్తున్నానని, ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్షాన్ని తప్పకుండా సాధించగలమని నమ్మకం ఏర్పడిందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు అన్నారు. కంపెనీ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి రవాణాలను కోరుకుంటుందని తెలిపారు. జి.ఎం కార్యాలయ ఆవరణలో గురువారం నూతన సంవత్సర - 2026 వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాలేం రాజు హాజరై కేక్ కట్ చేసి ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబాలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ కార్మికులందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించే క్రమంలో రక్షణతో చేయడానికి సహకారాన్ని అందిస్తున్న అధికారులకు, ఉద్యోగులకు, కార్మికుల సంఘ నాయకులకు అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థ ప్రతి ఉద్యోగ సంక్షేమానికి, ఆరోగ్యానికి లక్షలు ఖర్చు పెట్టడానికి వెనుకాడడం లేదన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండటం వల్ల ఉత్పత్తి లక్ష్యానికి ఉపయోగంగా ఉంటుందన్నారు. కొత్తగూడెం ఏరియా ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి రవాణాలలో ఎన్నో సరికొత్త రికార్డులను సృష్టిస్తూ తమ ఏరియా పేరు సింగరేణి రికార్డుల్లో నెలకొల్పడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దీనికి కారకులైన అధికారులు, ఉద్యోగులు, కార్మికులను జియం కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జిఎం తోపాటు ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎస్ఓ టు జిఎం జి.వి కోటిరెడ్డి, ఏజిఎంలు సిహెచ్.రామకృష్ణ బీభత్స, జి.వి మోహన్ రావు, ఏజెంట్ రామ్ భరోస్ మహతో, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిజిఎంలు ఎన్. యోహాన్, జై. క్రిస్టఫర్, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, యూనియన్ నాయకులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యతాయుతంగా జర్నలిజం చేయాలి

బూర్గంపాడు ప్రెస్ క్లబ్ మీడియా సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు : వక్తలు

విశాలాంధ్ర - బూర్గంపాడు : బూర్గంపాడు ప్రెస్ క్లబ్ మీడియా సొసైటీ ఆధ్వర్యంలో 2026 - నూతన సంవత్సర వేడుకలు ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నం హనుమంతరావు సారథ్యంలో ఉత్సహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ.టీ.సీ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాకాల దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంగువ రమేష్, ఐ.టి.సీ కాంట్రాక్టర్ మహేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందరరేగా అతిథులు క్లబ్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఏ ప్రజా సమస్యలైనా ప్రభుత్వం దృష్టికి, సమాజం ముందుకు తీసుకొచ్చేది తొలుత మీడియానే అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ప్రింట్ మీడియాలో పనిచేసే పాత్రికేయుల అవస్థలు తాము చూస్తున్నామని తెలిపారు. తమ వ్యక్తిగత జీవితాలు ఎంత కష్టంగా ఉన్న, సమస్యలతో కూడుకొని ఉన్నా చాలా మంది జర్నలిస్టులు నిజాయితీగా పని చేస్తూ ప్రజల సమస్యల పట్ల తపిస్తారని, ప్రభుత్వ దృష్టికి తెచ్చి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కొందరు అదుపు తప్పుతున్న సోకాల్డ్ పాత్రికేయులను కూడా ప్రెస్ క్లబ్ నాయకత్వంలో సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజం వృత్తి ఇష్టా రాజ్యాంగ, బ్లాక్ మెయిల్ విధానాలకు దూరంగా ఉండాలన్నారు. బాధ్యతయుతంగా వ్యవహరించే పాత్రికేయులకు సమాజంలో ఎప్పటికీ గౌరవం, విలువ ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా, నిజాయితీతో వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యతగా ఉండాలని ఆకాంక్షించారు. మీడియా అనేది ప్రజల గొంతుక అన్నారు. వర్తమాన కాలంలో అధిక మీడియా రాజకీయ మయం అవటం బాధాకరమన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా నిజమైన వార్తలను ప్రజల ముందుకు తీసుకురావాలని క్లబ్ సభ్యులకు అతిథులుగా వచ్చిన వక్తాలు సూచించారు. అలాగే, మీడియా సంక్షేమం కోసం ప్రెస్ క్లబ్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీ యమన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చెన్నం హనుమంతరావు, కార్యదర్శి మాజేటి రామకృష్ణ ఉపాధ్యక్షులు ముంతాజ్, రవికుమార్, జాయింట్ సెక్రెటరీ రాజేష్ రెడ్డి, ట్రెజర్ భరత్ కుమార్, పొగాకు లక్ష్మణ్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, వంశీ, నజీర్ భాష, సాయి కౌశిక్, సుధీర్, నిజం శివ, నవీన్, వెంకట్, మడకం లక్ష్మణ్, జీవన్ శౌర్య, పలువురు సభ్యులు పాల్గొన్నారు. నూతన సంవత్సరంలో క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని నిర్వాహకులు హామీ ఇచ్చారు.

నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలి

సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు : డైరెక్టర్లు సూర్యనారాయణ వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కంపెనీ నిర్ధారించుకున్నా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సమిష్టి కృషితో సాధించాల్సిన అవసరం ఉందని సంస్థ డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ (ఆపరేషన్స్), వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పిలుపునిచ్చారు. సింగరేణి వ్యాప్తంగా ఇప్పటివరకు 43 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర - 2026 వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సంస్థ డైరెక్టర్ సూర్యనారాయణ తోపాటు విశిష్ట అతిధిగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పరిధి లోని అధికారులకు, ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు, సెక్యూరిటీ డిపార్ట్మెంట్ తోపాటు యూనియన్ నాయకులు, కాంట్రాక్టు కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025-26 ఆర్థిక ఏడాది కంపనీ కి నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల బొగ్గు లక్ష్యానికి ఇంకా మూడు నెలలే సమయం ఉన్నందున ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగవలసిన అవసరం ఉందన్నారు. పనిగంటలను సద్వినియోగం చేసుకుని మన నిర్దేశిత లక్ష్యాలు సాధించడం కోసం ప్రతీ గని కార్మికుడు, సూపర్ వైజర్, అధికారులు కృషి చేయాలని కోరారు. 2025 సంవత్సరంలో సంస్థ చరిత్రలో ఎన్నడూలేని విధముగా అతి తక్కువ గని ప్రమాదాలు జరిగాయన్నారు. భవిష్యత్తులో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణ సూత్రాలు పాటిస్తూ "ప్రమాదరహిత సింగరేణిగా అవతరించాలని ఆకాంక్షించారు. అలాగే డైరెక్టర్లు మరో ముఖ్యమైన విషయంగా వివరిస్తూ 2030 నాటికి కంపెనీ 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటుందని ఆశాభవం వ్యక్తం చేశారు. అందుకు ప్రతీ సింగరేణీయుడు ముఖ్యంగా యువ కార్మికులు గట్టి దీక్షతో పనిచేయాలని సూచించారు. వివిధ వ్యాపార విస్తరణ చర్యల్లో విజయవంతంగా ముందుకు పోతున్న సింగరేణి సంస్థ ఇలాగే అభివృద్ధి పథంలో మరో వందేళ్లపాటు కొనసాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. దీని కోసం ప్రతీ కార్మికుడు, అధికారి తమను తాము సమర్ధవంతంగా తీర్చిదిద్దుకోవాల్సి ఉందన్నారు. ఇచ్చిన పని గంటలను సద్వినియోగం చేస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా రక్షణకు తోడ్పడాలన్నారు. సింగరేణియులందరూ ఆయురారోగ్యలతో, సుఖ శాంతులతో వర్ధిల్లాలని తెలియజేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు అందజేశారు. జిఎం (పర్సనల్) వెలోర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమములో జరిగింది. ఇందులో డైరెక్టర్లతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి. రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియూసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మీపతి గౌడ్, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఏ చట్టాలైన పేదలపైనే వర్తిస్తాయా..!

నిబంధనలు అధికారులకు ఉండవా!?

ఇసుక ర్యాంపుల కోసం చెట్లను నరికేస్తున్నారు..

విశాలాంధ్ర - మణుగూరు : ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం అటవీ చట్టాలు పేదలకు వర్తిస్తున్నాయని అధికారులకు మాత్రం రాజమార్గంగా మారాయని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ ఆరోపించారు. ఆమె గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. అనుమతులున్నాయని చెప్తూ గుట్టమల్లారం వద్ద రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లోని చెట్లను నరికి ఇసుక ర్యాంపుల కోసం రోడ్డు వేశారని ఆరోపించారు. ముఖ్యంగా పినపాక నియోజకవర్గం లోని మణుగూరు పరిసర ప్రాంతాల గ్రామాల్లో చర్ల మండలం పరిషత్ ప్రాంతాల గ్రామాల్లో ఇసుక మాఫియా ఘోరంగా తయారైందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారని చెబుతూ గుట్ట మల్లారం వద్ద ఇసుక ర్యాంప్ కోసం దశాబ్దాల నాటి వృక్షాలు పెద్దఎత్తున నరికి రోడ్లు వేసారని ఆమె ఆరోపించారు. అదే పేదవాళ్లు పోడు వ్యవసాయం చేసినా, ఇళ్ళు కట్టుకోవటానికి కొన్ని చెట్లు నరికితే ఫారెస్ట్ అధికారులు వెంటనే పెదలపై కేసులు బనాయించి జైళ్ళకు పంపిస్తున్నారని విమర్శించారు. అదే బడా కాంట్రాక్టర్లకు, బినామి ఇసుక మాఫియా గుత్తేదారులకు మాత్రం అటవీ చట్టాలు వర్తించవా అని సరోజ ప్రశ్నించారు. అడవిని రక్షించాల్సిన వారే లక్షల్లో మామూళ్లు దండుకుంటూ ఇష్టారాజ్యంగా చట్టాలను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ పల్లెల్లో ఇలాంటి దౌర్జన్యాలు, అక్రమాలు తట్టుకోలేక చాలామంది యువకులు తిరుగుబాటు చేస్తుంటారని, వారిపై రకరకాల కేసులు బనాయించి బెదిరింపులకు గురి చేస్తుంటారని ఆమె తెలిపారు. కమలాపురం, రాయిగూడెం వంటి ప్రాంతాల్లో పేదలు సొంత భూముల్లో అడ్డు ఉన్న తుప్పలు తొలగించి నివాసాలు ఏర్పాటు చేసుకుంటే వెంటనే స్పందించి అటవీ అధికారులు ఈ భూములు ఫారెస్ట్ భూమలని దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇసుక ర్యాంపుల కోసం వేల చెట్లు తొలిగించి, ప్రకృతికి, వన్య ప్రాణులకు ఆవాసం లేకుండా ఎలా చేసారని ప్రశ్నించారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అదే దారి గుండా వెళ్లే ఇసుక లారీల వద్ద రూ.100 నుండి రూ. 200 చొప్పున వసూలు చేసిన అటవీ అధికారులు ఎవరి అనుమతితో వసూలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుల కోసం సహజ సిద్ధమైన అడవిని నాశనం చేసి ఇప్పుడు అనుమతులు లేవంటూ సిగ్గులేకుండా మాట మారుస్తున్నారని, జలపాతాలకు కోసం దారి తీశామంటూ ఇప్పుడు చెబుతున్నారని విమర్శించారు. నరికిన చెట్లకు, జలపాతాల దారికి పొంతన లేదన్నారు. అధికారులకు అనుమతులు ఏ పేర ఉన్నాయో బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై రాష్ట్ర అటవీ అధికారులను, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ను కలిసి ఫిర్యాదు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. అవసరమైతే దశల వారీగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకురాలు ఎండి. షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, దాకూరి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సారపాకలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర - బూర్గంపాడు : సారపాక పట్టణంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు స్నేహితులతో నిర్వహించారు. గురువారం బీపీసీ యూట్యూబ్ ఛానల్ ఆవిష్కరణ కార్యక్రమం ప్రెస్ క్లబ్ ఆఫ్ బూర్గంపాడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీహరిబాబు అధ్యక్షత వహించారు. ఐటిసి భద్రాచలం యూనిట్ హెడ్ శైలేంద్ర సింగ్ మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీపీసీ యూట్యూబ్ ఛానల్ లోగోను ఆవిష్కరించారు.తదుపరి తాళ్లూరి శ్రీహరిబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మూల వెంకటరమణ రెడ్డి, క్లబ్ కార్యదర్శి ఆవుల మహేశ్వర రెడ్డి ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, సారపాక గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన్నేదారి రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ బిక్కసాని శీను, మాజీ ఎంపీటీసీ సభ్యులు వల్లూరి వంశీకృష?, ఐటిసి గుర్తింపు సంఘం యూనియన్ నాయకుడు కనకమెడల హరిప్రసాద్, సీపీఎం, బిజెపి నాయాకులు బత్తుల వెంకటేశ్వర్లు, ఏనుగుల వెంకటేశ్వర రెడ్డి, వ్యాపారవేత్త జలగం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో స్కోడా ఆటో రజతోత్సవ సంవత్సరంలో విస్తరణ

ముంబై: స్కోడా ఆటో 2025 సంవత్సరాన్ని భారతదేశంలో తన ప్రయాణంలో ఇప్పటివరకు అత్యంత కీలకమైన సంవత్సరంగా గుర్తించింది. దేశంలో తన 25వ వార్షికోత్సవాన్ని అత్యంత బలమైన అమ్మకాల పనితీరుతో జరుపుకుంది. ఈ బ్రాండ్ 2025 సంవత్సరాన్ని 72,665 కార్ల అమ్మకాలతో ముగించింది. ఇది 2024లో విక్రయించిన 35,166 యూనిట్లతో పోలిస్తే సంవత్సరానికి 107% వృద్ధిని నమోదు చేసింది. ఈ అసాధారణ పనితీరు 2025ను స్కోడా ఆటో ఇండియా చరిత్రలోనే అతిపెద్ద సంవత్సరంగా నిలిపింది. ఇది ఉత్పత్తులు, మార్కెట్లు, కస్టమర్ టచ్‌పాయింట్‌ల అంతటా వేగవంతమైన వృద్ధిని ప్రతిబింబిస్తుంది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, 2025 సంవత్సరం మాకు ఎప్పటికీ ఒక ప్రత్యేకమైనదిగా నిలిచిపోతుంది. ఇది భారతదేశంలో మా 25వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది, ఈ సంవత్సరంలో మేము మా అత్యంత మెరుగైన, విభిన్నమైన ఉత్పత్తి శ్రేణిని కలిగి ఉన్నామన్నారు. 2025లో స్కోడా ఆటో ఇండియా పనితీరు స్పష్టమైన ఉత్పత్తి, నెట్‌వర్క్ వ్యూహంపై ఆధారపడి ఉంది. కైలాక్ ఒక కీలక వృద్ధి చోదకంగా ఉదవించి, బ్రాండ్ లభ్యతను గణనీయంగా విస్తరించింది.

టాటా మోటార్స్ త్రైమాసికంలో 1,15,577 యూనిట్ల అమ్మకాలు

ముంబై: దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో క్యూ3ఎఫ్‌వై25లో 95,770 యూనిట్లతో పోలిస్తే, క్యూ3ఎఫ్‌వై26లో అమ్మకాలు 1,15,577 యూనిట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్ 2025లో దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు 42,508 యూనిట్లుగా నమోదయ్యాయి, ఇది డిసెంబర్ 2024లో నమోదైన 33,875 యూనిట్లతో పోలిస్తే ఎక్కువ. డిసెంబర్ 2025లో ఎంహెచ్, ఐసీవీల దేశీయ అమ్మకాలు 20,363 యూనిట్లుగా ఉన్నాయి, డిసెంబర్ 2024లో ఇది 15,968 యూనిట్లుగా ఉంది. క్యూ3ఎఫ్‌వై26లో ఇది 53,105 యూనిట్లుగా ఉంది, క్యూ3ఎఫ్‌వై25లో ఇది 44,023 యూనిట్లుగా ఉంది. డిసెంబర్ 2025లో దేశీయ, అంతర్జాతీయ అమ్మకాలు 21,646 యూనిట్లుగా ఉన్నాయి, డిసెంబర్ 2024లో ఇది 16,604 యూనిట్లుగా ఉంది. క్యూ3ఎఫ్‌వై26లో అమ్మకాలు 57,080 యూనిట్లుగా ఉన్నాయి. ఇది క్యూ3ఎఫ్‌వై25లో నమోదైన 46,108 యూనిట్లతో పోలిస్తే ఎక్కువ. టాటా మోటార్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ గిరీష్ వాఘ్ మాట్లాడుతూ, "జీఎస్టీ 2.0 మరియు క్యూ2ఎఫ్‌వై26లో పండుగల కారణంగా వచ్చిన అమ్మకాల జోరు క్యూ3ఎఫ్‌వై26లో కూడా కొనసాగింది, ఇది వృద్ధిని సాధించడంలో, వాణిజ్య వాహనాల పరిశ్రమ మొత్తం సెంటిమెంట్‌ను పెంచడంలో సహాయపడిందన్నారు.